# విషయసూచిక


1. తిరిగి తెచ్చుకొను విషయమై నిరీక్షణ ............ 1

2. గొఱ్ఱెల పాఠము ............ 13

3. దావీదు యొక్క మొదటి నష్టము ............ 20

4. దావీదు పొందిన రెండవ నష్టము ............ 28

5. దావీదు పొందిన మూడవ నష్టము ............ 43

6. నష్టము : దానికి కారణము, దాని ఫలితము, దానికి మందు ............ 53

7. తిరిగి పొందుటలోని ఒక రహస్యము - విధేయత ............ 62

8. నష్టమునకు కొన్ని కారణములు ............ 74

9. దావీదుకు కలిగిన నాల్గవ నష్టము ............ 89

10. తిరిగి పొందుటలో గల రహస్యములు ............ 95

11. దేవుని దైవ నియమములు ............ 112

12. దేవుని శక్తి గలవారమై యుండుటలోని రహస్యము ............ 123

## 1వ అధ్యాయము

# తిరిగి తెచ్చుకొను విషయమై నిరీక్షణ

(1 సమూయేలు 30)

దావీదును అతని జనులును ఒక గొప్ప నష్టము పొందియుండిరి. అమాలేకీయులు వారందరి ఇండ్లను తగులబెట్టివేసి, వారి స్త్రీలను, బిడ్డలను చెరబట్టుకొని, వారి సొత్తు నంతయు దోచుకొనిపోయి యుండిరి. అదెంత గొప్ప నష్టమనగా బలశాలులై యుండియు, ఈ పురుషులు ఎలుగెత్తి ఏడ్వసాగిరి. స్త్రీలైతే ఎప్పుడైనను ఎక్కడైనను ఏడ్వగలరు, వారిని ఎవరు కూడ ప్రశ్నించరు. వారు ఉదయమైనను, మధ్యాహ్నమైనను, సంధ్యావేళయైనను ఏడ్వగలరు. బస్సులోనైనను ఏడ్వగలరు, రైలుబండిలో ఏడ్వగలరు, ప్లాటుఫార్మ్ (Plot (orm) మీద ఏడ్వగలరు, ప్లాటుఫార్మ్ వెలుపల ఏడ్వగలరు, ఒక దినములో ఎన్నిమారులైనను ఏడ్వగలరు. 'ఎందుకీలాగు ఏడుస్తున్నావు!" అని ఎవరూ వారిని ప్రశ్నించరు. పురుషులు ఏడ్చిన ఎడల ఏదో ప్రమాదమైన కారణామే ఉండవలెను. ఇక్కడ చూచినట్లయిన యుద్ధవీరులు ఎంత అధికముగా ఎంత గట్టిగా ఏడ్చుచుండిరనగా తుదకు ఏడ్చుటకు శక్తిలేని వారైరి (వ. 4.). కన్నీరంతయు కార్చివేయబడెను. గొంతుకలు రాచుకొని పోయియుండెను.

తలనొప్పి పట్టుకొనెను. ఇకను ఏడ్వజాలకుండిరి, అంత గొప్ప నష్టము వారికి కలిగియుండెను. మానవరీతిగా చూచినట్లయిన పోయినది ఏదైనా తిరిగి దొరుకుట వట్టిమాట.

అదే అధ్యాయమందు ఈ విషయము గూడ చదువుచున్నాము. దేవుని కృపా సహాయముల వలన పోగొట్టుకొనిన వాటినెల్ల తిరిగి తెచ్చుకొనుటయేగాక, మరింత అధికముగా కూడా తెచ్చుకొనిరి. అదివరకు ఎన్ని సంవత్సరములు అప్పుపడి యుండిరో ఆ అప్పునంతయు తీర్చివేయ గలుగునంతటి విస్తారముగా తెచ్చుకొనిరి. అన్ని సంవత్సరములు ఎక్కడెక్కడ సంచరించుచుండిరో, వారు బసచేసిన స్థలము కొరకుగాని, పొందిన ఆహారము కొరకుగాని, ఏమి పైకము చెల్లించ లేకపోయియుండిరి. కొన్ని దినములు లేక కొన్ని మాసములు ఒక స్థలముందు బసచేసి యుండినను, లేక దీర్ఘకాలము నివసించి యుండినను, వారికి నీడ, ఆహారము ఇవ్వబడెను. మనము లేఖనములను బట్టి చూడగా ఎవరెవరు తనకు దయ చూపియుండిరో, ఆ సమస్త విషయములు దావీదు వ్రాయించి యుంచెను. సజ్జనులు అనేకులు అతనికి మాంసము, పప్పు, కోడికూర ఇచ్చిరి. అప్పుడు వంటచేసి పదార్థములను ఇచ్చిన వారెవరో పాసిపోయిన పదార్థములను ఇచ్చిన వారెవరో కూడ, దావీదు ఎరిగి యుండెను. వచనములు 27 నుండి 31 వరకు చూడుము, కొద్ది రోజులలో, చాల రోజులలో తానెక్కడ నుండునో, ఆ స్థలముల పట్టి ఇవ్వబడియున్నది. మరియు కొద్ది రోజులకైతేనేమి, అనేక రోజులకైతేనేమి దావీదు నివసించి యుండిన ప్రతి స్థలమునకు తాను పొందిన దయ నిమిత్తమును, తన అప్పు తీర్పు నిమిత్తమును దావీదు బహుమానములు పంపుచున్నట్లు 31వ వచనము తెలుపుచున్నది.

ఏదైనా పోగొట్టుకొనిన ఎడల మనకు ఎంతో మనస్సు కష్టముగా నుండును, మనమందరము కూడ ఏదో ఒక వస్తువును ఎప్పుడైనా, ఎక్కడైనా పోగొట్టుకొని యున్నవారమే. కొన్ని పోగొట్టుకొన్నప్పుడు మరి కొందరు ఏడ్చియున్నారు. కొందరి తాళపు చెవులు పోయినవి. కొందరు ఫౌంటెన్ పెన్నులు, మరికొందరు గొడుగులు మరిచి ఎక్కడో విడిచిరి. రైలుబండిలో పడకను చుట్టి మరచినవారు, చేతి గడియారములను మరచినవారు ఇట్లు అందరము నష్టములు పొందినవారమే. దేనిని పోగొట్టుకొన్నను మనస్సులో బాధగా నుండును. పోయిన వస్తువు ఏమైనా తిరిగి దొరికితే ఎంత సంతోషము! పోగొట్టుకొనినది ఏదైనా తిరిగి దొరికిన ఆ సంతోషమే ఒక విధమైనది. అది తిరిగి దొరుకుట వట్టిదే ననుకున్నప్పుడు దానికి మరింత ఆనందము.

కొన్ని ఏండ్ల క్రిందట, మా టెలిఫోను బిల్లు ఒకటి కట్టు నిమిత్తము హెబ్రోనులో నుండు ఒక సహోదరునికి రూ. 130 ఇవ్వబడెను. ఆయన ఆ కాగితమును సొమ్మును కూడ ఒక డ్రాయరులో ఉంచెను. ఆ దినమున ఆయన చాలా పనిమీద నుండుట వలన మరునాడు కట్టవచ్చని తలంచెను. ఆ మరునాడు కూడ పని ఏమియు తగ్గియుండలేదు. కావున ఆపై వచ్చే దినము బిల్లు కట్టుదాములే అనుకొనెను. మూడవనాడు ఆ బిల్లు కట్టుటకై సొమ్ము తీయబోయెను. బిల్లుగాని సొమ్ముగాని కనబడలేదు. ఆఫీసు అంతట వాటి కొరకు వెదకెను. ప్రతి డ్రాయరు, ప్రతి అల్మైరా తెరచి చూచి మరియు ప్రతి మూలలో కూడ వెదకెను. బిల్లుగాని నోట్లుగాని కనబడనే లేదు. మేమందరము కూడా బహుగా విచారించితిమి. వీరిమీద, వారిమీద అనుమానములు కూడ కలిగెను. ఇతడు తీసి యుండునా? అతడు తీసి యుండునా? ఆఫీసులో ఉన్న వారందరిమీద మాకు అనుమానములే. అందుచేత ఆ దినమే క్రొత్త తాళములు

కొని, చాలా బందోబస్తు చేసితిమి. రెండు నెలలు గడచిన తరువాత ఆ కట్టడములోని గదులను ప్రతియొక దానిని శుభ్రము చేయుచు, ఆ పని చేయుచున్నవారు వెనుక గదిని చేరిరి. అక్కడ ఒక అల్మేరా ఉండెను. దానివెనుక శుభ్రము చేయవలెనని అల్మేరాను ప్రక్కకు జరిపినప్పుడు గోడలో ఒక రంధ్రమును చూచిరి. మాయమైపోయి యుండిన ఆ బిల్లు, నోట్లు ఈ రంధ్రమందుండెను. ఈ గదినుండి ఆ గదికి వీటిని రవాణా చేసిన దొంగలు మంచిబుద్ధి కలిగినవియును, ఆరితేరిన ఎలుకలునై యుండవలెను. ఆ సొమ్ము ఇక మాకు దొరుకునను నమ్మకమే వదలుకొని యుంటిమి. అయినప్పటికీ, "ప్రభువా! ఏలాగైనా ఆ సొమ్ము మాకు దొరుకునట్లు చేయుము, ఆ దొంగను మాకు అప్పగించుము" అని ప్రార్థించుచునే యుంటిమి. ఇప్పుడు బిల్లు, పైకము గూడ తిరిగి సంపాదించుకొంటిమి. కొంత కాలమైన పిమ్మట దొంగను కూడ పట్టుకొంటిమి. ఇక మా సంతోషము చెప్పవలెనా! ఆవరణమందున్న ప్రతివారు పోయిన సొమ్ము దొరికింది" అనుచు ఆనందించిరి.

ఆత్మీయ నష్టము గూడ ఇట్లే. మన తప్పులు మన పతనముల వలన ఆత్మీయ నష్టములు అనేకములు పొందుచున్నాము. అనేకులకు సంతోషమనునది అడుగంటినది. కష్టాలు పరీక్షల వలన కొందరి విశ్వాసము కూడ అడుగంటి యుండవచ్చును. కొందరికి దైవసాన్నిధ్యమైన గ్రహింపు గతించి యుండవచ్చును. కొందరు దేవుని చిత్తమును తెలిసికొను రహస్యము ఇంకను నేర్చుకొని యుండలేదు. అనేకులు వారు నూతన జన్మము పొందిన ప్రారంభమందు కలిగియుండిన శక్తిని పోగొట్టుకొనిరి. ఇతరులు వారి మొదటి ప్రేమను విడిచిపెట్టిరి. ఆత్మీయ నష్టము పొందిన హృదయములు ఎన్నో గలవు. బైబిలు చదువుటయందు పూర్వమున్న అసక్తి ఉండుట లేదు. ప్రార్థన

చేయుటకు పూర్వముండిన భారము ఇప్పుడు పోయినది. కొందరు బహిరంగముగాను, కొందరు రహస్యముగాను ఏడ్చుచున్నారు. అయితే పోగొట్టుకొనిన దానిని తిరిగి తెచ్చుకొనుటకు విశ్వాసము లేక యున్నారు. తిరిగి తెచ్చుకొనవలెనను ఆశగలదు అయితే ఎట్లో ఎరుగరు. పైగా తిరిగి తెచ్చుకొనగలమను నమ్మకమే వదలుకొనిరి. తమ హృదయములలో ఏమనుకొనుచున్నారనగా - "పూర్వముండిన సంతోష సమాధానములు నాకు తిరిగి దొరుకవేమో, పూర్వమువలె ప్రభువు సేవ ఇక చేయజాలను" అనుచున్నారు. ఆత్మీయముగా నీవు పోగొట్టుకొనినది ఏమైయుండినను సరే, ఇదిగో నీకు ఒక వర్తమానము ఇచ్చుచున్నాము. ఏ కారణము చేత నీకు ఆ నష్టము కలిగియుండినను, యేమియు మించిపోలేదు. పోగొట్టుకొనినది నీకు దొరకగలదు. అంతేకాదు నీవు పోగొట్టుకొనిన దానికంటె మరింత అధికముగా నీకివ్వబడును.

బైబిలు గ్రంథము ఆరంభించడమే, ఒక గొప్ప నష్టము యొక్క కథతో ఆరంభించబడెను (ఆది కాండము 3:24). అయినను ఇదే పుస్తమందు దేవుడు మానవునికి ఒక నిశ్చయతను అనుగ్రహించుచున్నాడు. అదేమనగా ఆదియందు ఆదాము సమస్తమును పోగొట్టుకొని యుండినను, అదంతయు మన ప్రభువైన యేసుక్రీస్తు ద్వారా నరుడు తిరిగి తెచ్చుకొనగలడు. ఆదికాండము 1:28లో దేవుడు ఆదామును ఏదేను వనమందు ఉంచియున్నాడు. మరియు యావత్తు లోకముమీద, చేపలు, పక్షులు, జంతు జాలములపై సహితము అతనికి అధికారము, పరిపాలన ఒసగియున్నాడు. లోకము అంతటికి ఆదాము నిశ్చయముగా అధిపతియై వుండెను. 3వ అధ్యాయమునకు వచ్చితిమి. ఒక దొంగ ఎట్లు తరిమి వేయబడెనో, ఆదాము అట్లే తరిమి వేయబడెను; తరిమి

చేసినవాడు దేవుడేయని ఆయన వాక్యము చెప్పుచున్నది. ప్రారంభమందు మనిషితో మనిషి మాట్లాడే రీతిలో, ఆదాము దేవునితో మాట్లాడుచుండెను. ఇప్పుడైతే దేవుని సన్నిధి నుండి తరిమి వేయబడి యున్నాడు. ఏదేను వనములోని తన గృహము నుండి త్రోసివేయబడి, అతని హక్కులన్నియు కోల్పోవలసి వచ్చెను. ఇంతకంటె నష్టముండునా? ఆది పురుషుడైన ఆదాము పొందిన నష్టము ఇంత యంతయని ఎవడును ఒక అంచన వేయజాలడు. ప్రక. 21, 22లో చూడుము. ఆదికాండము 3లో పోయినవన్నియు తిరిగి దొరికియుండుట చూచుచున్నాము. పాత సృష్టి యొక్క మహిమను అత్యంతముగా మించినట్టి మహిమ గల క్రొత్త సృష్టిని మనుష్యుడు పరిపాలించుట కనుబడుచున్నది.

ఆదికాండము 3లో నరుడు పోగొట్టుకొనిన దానికంటె అత్యధికముగానే దేవుడు అతనికి యిచ్చియున్నాడు. తిరిగి సంపాదించుకొను ఈ కార్యము దేవుడు సిలువ శక్తి వలన ప్రారంభించెను. ఈ కారణముచే గొర్రెపిల్ల అనుపదము ప్రకటన గ్రంథమందు 28 మారులు చెప్పబడియున్నది. వర్తమానము ఇది - ప్రతి పాపి యొక్క నష్టము మరియు ప్రతి విశ్వాసిని కలిగిన నష్టము దేవుని కృపా సహాయములతో తిరిగి సంపాదించుకొనవచ్చును. ఇది కల్వరిలో ప్రత్యక్షమగుచున్నది.

మనుష్యులను రెండు వర్గాలుగా భాగింపవచ్చును. రక్షణ పొందని వారున్నారు. వారు ఇప్పటికింకను నిజమైన సమాధానము పొందకయున్నారు. వారు తమ పాపములను దేవుడు క్షమించి యున్నాడని చెప్పజాలరు. వారికి దేవుడు లేడు, వారి జీవితము అపజయము, దుఃఖము, అంధకారములతో నున్న జీవితము. లోకమందు దేనినిగాని తమ స్వంతమని చెప్పజాలరు.

దారిద్ర్యమందు మునిగి, దినదినము తమ సమయమును, ద్రవ్యమును, శక్తిని వ్యర్థ పరుచుచు నున్నట్టి బిచ్చగాండ్రు వీరు. అంధకారమందు పడియుండి జీవితమంతయు పాడుచేసికొని పోగొట్టుకొనునట్టి వీరిది ఒక వర్గము. మరణించుచుండగా మతి ఉన్నను మతి పోయి ఉండినను "నా జీవితమంతా వ్యర్థమైపోయింది. ఇప్పుడు చచ్చిపోతున్నాను. జీవితమంతా పాడైపోయింది" అని ఎంతో దు:ఖముతో తాము కలిగియుండినది తాము చేసినది అంతయు వ్యర్థమాయెనని ఒప్పుకొనుచున్నారు.

నీ హృదయమును యథార్థముగా పరీక్షించుకొనుము. దేవుని ఎదుట నీ జీవితము ఎట్లున్నది. నీ జీవితము వ్యర్థ పుచ్చుచున్నావా? నీ సమయమును, ద్రవ్యమును, శక్తిని ఎట్లు వినియోగించుచున్నావు? వీటి వలన నీ జీవితమందు ఏదైన సార్థకము అగుచున్నదా? వీటివలన నీకు నిజమైన సంతోష సమాధానములు కలుగుచున్నవా? నీవు దేవునికి ఏ విధముగానైనను పనికి వచ్చుచున్నావా? దేవుడు నీ జీవితమును కొంత ఉపయోగించెనని చెప్పగలవా! నీ యెడల నీవే సత్యముగాను యథార్థముగాను ఉండుము.

పాపివై యున్నందున నీ జీవితము నిశ్చయముగా వ్యర్థమగుచున్నది. లేఖనములలో మన నీతి సహితము మురికి గుడ్డలుగా ఎంచబడుచున్నది. మనము ధనికులము గొప్పవారమని చెప్పుకొనినను ఎంతో డబ్బు గడించిగలమని డంబములు పలికినను, పాపమందు జీవించుచున్న వారమైతే మన శ్రేష్ఠమైన యత్నములను కూడ, దేవుడు మురికి గుడ్డలకు పోల్చుచున్నాడు. నేను కొన్ని చింపి గుడ్డలను చూచి యున్నాను. అవి ఎంత మైల, కుళ్ళుతో నున్నవనగా - పనికిమాలిన బిచ్చగాండ్రు, కుష్ఠులు కూడ వాటిని ముట్టరు. మానవ

హృదయములు ఇట్టివే. మైలతో ఊరిపోయియున్నవి. శుభ్రమగుట వట్టిమాట. దేవుని దృష్టియందు "మన నీతియే మురికి గుడ్డలవంటిది" (యెషయా 64:6) మన పాపములు క్షమించబడి మన హృదయములు కడుగబడని యెడల మన జీవితములు మురికి గుడ్డలే. మన సమయము, డబ్బు, శక్తి సమస్తము వ్యర్థమే; అయితే దేవునికి స్తోత్రము మన హృదయములు కడుగబడిన యెడల దేవుని మందిరమందు ప్రశస్తమైన రాళ్ళుగా మార్చి వేయబడగలము. నీ పాపము క్షమింపబడుటకు నీవు ఇష్టముతో కోరుచున్నావా? మనము పోగొట్టుకొనిన సమస్తమును తిరిగి పొందవలెనని యేసుక్రీస్తు లోకమునకు వచ్చి మరణించి, తిరిగి లేచెను. ఇన్ని ఏండ్లు మన జీవితములను మనము వ్యర్థపరచి యుండినను, దేవుని జత పనివారముగాను, పాలి భాగస్థులముగాను తిరిగి కాగలము (1 కొరింథీ 3:9).

ఒక మంచి పొలములోగాని, వనములోగాని, ఒక మంచి తోటమాలి పని చేయుచుండుటను చూచియున్నావా? ఆ భూమిని వాడుకొనుటకు ముందుగా ఎంతో సిద్ధము చేయుచున్నాడు, ఒకప్పుడు ఆ భూమి రాళ్ళ రప్పలు, ముండ్లతో నిండి యుండవచ్చును. కొన్ని మాసములు గడచిన పిదప, అదే నేల విస్తారమైన పంటతో లేక రంగుల పుష్పములతో నిండియుండును. ఆ నేలలోని ప్రతి అంగుళము ఉపయోగింపబడినది. ఇంతటి మార్పు కలుగుటకు రాత్రింబగళ్ళు బహుగా పాటుపడవలసి వచ్చెను. ఆ భూమిని సిద్ధము చేయుపని అధికముగా నుండెను. ప్రతి రాయి తీసి పార వేయవలెను. పిమ్మట విత్తనము వేసి అనుదినము నీరు పెట్టవలెను. అటు తరువాత వారముల కొలది, మాసముల కొలది ఆ తోటను కాపు కాయవలెను. ఈ సుందర పుష్పవనము, యీ నిండు పంటలతో తూల తూగుచున్న పొలము, అనాటి పనికిమాలిన

భూమియేనా? యని చివరిగా ఆశ్చర్యమొందుదుము. ఇట్లే మనలను మురికి గుడ్డలకు పోల్చిన దేవుడు "నా రమ్యమైన పంట, నా సుందరవనము" అని చెప్పగలుగును. జీవిత రూపాంతరము యీ రీతిని కలుగగలదు. పాపము వలన పోగొట్టుకొనిన సమస్తము తిరిగి పొందుట సాధ్యమే. నీ పాపము వలన నీవు చెడ్డపేరు తెచ్చుకొంటివి. నీ కుటుంబమునకు అపకీర్తి, దేవుని నామమునకు అవమానము తెచ్చి పెట్టితివి. నీ పాపము వలన నీ జీవితమును, నీ ఆరోగ్యమును నీ శరీరమును పాడు చేసికొంటివి. నీ పాపముల వలన దేవునికి దూరస్థుడవైతివి, దేవుని సంబంధమైన విషయములు నీవు ఏ మాత్రమును గ్రహింప జాలక నున్నావు. దేవుని దృష్టి యందు నీవు బుద్ధి లేనివాడవే. నీవు చేయుచున్న ప్రతిదియు వ్యర్థమే. నిరీక్షణ లేకయే మరణింతువు.

నీ జీవితములో మార్పు పొంద గోరుచున్నావా? నీకొక వర్తమాన మిదిగో. యేసు క్రీస్తు ప్రభువు యొక్క పాదములను చేరుము. నీ పాపముల విషయము దుఃఖించుచు పశ్చాత్తాప హృదయుడవై రమ్ము. యీ దినమే ప్రభువు నిన్ను క్షమించి మార్చివేయును. ఆయన యీ లోకమునకు రావడమే నిన్ను వెదకి రక్షించుటకు.

31 ఏండ్ల క్రిందట నా జీవితము వ్యర్థమగుచుండెను. అంతయు సంపూర్ణముగా వ్యర్థమగుచుండెను. అవమానపు, అపజయమైన, ఫలములేని బ్రతుకు బ్రతుకుచుంటిని. ఇప్పుడైతే నా మాటలు, నా క్రియలు నిత్యత్వమునకు వుండిపోవునట్టి విలువ కలిగి యున్నవని సాక్ష్యమివ్వగలను. చేయరానిది ఏదైన చేసిన యెడల నా ప్రభువు వెంటనే నన్ను దిద్దుచు, శిక్షించుచు తిరిగి రాబట్టుకొనుచున్నాడు.

దావీదుకు నాలుగు పెద్ద నష్టములు తన జీవిత కాలమందు కలిగినవి. విశ్వాసులమైన మన జీవితకాలమందు కూడ పెద్ద నష్టములు మనకు సంభవించును. పోగొట్టుకొనినవి దావీదుకు తిరిగి లభించుట వట్టి మాటయేగాని దేవుడు అతనికి తోడ్పడుట వలన ఆ నాలుగు పెద్ద నష్టములలో పోయినవి తిరిగి దొరికెను. మరియు అంతకంటె అధికముగా విస్తారముగా దొరికెను. ప్రభు యేసుక్రీస్తు నందు విశ్వసించిన మనకు సహితము ఎన్నో నష్టములు, సందేహించుట, బుద్ధిహీనత, గ్రుడ్డితనము, అపజయము వలనను సంభవించును. అయితే, దేవుని వాక్యమందు మనము తెలిసికొనునది ఏమనగా, విశ్వాసి ఆత్మీయముగా పోగొట్టుకొనిన ప్రతిదియు తిరిగి పొందగలడు.

1947లో, మన దేశమంతటిని భారతదేశముగాను, పాకిస్తానుగాను విభజించినప్పుడు, హిందువులు, సిక్కులు అనేకులు తమ ఇండ్లనుండి తరిమి వేయబడిరి. వారు ఏమేమి విడిచిపోయి యుండిరో ఏమేమి పోగొట్టుకొని యుండిరో, ఒక పట్టీ తయారు చేయమని, ప్రభుత్వము చెప్పగా ఏదో కొంత మట్టుకైనను వారి నష్టమును తీర్చునని, వారు పట్టీలను ప్రభుత్వమునకు అందజేసిరి. అనేకులు దొంగ పట్టీలు తయారు చేసిరి. 6000 రూపాయలు నష్టపడియుంటే 26000 రూపాయలు వేసిరి. లౌలిక జ్ఞానమనగా నిదే. దేవుని యెడల నీ ఎడల కూడా యదార్థముగా నుండుము, అప్పుడు నీవు పొందిన నష్టమును దేవుడే నీకు తిరిగి సంపాదించనిమ్ము. యిట్లు ప్రార్థన చేయుము : "ప్రభువా! నేను పోగొట్టుకొనినదంతా నేను తిరిగి పొందేలాగున సహాయము చేయుము" నీవు సమాధానమును పోగొట్టుకొంటివా? సంతోషమును పోగొట్టుకొంటివా? నీ విశ్వాసము తగ్గిపోయెనా? సందేహములతో నీ మనస్సు నిండియున్నదా? దేవుని వాక్యము కొరకు నీకుండిన ఆకలి పోయేనా?

కుంభమంత అన్నము తినే కొందరిని నేనెరుగుదును. మొదటిసారి రెండవసారి మూడవసారి ఒకప్పుడు నాలుగు పర్యాయములు కూడ వడ్డించుకొందురు. ఒక డజను చపాతీలు, ఒక డజను పూరీలు పెరుగు అవి ఇవి కలిపి ఎక్కించగలరు. ఇట్టివారు జబ్బు పడినపుడు ఒక ముద్ద అన్నముగాని చిన్న రొట్టె ముక్కగాని వారికి సహించదు. ఇట్టివాడు తిండి వద్దు అని అనుచుండగా చూచిన వారికి అతడు తప్పక జబ్బుగా నున్నాడని తెలిసిపోవును. "వీడు ఇంతింత మెక్కడము నా కండ్లతో చూచినాను కదా! ఇదేమిటి ఇప్పుడు ఏదీ వద్దంటున్నాడు బలవంతంగా తినిపించ వలసి వుంది!" అనుకొందురు.

దేవుని వాక్యము యెడల నీకుండిన ఆశ ఏమైపోయినది! నీవు క్రైస్తవుడవైన క్రొత్తలో ఆ మొదటి దినములందు రోజుకు ఎన్నో అధ్యాయములు చదువుచుంటివి. ఎంతో ఉత్సాహముతో ప్రతి కూటమునకు వెళ్ళుచుంటివి. ఇప్పుడైతే సగము అధ్యాయము చదవడమే విసుగుగా నున్నది. దేవుని వాక్యము కొరకు ఆకలి పోయినది. ప్రార్థనా భారము పోయినది. దేవుని వాక్యమును గ్రహించుట పోయినది. దేవుని సాన్నిధ్యమందు హర్షించు విధము నీకు తెలియకున్నది. దేవుని మందిరమందు ఎన్నో విధములైన ధన్యతలను పోగొట్టుకొంటివి. ఉన్నది ఉన్నట్లు నీవు పొందిన నష్టములన్నియు దేవునితో చెప్పుకొని ఇట్లు ప్రార్థించుము – "ప్రభువా! నేను పోగొట్టుకొనిన సమస్తమును తిరిగి తెచ్చుకొనుటకు సహాయము చేయుము." దేవుని వాక్యమునీకు నిశ్చయతను ఇచ్చుచున్నది. అదేమనగా పోగొట్టుకొనినదే కాదు, మరింత అధికముగా తెచ్చుకొందువని చెప్పుచున్నది. ఇంగ్లాండులో కొన్ని లాండ్రీలు (laundries) గలవు. అక్కడ నీవు వేసిన బట్టలు పోయినను, చినిగినను లాండ్రీవారు నీకు ఇట్లు వ్రాయుదురు "మీరు ధోతి ఇచ్చినారో లేక జుబ్బా

నిచ్చినారో మీరు వేసిన బట్ట కనబడడము లేదు (లేక చినిగిపోయినది). మాకు చాలా విచారము. ఆ వస్త్రము ఏమిటో మాకు తెలిపితే దానికి బదులు తీర్చుదుము." నీవు వారికి అప్పగించిన వస్త్రము వారి యొద్ద పోయినను చినిగినను నీకు కలిగినంత నష్టమును తీర్చుదురు. నీ దగ్గర నుండి జవాబు అందగా - "మీ కొలతలు మాకు తెలుపండి, మీకు క్రొత్త వస్త్రమును ఇత్తుము" అందురు. నీవు నష్టపడిన కోటు పాతది అయినను, నీకు క్రొత్తదానిని ఇత్తురు. ఈ అనుభవము నాకు ఇంగ్లాండులో జరిగినది. ఇండియాలో కాదు సుమీ! ఒకానొకప్పుడు లాండ్రీలో నా కోటును పాడుచేసిరి. క్రొత్త కోటు కొరకు నాకు పైకమునిచ్చిరి. ఆ సొమ్ముతో దానికంటె మంచికోటునే కొనుక్కొంటిని. ఇంగ్లాండు నాకు చేసిన దానికంటె మరింతగా దేవుడు నీకు చేయును. నీవు పోగొట్టుకొనిన దానికంటె మరింత అధికముగా ఆయన నీకిచ్చును. నీవు చేయవలసిన కార్యమిది - నీతితోను యదార్థముగాను సత్యము చెప్పి, నీ నష్టము విషయము అంతయు ఆయనకు తెలుపుము. ఇప్పుడు మనము పఠింపబోవు దేవుని వాక్యమందు దావీదు యొక్క నాలుగు నష్టములలో పోయిన వాటిని అతడు ఎట్లు తిరిగి తెచ్చుకొనెనో చూచిన పిమ్మట, ఆత్మీయముగా మనము పోగొట్టుకొనిన సమస్తమును ఎట్లు తిరిగి తెచ్చుకొనగలమో తెలిసికొందుము.

# 2వ అధ్యాయము

# గొడ్డలి పారము

(2వ రాజులు 6:1-7)

అనేకమంది తమ జీవితములో ఎల్లప్పుడు ఆత్మీయ నష్టము పొందుచునే యుందురు. అయితే పోగొట్టుకొనిన సమస్తమును మనము తిరిగి పొందవలెననియే దేవుడు కోరుచున్నాడని నా నమ్మకము. మనకు ఆయన ఏది ఇచ్చినను, మనము దానిని అనుభవించుటకును నిత్యత్వమునకు దానిని యుంచుకొనుటకే ఇచ్చుచున్నాడు. మనకు ఆయన ఇచ్చిన నిత్య జీవము ఏవో కొన్ని సంవత్సరములకే కాదు, గాని నిత్యమునకు; మరియు మనలోను మన ద్వారాను అది నిత్యత్వమంతయు ప్రవహించవలెననియే. ఈ ప్రవాహము నిండుగా ప్రవహింపకుండునట్లు శత్రువు చేయచూచినను, ప్రతి ఆటంకమును తొలగించి కాలమంతా నిండు ప్రవాహముండునట్లు ఆయన చేయగోరుచున్నాడు.

మీ ఇండ్లలో కొళాయిల నుండి నిండు ప్రవాహము ఎల్లప్పుడు వుండదు. నీటి సప్లయికి కొదువ ఏమియులేదు. చెరువు నిండా నీళ్ళున్నవి గాని గొట్టములో ఏదో అడ్డుకొనినది. కొళాయి మరమ్మతు చేయు పనివానిని పిలువుము. అతడు ఆ పనిని చక్కగా ఎరిగిన వాడైనందున, అడ్డుకొనిన దానిని తీసి వేయుచున్నాడు.

నిరాటంకముగా నీరు తిరిగి ప్రవహించును. కొళాయి కారుట కూడ గలదు. నీరు అనవసరముగా కారిపోవుచు అంతయు వ్యర్థమగుచున్నది. అరిగిపోయిన దానికి బదులుగా, మరను బిగించునట్టి వస్తువు క్రొత్తది ఒకదానిని అమర్చినచో, కారుట ఆగిపోవును. మా మందిరము వెనుక ఇట్టి కొళాయి ఒకటి యుండెను. ఏండ్ల కొలది నీరుకారి వ్యర్థమగుచుండెను. బిగించే వస్తువును క్రొత్తదానిని కొని మర బిగించుటకు ఎవరును శ్రమ తీసికొనలేదు. ఒకనాడు ఒకరు, మమ్ము కనికరించి అరిగిపోయిన వాషరును తీసివేసి క్రొత్త వాషరును అమర్చగా ఆ కొళాయి కారుట ఆగిపోయెను.

కారిపోవుచున్న విశ్వాసులు కూడ అనేకులు గలరు. ఏది చూచినా వ్యర్థ పరచుచున్నారు. కాలము, డబ్బు, శక్తి, సమస్తము పాడు చేసుకొనుచున్నారు. ఈ కారుటను, వృథా పరచబడుటను కొన్ని సమయములలో ఒక సులభమైన విధముగా ఆపివేయవచ్చును. నిర్లక్ష్య • వలనగాని, బుద్ధిహీనత వలనగాని, పోగొట్టుకొనిన వాటిని తిరిగి తెచ్చుకొనవచ్చును. ఆత్మీయముగా దేనిని పోగొట్టుకొనినను, దానిని తిరిగి పొందవచ్చునని లేఖనము చెప్పుచున్నది. ఇట్టి సాధ్యమిణాయని అనిపించునుగాని, దేవుని సహాయము చేతను, ఆయన కృప వలనను, ఆయన వాక్యము ద్వారాను తిరిగి పొందుట సాధ్యమే. 2వ రాజులు 6:1-7లో ఈ సులభమైన పాఠము నేర్పబడుచున్నది. ఇది ప్రవక్తల శిష్యుల విషయము. ఈ యౌవన ప్రవక్తలు ఏలీషా యొక్క విద్యార్థులు. వారుండిన స్థలము చాలా ఇరుకుగా నుండనందున, అంతకంటె విశాలమైన గృహము కావలసి యుండెను. దీని నిమిత్తము కలప అవసరమై యుండెను. కనుక యొర్దాను అవతల నున్న అడవిలో చెట్లు నరుకుటకు వెళ్ళిరి. వారు యౌవనస్థులుగ యుండినను, ప్రవక్తల శిష్యులై యుండినను, తామే బయలుదేరి

వెళ్ళక, బుద్ధిమంతుడైనందున ఏలీషాను కూడ వెంట బెట్టుకొని వెళ్ళిరి (వచనము 3). ``ఈ ముసలివానితో మనకు తిప్పలెందుకు? మనకేమైన సహాయము చేయగలడా? మనము ఎంత దూరము పోయినా మనతో నడవ గలడా? మనతో వచ్చినాడంటే, ఆతనిని మనము ఎత్తుకొని తిరగాలి, భోజన సదుపాయాలు చూచుకోవాలి, చాకిరీలు చేయాలి`` అని అనేకమంది యౌవనస్థులు అనుకొనునట్లు వారు ఆలోచించలేదు. ఎందరో యౌవనస్థులు తమ తల్లి తండ్రులకు సేవ చేయరాదని తలంచెదరు. కారణమేమనగా, ఈ వృద్ధులకు ఏమైనా ఒక మూడవ తరగతికి మించిన విద్యలేదు. ఒక ఇంగ్లీషు పదమునకైనా గుణింపు రాదు. మాకు తెలిసినంత ఈ పెద్దవాళ్ళకు ఏమైనా తెలుసునా? అని ఈనాటి యౌవనస్థులు తలంచుచున్నారు. వారి తల్లితండ్రులు సునాయాసముగా మాటలాడ జాలరేమో, ఒక్క పదము పలుకునంతలో ఎన్నో నత్తి శబ్దములు చేయుదురేమో. ``ఈలాటి ముసలయ్యలు, ముసలమ్మల దగ్గరకు పోయి మనస్వంత సమస్యలు చెప్పుకోవడము ఎందుకు?`` ఇట్లు తల్లిదండ్రుల కంటే, బంధువుల కంటె తమకే అధిక తెలివితేటలు గలవని ఎంచుట వలన, అనేకులు బుద్ధిహీనత వలన తమ యౌవన జీవితములను పాడు చేసుకొనుచున్నారు. ఈ యౌవనస్థులైతే కొంత వివేకులే, కావున వారితో కూడ ఎలీషాను రమ్మనిరి.

వారక్కడ చెట్లను నరకుచుండగా ఒకని గొడ్డలి తల ఊడిపోయి నీటిలో పడెను (వచనము 5). ఇతనికి ఎక్కువ తెలివి ఉండలేదేమో. ఆ ఇనుము బిగువుగా యున్నదాయని ముందుగానే చూచుకొనలేదు, దాని పిడి బలముగా ఉన్నది లేనిది కూడ పరీక్షించలేదు. అనుభవము తక్కువైనందున దానిని అట్లే ఉపయోగించగా చెట్టుమీద వేసిన మొదటి దెబ్బకే గొడ్డలి తల

ఊడి నదిలో పడెను. ఆ ...డి లోతైనందున, "అయ్యో! నేనేమి చేతును?"
...ము ప్రలాపన చేయుచుండెను. ఆ గొడ్డలి తన స్వంతది కూడ కాదు. పని తీరిన వెంటనే, వాపసు ఇత్తునని ఎవరి దగ్గరనో అరువు తీసికొని యుండెను. ప్రవక్తల శిష్యుడైనందున తన మాటను నిలుపుకొనవలెను.

అనేకులు అరువు తీసికొనుట చక్కగా తెలియును. మంచి మంచి చమత్కారులు ఏది అరువు తీసికొనవలెనని ఉన్నను, ముఖ్యముగా డబ్బు కావలెనంటె ఎంతో అమాయకులుగా కనబడుదురు. "వెంటనే తిరిగి ఇచ్చేస్తాను, జీతము అందుకొనిన దినమే" అని అందురు. ఆ మాట్లాడు విధము చూచి అప్పు ఇచ్చేవాని మనస్సు కరుగును. "పాపము బీదవాడు, సహాయము చేయాలి, మంచివాడి లాగానే కనబడుచున్నాడు. తప్పక మాట ప్రకారము తిరిగి ఇచ్చేస్తాడు" అని ఎంచి వాడు అడిగిన సొమ్ము ఇచ్చును. అయితే అడినమాట వాడు నిలుపుకొనెనా? గత సంవత్సరము అరువు తీసికొనిన వస్తువులు ఇంకను ఇవ్వలేదు. ఇమ్మని జ్ఞాపకము చేసిన యెడల మొదటిలో మర్యాదగానె ఏదో చెప్పొదురు. అటు తరువాత నీకు విరోధులే. అరువు తీసికొనడము తెలుసునుగాని తిరిగి ఇవ్వడము ఎరుగరు. విశ్వాసులనేకులు మనశ్శాంతిని, సంతోషమును, తమ హక్కులను ఈ విధముగానే పోగొట్టుకొనుచున్నారు. ఇచ్చిన మాట నిలుపుకొనుటలేదు. చేసిన వాగ్దానములను నెరవేర్చుటలేదు. చేసిన అప్పులను తీర్చుటలేదు. అయితే ఈ కథలోని యౌవనస్థుడు తెలివి తక్కువగా గొడ్డలి తలను పోగొట్టుకొని ఉండినను దానిని తిరిగి ఇవ్వలెననియే ఉండెను. క్రొత్తది ఒకటి కొని ఇచ్చుటకు డబ్బులేదు. అందుకిట్లు దు:ఖించుచున్నాడు: 'అయ్యో! ఏమి చేయుదును? అతని ముఖము చూడగలనా? నీ గొడ్డలి జాగ్రత్తగా తిరిగి
...ి ఏమి చేయవలెను?' అతనికి కొంత

జ్ఞానముండుట చేత తన తోటి యువకుల సలహా అడుగక, ఎలీషా యొద్దకు పోయెను (వచనములు 15,16) "నా కెవరైన సహాయము చేయగలిగితే అది ఎలీషా ఒక్కడే" అను విశ్వాసము అతనికి ఉండెను (వ.15). ఎలీషా యొద్దకు వెళ్ళుటలో తన చేతకానితనము తన పొరపాటు ఒప్పుకొనెను. "గురువుగారూ! నా అజాగ్రత్త వల్ల గొడ్డలి తల పోగొట్టుకొన్నాను. అది అరువు తెచ్చిన గొడ్డలి కాబట్టి దానిని తిరిగి ఇచ్చేయాలి. గురువుగారూ! ఇప్పుడు నేనేమి చేయాలో చెప్పండి" అనెను. "అది ఎక్కడ పడిపోయిందో నాకు చూపు"మని ఎలీషా అనెను. ఆ యువకుడు చూపెను. ఎలీషా ఒక చెట్టు కొమ్మను నరికి నీళ్ళలో పడవేసెను. గొడ్డలి పైకిలేచి, ఒక గడ్డి పరకవలె నీటిమీద తేలెను. ఇట్లు తాను పోగొట్టుకొనిన దానిని ఆ యువకుడు తిరిగి పొందెను. ఇది ఒక సులభమైన కథ-అయితే ఆత్మీయముగా మనము పోగొట్టుకొనిన ప్రతిదానిని ఎట్లు తిరిగి తెచ్చుకొనగలమో దానిని నేర్పునంత లోతైన అర్థము కలిగియున్నది.

ఇది గమనించుదము. ఆ యువకులు ఎలీషాను రమ్మనికోరి వెంట తీసికొని వెళ్ళిరి. మీరు ఎప్పుడెప్పుడు బయలుదేరి వెళ్ళుదురో ఎచ్చటెచ్చటికి వెళ్ళుదురో నిజమైన ఎలీషాయైన యేసుక్రీస్తు ప్రభువును మీ వెంటకొని పోవుటకు తీర్మానము చేయుండి. నీవు ఆశీర్వాదము, ఐశ్వర్యము పొందవలెనంటె నీ స్వంతశక్తి, జ్ఞానము మీద ఆధారపడనేవద్దు. ప్రభువు నీతో రాని యెడల నీవు ఏది పూనుకొనినను అది వర్థిల్లదు.

మరొక సంగతి. ఏదైనను పోగొట్టుకొంటివంటె సిగ్గుపడక ఒప్పుకొనుము. ఆ యువకుడు "అది నా తప్పుకాదు, ఆ పిడి కొయ్య విరిగిపోయి ఉండింది" అని చెప్పి యుండవచ్చును. కాని తన తప్పును కప్పుకొనక ఒప్పుకొనెను. జాగుచేయక నీ తప్పులను ఒప్పుకొనుము నీ బుద్ధిహీనతను, అవమానముకు

కప్పి వేయవద్దు. ఇతరుల కడకు వెళ్ళవద్దు. సూటిగా ప్రభువైన యేసుక్రీస్తు యొద్దకే సహాయము కోరుచు వెళ్ళుము. ఆయన పాదములు చేరి, నిన్ను నీవు తగ్గించుకొని నీ తప్పులు నష్టములు ఒప్పుకొనుము. "అయ్యో! నా ప్రభువా! నేనేమి చేతును?" అని ప్రార్థించుము. నీవు ఎచ్చట పోగొట్టుకొంటివో, అక్కడికి క్రీస్తు నిన్ను కొనిపోవనిమ్ము. ఏ రీతిగా దేవుడు నీకు సహాయము చేయుచున్నాడో అది చూచుటకు మనఃపూర్వకముగా సిద్ధపడుము. ఎలీషా నరికిన కొమ్మ సిలువకు సూచనగా నున్నది. మన పాపముల నిమిత్తము ఆ సిలువ మ్రానుమీద ఆయన వ్రేలాడి మనకొరకు మరణించెను. కావున ఆ సిలువ ద్వారానే మనము పోగొట్టుకొన్నది మనకు తిరిగి లభించును. ఇనుము తేలగలదా? అయితే ఈ యినుము తేలెను. ఎలీషా చేతిలో ఇది ఏమంత ఆశ్చర్య కార్యము కాదు. ఇట్లే విశ్వాసము ద్వారా మన జీవితములలో సిలువను ఉపయోగించినచో, దాని ద్వారా నష్టములన్నియు సరియగును

ఒక క్రొత్త అనుభవముతోను, క్రొత్త విశ్వాసముతోను ఆ యువకుడు బయలుదేర గలడు. పోయిన గొడ్డలి దొరికెను. మరియు అతడు పోగొట్టుకొనిన సంతోష సమాధానములు మరియు జ్ఞానము అతనికి తిరిగి వచ్చెను. ఇదే ప్రకారము దేవుడు నీకు సహాయము చేయునుగాక. ఈ చిన్న సూత్రము జ్ఞాపకముంచుకొనుము. మొదటిగా ఏ స్థానమందు నీ జీవితములో నష్టము ప్రారంభమాయెనో, అది ఆయనకు చూపి, ఆ స్థానమును చేరి యిట్లనుము – "అవును ప్రభువా! ఫలాన ఫలాన తేదిని, ఫలాన ఫలాన సమయములో, ఒక మూర్ఖునివలె ప్రవర్తించితిని. దానితో నా జీవితములో ఈ నష్టము ప్రవేశించినది". ఇట్లు ప్రభువు దగ్గరకు పోయి, ఒప్పుకొనిన యెడల నీవు పోగొట్టుకొనిన సమస్తము సిలువ శక్తి వలన నీకు దొరుకునట్లు ఆయన నీకు సహాయము

చేయును. సిలువ దేవుని యొక్క శక్తియై యున్నది. అయితే విశ్వాసము అవసరము. సాధారణమైన సజీవమైన విశ్వాసము. 'దావీదు సమస్తమును తిరిగి తెచ్చుకొనెను.' దావీదు పేరు తీసివేసి, ఆ స్థలములో నీ పేరు ఉంచుకొనుము. అప్పుడు నీవు పోగొట్టుకొనిన సమస్తమును, నీవు ఎవరవైయుండినను తిరిగి పొందుటను గ్రహింతువు. మరియు దానికంటె చాలా అధికముగా కూడ పొందుదువు. మన ప్రభువు మనతోనే యున్నాడు. ''సదాకాలము మీతో కూడా ఉన్నాను'' అని ఆయన చెప్పియున్నాడు. ఆయన యొద్దకు వెనుకదీయక పొమ్ము, నీ కష్టములన్నియు చెప్పుకొనుము, నీవు నష్టపోయిన వన్నియు నీవు తిరిగి తెచ్చుకొను నిమిత్తము ఆయన నీకు బదులుగా సిలువమీద మరణించెనని నమ్ముము.

✧

## 3వ అధ్యాయము

# దావీదు యొక్క మొదటి నష్టము

(1 సమూయేలు 29, 30)

ఆత్మీయ నష్టము సంపూర్ణముగా తీర్చుకొనగలము అనునది మనము మరువరాదు. నీవు ఎంత పెద్ద నష్టము పొందియుండినను, పోయినది తిరిగి దొరకగలదు. మరియు అంతకంటె అధికముగా కూడ దొరుకును, అయినప్పటికిని, దేవుని వాక్యమునకును ఆయన దైవ నియమములకును మనము ఇష్ట పూర్వకముగా లోబడవలెను. వాటిని మార్చుట ఎవ్వరి తరము కాదు. ఒకని ధనమును బట్టిగాని, విద్యను బట్టిగాని, అంతస్తును బట్టిగాని అవి మార్పు చేయబడవు. ఈ దైవ నియమములు ప్రతివారికి చెందుచున్నవి.

దావీదుకు చాలా నష్టము కలిగెనని తెలిసికొంటిమి. అతడు మంచివాడు, జ్ఞాని, దయాళుడైన రాజు, దేవుని హృదయానుసారుడు. అయినను నాలుగు సందర్భములలో సాతాను వలన మోసపోయి నాలుగు గొప్ప నష్టములు పొందినను, దేవుని కృప, సహాయము వలన సమస్తము తిరిగి పొందెను. ఈ నాలుగు నష్టముల కారణములు ఏమిటో పరీక్షించి, పోగొట్టుకొనిదంతయు ఏ రీతిగా పొందెనో చూతము. 1 సమూయేలు 29:1-4లో మొదటి కారణము

కనబడుచున్నది. సౌలుకు విరోధముగా ఫిలిష్తీయుల సైన్యములో చేరెను. సౌలు దావీదు యొక్క శత్రువే. తనకు బదులు రాజుగా, దేవుడు దావీదును ఏర్పరచుకొనినందు వలన, సౌలు అనేక పర్యాయములు దావీదు ప్రాణమును తీయజూచెను. అనేక సంవత్సరములు సౌలు దావీదును వధింప తిరుగుచుండగా, దావీదు ఒక ఆశ్రయము వెదుకుచు ఇక్కడనుండి అక్కడికి పరుగెత్తుచుండెను. తుదకు ఫిలిష్తీయుల దేశమునకు పోయి ఫిలిష్తీయుల రాజును ఆశ్రయించెను.

ఫిలిష్తీయుల ప్రధానులు కూడి వారి సైన్యములను వెంట బెట్టుకొని సౌలుపై యుద్ధమునకు బయలుదేరిరి వారితో కూడ దావీదు బయలుదేరెను: గాని ఆ ప్రధానులు దావీదును అనుమానించిరి. "వీడొక హెబ్రీయుడు. యుద్ధము మధ్యలో మనలను విడిచి సౌలు పక్షము చేరిపోడని నమ్మకమేమి?" అని వారు చెప్పిరి. రాజైన ఆకీషు మాత్రమే దావీదును నమ్మెను. "దావీదును చాలా కాలముగా నేనెరుగుదును. మనమధ్య ఇంతకాలము లేడా తప్పక అతనిని నమ్మవచ్చును" అని ఆకీషు చెప్పెను. సర్దారులు ఒప్పుకొననందున, విచారించుచు, నిరుత్సాహముతో తిరిగి వెళ్ళిపోవుట దావీదుకు తప్పదాయెను. ఇంత దుఃఖ మేలయనగా దావీదు ఈ తలంపులు కలిగియుండెను. "నా శత్రువైన సౌలు ఇన్ని యేండ్లుగా నా ప్రాణము తీయుటకు చూస్తున్నాడు. అతనికి నేను చేసిన కీడుయేమి? రెండు మారులు నా చేతికి దొరికినప్పటికి, నేను అతనిని చంపక విడిచిపెట్టితిని. అది ఎరిగి కూడ నన్ను చంపవలెననే చూచుచున్నాడు." తుదకు సౌలు మీదికి వెళ్ళుచుండిన ఫిలిష్తీయుల సైన్యములో చేరెను. సమూయేలు సౌలును అభిషేకించెననియు. దేవుని వాక్యమునకు సౌలు లోబడకుండినను, అతడు దేవుని అభిషిక్తుడే యనియు దావీదు ఎరుగును. ఇందులకే దావీదు హస్తము సౌలును తాకకుండునట్లు దేవుడు చేసెను. అయితే దావీదు ఓర్పులేని వాడాయెను. కష్టములనింక సహింపజాలక లోలోన : "నేనేమి చేసితినని నన్ను ఈ సౌలు చంపుటకు వెంటాడుచున్నాడు?

ఉంచుటకు స్థలము లేదు, తల దాచుకొనడానికి నీడలేదు. అన్న వస్త్రాలకు, ఒక జనకు స్నేహితుల దయ కావలసి వున్నది. ఇంకెంత కాలము ఈ తిప్పలు? దేనికైనా ఒక హద్దు ఉన్నది" అని అనుకొనుచుండెను.

బాలా కాలము వరకు మనకు బాధలు తీరకుండిన యెడల ఇదే విధముగా మనస్సులో అనుకొనుచుందుము, "ఇంకెంత కాలము ఈ పాట్లు? నేను దేవదూతను కాను. నాది మాంస శరీరము ప్రకృతి మించిన వ్యక్తిని కాను, నా అవస్థ కొంచెము చూడు, ఇన్ని యేండ్లు ఇదే బాధ. బైబిలు చదువుచున్నాను, దేవుని సంతోష పెట్టుటకు చేయగలిగిందంతా చేయుచున్నాను. ఎవరికి ఏ హాని చేయుటలేదు. అయినను దేవుడు కన్నెత్తి నా బాధను ఇంకా ఎందుకు చూడకున్నాడు?" సణుగులు ఇట్లే బయలుదేరుచున్నవి. అనుమానము, భయము పీడించుటచే మన శ్రమలనుండి విడుదల పొందుటకై తప్పుడు సాధనములను ఉపయోగింప నారంభించుచున్నాము. అయితే దావీదు దేవుని ఎరిగిన దైవజనుడు. ఎన్నో సమయములలో దేవుడు చేయు సహాయమును అనుభవించినవాడే. ఎక్కడికైన వెళ్ళుటకు ముందు ఎల్లప్పుడు సహాయము కొరకు దేవుని యొద్దకు వెళ్ళి ఆయనను సలహా అడిగెడువాడు. దేవుని చిత్తమును ఎట్లు తెలిసికొనవలెనో అతడు ఎరుగును. 1 సమూయేలు 30:1-10లో దావీదు దేవుని ప్రధాన యాజకుని యొద్దకు పోయి, తాను ఎక్కడికి వెళ్ళు విషయము దేవుని చిత్తము ఏమిటో అడిగి తనకు తెలుపుమనుచున్నాడు. పాత నిబంధన యందు ప్రధాన యాజకుడు ఊరీము, తుమ్మీము రాళ్ళ ద్వారా దేవుని చిత్తము తెలిసికొన గలుగుచుండినందున, దేని విషమైనను ఒక చింత గలిగినవాడు అతని యొద్దకు పోవుచుండును. "ఈ విషయములో నన్ను గురించి దేవుని చిత్తము ఏమిటో తెలిసికొని చెప్పుము" అనును. అనేక సందర్భములలో, తనకు దేవుడు తోడై సహాయము చేయుట దావీదు ఎరుగును. అయినను ఈ మారు దేవుని చిత్తము విచారింపక, వెళ్లి ఫిలిష్తీయులతో

కలిసిపోయెను. దేవునిపై ఆధారపడుటమాని, సౌలుమీద పగ తీర్చుకొనవలెనని ఆతురపడుచు, మానవరీతిగా ఇట్లు సమాధానపడజూచెను. "సౌలు వల్ల చాలా బాధ అనుభవించితిని. నన్ను రాజుగా అభిషేకించిన దానికి ఫలితమిదియేనా? ఎంతకాలము ఇల్లులేక, ఉండిలేక, గుహలలో తలదాచుకొనుట? ఇంక నేను ఈ పాట్లు పడలేను" ఇట్లనుచు, ఫిలిష్తీయుల సైన్యములో చేరెను.

దావీదు, అతని జనులు తిరిగి సిక్లగు చేరునప్పటికి ఇండ్లన్నియు కాలిపోయి యుండుట చూచిరి. వారి స్త్రీలు, బిడ్డలు, వారి సొత్తు సమస్తమును అమాలేకీయులు తీసికొనిపోయి యుండిరి. దావీదు తప్పిదము వలన ఇదంతయు సంభవించెను. ఫిలిష్తీయులను చేరక పూర్వమే దావీదు దేవుని చిత్తమేమిటో అడిగియుండవలెను. అట్లుగాక, అప్పటికి త. స్వంత జ్ఞానము, స్వంతశక్తి మీద అనుకొనెను. ఇప్పుడేమాయెను? ఇండ్లన్నిక లిపోయియుండెను. స్త్రీలను, బిడ్డలను శత్రువులు చెరపట్టి తీసుకొనిపోయి, సామానులన్నియు దోచుకొనిపోయి యుండిరి. దావీదు తిరిగి వచ్చినప్పుడు జనులు పెద్దగా ఏడ్చుచుండిరి. ఎంతో సమయము వరకు ఇక ఏడ్వ శక్తి లేనంత వరకు గట్టిగా రోదన జేయుచుండిరి. భరించలేని దుఃఖము పాలైరి. దావీదును రాళ్ళు రువ్వి చంపవలెనని అతని జనులు సిద్ధపడిరి. కష్టములు వచ్చినప్పుడు స్నేహితులు సహితము విరోధులు కాగలరు (1 సమూ. 30:6). ఈ కారణము చేత దావీదుకు బహుసంకటముగా నుండెను. వారు అతని భటులైనప్పటికిని, ఇప్పుడు కష్టము వచ్చినందున నాయకునినే హతము చేయ సిద్ధముగా నుండిరి. ఇప్పుడు దావీదుకు దిక్కెవ్వరు? భార్యలు, బిడ్డలు పోయిరి. ఫిలిష్తీయులకు దావీదు అవసరము లేదు. తన పరివారము వారు తన ప్రాణము తీయజూచుచుండిరి. ఒంటరివాడై పోయెను, అంతా పోయెను. ఇప్పటికి అకస్మాత్తుగా బుద్ధి తెచ్చుకొనెను (వచనము 6). నీ బైబిలులో ఈ వాక్యము క్రింద గీత గీయుము. ఎందుకనగా ఏనాడైన నీ ప్రియులు నీ చెయ్యి విడిచి,

నీవు ప్రేమించినవారు నిన్ను విడనాడినచో, ఈ మాటలు నిన్ను ఆదరించును. "దావీదు తన దేవుడైన యెహోవాను బట్టి ధైర్యము తెచ్చుకొనెను." బుద్ధిరాగా, ఇట్లనుచున్నాడు "ప్రభువా, చేయవలసినవి నేను చేయకపోయినందులకు నన్ను క్షమించుము. నీ చిత్తమేమని అడుగక ఫిలిష్తీయులతో చేరితిని. నన్ను క్షమించుము. ప్రభువా, నాకు స్నేహితులుగాని, నన్ను జాలి తలచువారుగాని లేరు." వెంటనే యాజకుడైన అబ్యాతారును పిలిపించి, "ఇప్పుడు కార్యమేమున్నది మన శత్రువులైన అమాలేకీయుల మీద పడుదుమా? దేవుని చిత్తము ఈ విషయములో తెలిసికొని చెప్పుము" అనెను. "అట్లే పొమ్ము" అని దేవుడు సెలవిచ్చెను. అతడు మరల ఇట్లడుగుచున్నాడు - ప్రభువా! మేము పోయినచో పోగొట్టుకొనిన సమస్తము మాకు తిరిగి దొరుకునా? అప్పుడు 'తప్పక నీవారినందరిని దక్కించుకొందువు' అని సెలవిచ్చెను (వచనము 8 కడపటి భాగము). దేవుడు చెప్పగా, దావీదు ఆయనను నమ్మెను. అందరూ అమాలేకీయులను తరుముచు వెళ్ళిరి. ఒక పొలమునందు వ్యాధితో ఒక ఐగుప్తీయుడు పడియుండగా చూచి, వానికి కొంత భోజనము పెట్టి నీళ్ళిచ్చిరి. అతని ప్రాణము తెప్పరిల్లగా 'నీవు ఎవరవు? అని దావీదు అడిగెను. అతడు 'నేను అమాలేకీయుని దాసుడను, దారిలో నాకు జబ్బు చేసినందున నన్ను నా యజమానుడు విడిచిపెట్టి, అందరితో వెళ్ళిపోయెను' అనెను. ఇతడు దారిచూపగా, అమాలేకీయులు డేరాలు వేసికొని యుండిన స్థలమునకు దావీదు వచ్చెను. వారందరు తినుచు త్రాగుచు ఆనందముతో నాట్యము చేయుచుండిరి. అకస్మాత్తుగా దావీదు వారిమీద పడి, స్త్రీలను, బిడ్డలను సామానులను తిరిగి పొందుటయేగాక అమ్మాలేకీయులను దోపిడి కూడ చేసెను. ఆ దోపిడి ఎంత విస్తారముగా నుండెననగా, వారి అప్పులన్నియు పూర్తిగా తీర్చివేసిరి. ఎవరెవరిని ఇంతకాలము ఆశ్రయించి యుండిరో, వారందరికి ఈవులు బహుమానములు పంపిరి.

ఈసి తరువాత అధ్యాయమందు 31: 3-6లో ఫిలిష్తీయులు సౌలుతో యుద్ధము విషయము చదువుచున్నాము. ఈ యుద్ధములో సౌలు మరణించెను. సౌలు అభిషేకించబడిన వాడైనందున అతనిని దావీదు చంపకుండ దేవుడు చేసెను, అయితే యుద్ధ రంగమందు సౌలును అతని కుమారులును కూలిరి. దావీదు సౌలుతో యుద్ధము చేయనవసరము లేకపోయెను. దావీదు ఎరిగియుండలేదు గాని, అతని పక్షముగాదేవుడే పనిచేయుచుండెను. ఒక గొప్ప ఉన్నతమైన సేవ నిమిత్తము దేవుడు దావీదును ఏర్పరచుకొనెను. దావీదు దేవుడు ఏర్పరచుకొనిన రాజు మాత్రమే కాదు, దేవుడేర్పరచుకొనిన ప్రవక్త కూడ. ప్రవక్త మాత్రమే కాదు, దేవుని పరలోక నమూనాను కూడ దావీదు పొందెను. మనము కూడ ఒక గొప్ప ఉన్నతమైన సంకల్పము కొరకై విశ్వాసులముగా ఏర్పరచుకొనబడియున్నాము. కావున ఈ పిలుపు కొరకు సిద్ధపడులాగున మనము కూడ చెప్పనలవి కాని బాధలలో పడి దాటవలసి యున్నది. మన జీవితముల విషయము దేవుని చిత్తమేమిటో తెలిసికొనునది మనపని.

పాత నిబంధనలో దేవుని చిత్తము తెలిసికొనుటకు ప్రజలు ప్రధాన యాజకుని యొద్దకు పోవలసి యుండెను. ఇప్పుడైతే దేవుడే నా ప్రధాన యాజకుడు. ఆయనే నా రక్షకుడు. నారాజు, నా మిత్రుడు మరియు నా విజ్ఞాపన కర్తయైయున్నాడు. ఏ వేళయందైనను ఆయన యొద్దకు పోగలను. యాజకుడు దేవుని చిత్తము తెలిసికొను నిమిత్తము ఊరీము, తుమ్మీము రాళ్ళు అతనికి ఇవ్వబడెను. ప్రభువైన యేసుక్రీస్తు అయితే, ఇప్పుడు ఆ రాళ్ళను నాలోనే వుంచియున్నాడు - అనగా దైవవెలుగు, దైవసత్యము. కీర్తన 43:3 ప్రకారముగా దేవుని చిత్తము తెలిసికొనుటకై, ఆయన మందిరములోనికి నేను వెళ్ళగా, నా హృదయములో నివసించుచున్న దేవుని సత్యము క్రీస్తు యొక్క వెలుగు నన్ను నడుపును.

నా సత్యము, నా వెలుగు, నా నడుపుదల ఆయనే. అనేకమంది దేవుని దగ్గరకు విశ్వాసులు తమ హక్కులను ఉపయోగించుకొనుట లేదు. దేవుని దగ్గరకు పోయి అడుగుటకు బదులు, వీరి వారి సలహా అడుగుదురు, కొందరు విశ్వాసులు తామే స్వంతముగా ఏర్పాట్లు చేయుదురు. తమ బుద్ధినే ఉపయోగింతురు. స్నేహితులు, లోకజ్ఞానమే వారికి ప్రాముఖ్యము. వారు ఆ ప్రకారమే కార్యములు చేయుదురు. వ్యాపార విషయములోను, వివాహముల విషయములోను పొరపాట్లు చేయుచున్నారు. "అయ్యో! ఓర్పుతో కనిపెట్టి దేవుని చిత్తము తెలిసికొని వుండకూడదా?" అని ప్రశ్నించినచో "ఇంకెంత కాలము కనిపెట్టవలెను, ఇన్ని యేండ్లు కనిపెట్టి కనిపెట్టి తలలో తెల్ల వెంట్రుకలు వస్తున్నాయి. ఇంకా కనిపెట్టితే నన్నెవరు పెండ్లి చేసుకుంటారు? ఇదంతా పనిచేయదు. ఇంకా కనిపెట్టుకొని కూర్చుంటే కార్యము జరగదు" అని అందురు.

నిదానించితే లాభము లేదని తొందరపడిన అనేకుల పాట్లు ఇప్పుడు కనబడుచున్నవి. దేవుని చిత్తమును, ఆయన ఏర్పాటును నిర్లక్ష్యము చేసినందున, ఇప్పుడు దాని నష్టమేమిటో అనుభవించుచున్నారు. దావీదు వలె ఇక ఏడ్చుటకు శక్తి లేనంత వరకు తాము కూడ ఏడ్చు దినమొకటి వచ్చుచున్నది. స్నేహితులు కూడ చేయి విడుచుచున్నారు. ప్రతివారు విడనాడుచున్నారు. దేవుని చిత్తము తెలిసికొనుట మాని, ఆయన నడుపుదల వెదకుట మానినందులకై అనుభవించు ఫలము ఎట్టిదో ఇప్పుడు గ్రహించుచున్నారు.

దేవుని చిత్తము తెలిసికొనుటలో తప్పిపోవద్దు. ఫిలిష్తీయులతో వెళ్ళవద్దు. వారు చిన్నాయనలు, మామలైనను (uncles), చిన్నమ్మలు, అత్తలైనను (aunties) ఇతర బంధువులైనను సరే, కుటుంబ విషయములందు గాని సంఘ విషయములందు గాని, నీకున్న లోకజ్ఞానము ఉపయోగించవద్దు.

ఉపయోగించుటవా ఏడ్చి ఏడ్చి కన్నీళ్ళ పొలగుటకును. బాగా స్నేహితులుగా నుండినవారిని పోగొట్టుకొనుటకును సిద్ధపడుము.

చిట్ట చివరకు దావీదు తిరిగి దేవుని యొద్దకు వచ్చెను. దేవుని యొద్దకు వచ్చి, ప్రభువునందు తన్ను తాను ధైర్య పరచుకొన్నట్లు చేసిన దీనత్వము, సాత్వికము దావీదు కలిగియుండెను. దేవునికి స్తోత్రము. ఇప్పుడు దేవుని యొద్ద విచారించగా, ఆయన దావీదుతో మాట్లాడెను. పోయినవన్నియు, అంతకంటె బహు విస్తారముగా కూడా దావీదు తిరిగి తెచ్చుకొనెను. ఎంత దన్యమైన దినమది! స్త్రీలేమి, పురుషులేమి, బిడ్డలేమి అందరు హర్షించిరి. ఇంటిలోని సామానులన్నియు తిరిగి దొరికెను. అప్పులన్నియు దావీదు తీర్చి వేయగలిగెను.

ఇది నీవే పరీక్షించి ఋజువు పరచుకొనుము. ఎప్పుడైతే తిరిగి ప్రభువు నొద్దకు వచ్చెదవో, అప్పుడు నీవు నష్టపడినవన్నియు ఆయన నీకు తిరిగి ఇచ్చును. అంతేకాదు. నీ దుఃఖము సంతోషముగా మారిపోవును. ఫిలిష్తీయుల మీద స్నేహితుల మీద ఆధారపడవద్దు. క్రీస్తునే నమ్ముకొనుటకు నేర్చుకొనుము. ప్రతి పరిస్థితిలోను దేవుని దగ్గర విచారించుము, ఆయన చిత్తము తెలిసికొనుచుండుము. ఆయన స్వరము వినగోరుము. ఆయన చెప్పినట్లు చేయుము. పరిస్థితులు అసాధ్యమైనవై యుండినను ఆయన మాటకే లోబడుము.

## 4వ అధ్యాయము

# దావీదు పొందిన రెండవ నష్టము

(1 దినవృత్తా. 13 మరియు 15)

దావీదు పొందిన రెండవ నష్టమును చూతము, దేవుని వాక్యము నుండి రెండు భాగములు 1 దినవృత్తా. 13 మరియు 15 చదువుము. ఎంతో శ్రమపడి, ఎంతో ఆసక్తితో దావీదు దాని కొరకు ఏర్పరచిన స్థలమునకు దేవుని మందసమును తేగోరెను. సంఖ్యా కాండమందు 4,7 అధ్యాయములలో ఇవ్వబడిన దేవుని ఆజ్ఞ ప్రకారము ఇశ్రాయేలీయులందరును అహరోను కుమారులును, కహాతీయులును సమకూడవలెనని యుండగా దావీదు తన స్వంత మానవ జ్ఞానము, ఆసక్తిని ఉపయోగించి, ఒక క్రొత్తబండిమీద దేవుని మందసమును ఎక్కించి తెచ్చుటకు పోయెను. 1 సమూయేలు 6లో ఫిలిష్తీయులు ఇట్లు చేసియుండిరి. ఫిలిష్తీయులు దేవుని మందసమును పట్టుకొని ముందుగా దాగోను మందిరములో నుంచిరి. దేవుని తీర్పు వారిమీద పడెను. కావున గాతుకు దానిని పంపిరి. పిమ్మట ఎక్రోనుకు పంపిరి. దేవుని మందసమును ఎక్కడికి తీసికొని పోయినను, ఆయన తీర్పు అక్కడ పడెను (1 సమూ. 5:10-12). తుదకు ఫిలిష్తీయులు దేవుని మందసమును తిరిగి ఇశ్రాయేలు దేశమునకు పంపివేసిరి (1సమూ. 6వ అధ్యాయము).

సంవత్సరములు గడిచెను. మందసమును దాని స్థలమునకు తేవలెనని దావీదు తలచి, ఫిలిష్తీయుల పద్ధతిని అవలంభించెను. కహాతీయులు, లేవి కుమారులు మాత్రమే తమ భుజముల మీద దేవుని మందసమును మోసికొని పోవలెనని సంఖ్యాకాండము 4:15, 7:9 లో దేవుడు తేటగా ఆజ్ఞాపించియుండెను. ఒక బండిమీద దానిని తీసికొని పోనేకూడదు. అయినను దావీదు లేవీయుల దగ్గర విచారించక, ఆవేశము వలన సహస్రాధిపతులతోను, శతాధి పతులతోను ఆలోచన చేసెను. 1 దినవృత్తా. 13:1 చూడుము. "ఈ కార్యము సమాజకులందరి దృష్టికి అనుకూలమాయెను గనుక జనులందరును ఆ ప్రకారము చేయుద మనిరి" (వచనము 4). దానివలన సంభవించినది ఏమి? మందసమును ఒక క్రొత్తబండి మీద ఎక్కించిరి. మార్గమందు పశువులకు కాలు జారినందున మందసమును పట్టుకొనవలెనని ఉజ్జా చేయి చాపగా, యెహోవా కోపము అతనిమీద మండెను. ఆయన అతనిని మొత్తెను. కావున మందసమును దాని స్థలమునకు తీసికొని వెళ్ళలేకపోయిరి. 13వ అధ్యాయమందు దావీదు చేసిన ప్రమాదకరమైన పొరబాటును గూర్చి అతడు ఎట్లు పశ్చాత్తాపపడెనో 15వ అధ్యాయమందు చదువుచున్నాము. అప్పుడు లేవీయులను, అహరోను కుమారులను సమకూర్చి (1 దినవృత్తా. 15:4,5, 11-13) సంఖ్యాకాండము నందును, ద్వితీయోపదేశకాండమందును దేవుడు తేటగా స్పష్టముగా వెల్లడిచేసిన క్రమము ప్రకారము దేవుని యొద్ద ఆలోచన చేయనందున, తానును, సమస్త జనాంగమును పొందిన గొప్ప నష్టమును ఒప్పుకొనుచున్నాడు. ఎప్పుడైతే దేవుని వాక్యమందు ప్రత్యక్షపరచబడిన దైవక్రమమునకు లోబడి దానిని అనుసరింప మొదలుపెట్టెనో తానును, జనులందరును మహోత్సవముతో దేవుని మందసమును దాని స్థలమునకు తేగలిగిరి (1 దినవృత్తా. 15:28)

ఈ మహా సంఘటనానంతరమే, 105వ కీర్తన అనబడుచున్న కృతజ్ఞతతో కూడిన ఆశ్చర్యకరమైన ఆ పాటను దావీదు వ్రాసెను. దాని స్థలములో దేవుని

మందసమును తెచ్చియుండగా, దావీదు మనస్సును నింపిన తలంపులు ఇందులో తెలియజేయబడినవి : "యెహోవాకు కృతజ్ఞతాస్తుతులు చెల్లించుడి, ఆయన నామము ప్రకటన చేయుడి. జనములలో ఆయన కార్యములను తెలియజేయుడి" మొదలైనవి (వ. 1-7 : 14,15). దావీదు హృదయము స్తుతులతో నిండుకొని, దేవునియందు అతడు హర్షించుచు జనముతో ఇట్లనుచున్నాడు - "యెహోవాను వెదకుడి, ఆయన బలమును వెదకుడి, ఆయన సన్నిధిని నిత్యము వెదకుడి" (వ. 4). దేవుని సముఖమును మనము సదా వెదకుచు ప్రతి విషయములో ఆయన ఏర్పాటు ఏమైయున్నదో తెలిసికొనని యెడల, మన సకల కార్యములందును, ఏర్పాట్లయందును ఆయన క్రమమును అనుసరింపని యెడల గృహ విషయములలో నేమి, సంఘ విషయములలో నేమి మనకు పెద్ద నష్టము కలిగితీరును. మన ఆసక్తి, మన జ్ఞానము, మన అభిప్రాయమును బట్టి నడుచుకొనగూడదు.

దేవుని వాక్యానుసారము వెళ్ళక యుండుట వలన దేవుని ప్రజల మధ్య గొప్ప నష్టము వచ్చియున్నది. సంఘ పెద్దలు, డీకనుల విషయములో ఒక నిదర్శనము దీనికి కలదు. ఎంతో ప్రార్థన చేసి, ఏక మనస్సు కలిగిన పిదప, వారిని యెదుటకు తెచ్చి, వారిని చక్కగా పరీక్షించిన పిమ్మటనే వారిని ప్రత్యేకపరుటకు బదులుగా వోట్లువేసి పెద్దలను, డీకనులను ఏర్పరచుకొన్నారు. అయ్యో! దేవుని మందిరమందు జరగవలసిన ఆత్మీయ పరిచర్య చేయుటకై, లోకమంతట దాదాపు ప్రతి క్రైస్తవ సంఘమందును ఈ వోట్లు అనే పద్ధతి మీదనే పెద్దలు, కమిటీ మెంబర్లు లేక వారి పేరు ఇంకేది అయియుండినను ఎన్నుకొనబడుచున్నారు. ప్రార్థన ద్వారానే పెద్దలను ఏర్పరచుకొనవలెనని తెలిసినవారు కూడ అజాగ్రత్తగా నుండి ఈ కార్యము నిర్లక్ష్యము చేసి. దేవుని సేవకులు. దేవుని జతపనివారు కలిసికొని చేయవలసిన ప్రార్థన అను ఈ ముఖ్యమైన దానిని చేయకనే ఒకని మానవ యోగ్యతలు. మాటలాడు సమర్థత

అతని లోకపదవి లేక ఇంక వేరే ఏమేమి కలిగియున్నాడో, అట్టివి చూచియే అతనిని ఏర్పరచుకొనుచున్నారు. ఈ కారణము చేతనే కొన్ని సంఘములందు కలహము, ఓర్పులేనితనము, పోరాటములు ఉంటున్నవి. ఏలయనగా పెద్దలు లేక మెంబర్ల ఎన్నికలలో ఓడిపోయిన అభ్యర్థులు గెలిచినవారితో జగడములాడుదురు. ఈ కలహములు సర్వ సంఘములోని వారిలోను పని చేయుచున్నవి, ఇందువలన నిష్ఫలత్వము, ఆత్మీయ పసితనము ఆ సంఘములో నుండును. ఆకలితో ఆరాధనకు వచ్చువారు ఆకలి తీరకయే, ఆకలితోనే తిరిగి వెళ్ళిపోవుచున్నారు.

ఆది సంఘమందు విశ్వాసులు తమ అక్కరల నిమిత్తము దేవుని నమ్ముకొనుచుండిరి. డబ్బు కొరకు భిక్షమెత్తవలసి యుండలేదు. కొద్దిగా సూచనలు ఇచ్చి ఇతరులు తమ అక్కరలను ఎట్లయిన గ్రహించవలయునని ఎట్టి యుక్తులు ఉపయోగించలేదు. దేవునినే నమ్ముకొనిరి. దేవుడే వారికి సహాయము చేసెను. ఏమనగా విశ్వాసులకు డబ్బు కావలసి వచ్చినప్పుడు, మెల్లగా సూచనలు ఉపయోగించుట, విన్నపములు చేయుట, ఇతరుల యొద్దనుండి డబ్బును తీసికొనుట బలవంతపరుచునట్టి సాధనములను వాడుకొనుట. ఈ దినములలో, ఇదొక ఫ్యాషన్ (Fashion) అయిపోయినది. ఈ విధముగా సంపాదించిన డబ్బు దేవుని వలన పవిత్ర పరచబడిన డబ్బు కాదు. ఏలననగా, దానిని సంపాదించుకొనినవారు దేవుని వాక్యమును, ఆయన పద్ధతులను నిర్లక్ష్య పెట్టినవారే. కావున వారు ఆత్మీయముగా నష్టపడుచున్నారు.

దావీదు గొప్పరాజు, అనేక యుద్ధములు చేసినవాడు, దేవునికి ఇష్టుడైనవాడు, చాల జ్ఞానము గలిగినవాడు. ఎంతో గొప్పగా దేవునిచే వాడుకొనబడినవాడు. అయినను మందసమును దాని స్థలమునకు తెచ్చుటలో తన తెలివితేటలనే ఉపయోగించుచున్నాడు. మరియు, రాజుగారు చేయుచున్నదే

సరియని అందరు తలంచెరి. తన యుద్ధ నాయకులు, సేనాధిపతులు, అధికారులతో మందసమును పెద్ద జయోత్సవ ఊరేగింపుతో దాని స్థలమునకు తెచ్చుట బాగుండునని చెప్పగా, అందరు సమ్మతించెరి. ఎంతో ఘనమైన కార్యము దేవునికి చేయుచున్నామని తలంచిరి. అయితే దేవుని వాక్యానుసారముగా దైవ ఏర్పాటు ప్రకారము వెళ్ళక, కేవలము తమ బుద్ధికి తోచినట్లే చేసిరి.

ఆ తరువాత దావీదు పశ్చాత్తాప పడగా, దేవుడతనిని క్షమించెను. దేవుడు దయాళుడు, కృపానిధి : మనలను మనము తగ్గించుకొని, మన పొరపాట్లు, తప్పిదములు ఒప్పుకొన్నచో, మనలను క్షమించి, పోగొట్టుకొనిన సమస్తమును తిరిగి పొందుటకు సహాయము చేయువాడునై యున్నాడు. ఇప్పుడేమి జరిగెను? ఎప్పుడైతే కహాతీయులు దేవుని ఆజ్ఞానుసారముగా భుజములమీద మందసమును మోసికొని, దాని స్థలమునకు తీసికొని వెళ్ళిరో, ఇశ్రాయేలు సమస్త జనాంగము అప్పుడు బహుగా ఆనందించిరి.

దేవుని మందసము ప్రభువైన యేసుక్రీస్తును గూర్చియే చెప్పుచున్నది. ఆయనకు చెందవలసిన వాటి విషయము తెలియజేయుటకును రక్షణ మార్గము జనులకు చూపుటకును, అధికృత కలిగినవారు తిరిగి జన్మించినవారై, ఆయనచే పిలువబడినవారె. అయ్యో! ఈ దినములలో ఏమి జరుగుచున్నదనగా, దేవుని పిలుపులేని అనేకులను మిషన్ పొలములోనికి నెట్టుచున్నారు. ఈ కారణము చేత ఇంగ్లాండు, స్కాంట్లండ్, అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా మొదలగు దేశముల నుండి ఇతర దేశములకు మిషనెరీలుగా వెళ్ళినవారిలో నూటికి అరువది ఐదుగురి కంటె అధికముగానే, వారు సేవ చేయవలసని కాలమునందు మొదటి భాగము 5 యేండ్లు ముగిసిన తరువా ు తిరిగి తమ మిషన్ పొలములకు సేవకు వెళ్ళుటలేదు. వారు నిరాశ చెంది ఇంటికి

తిరిగివెళ్ళుచున్నారు. మరియు ఎందరో మనస్సు విరిగిన వారైరి. వారికి మతికూడ అస్థిరమై ఇంటికి మరలిరి. ఏలయనగా వారు దేవుని పిలుపు పొందలేదు. ఏదో ఒక కమిటివారు పంపుటవల్లనో, లేక ఏ మానవ పలుకుబడి కారణముగానో వారు ఆ పొలమునకు పోవుట తటస్థించెను. ఇదే విధమున ఆయన పరిచర్యకు దేవుడు ఏ మాత్రమును పిలువని వ్యక్తులకు వారి ధనమును బట్టి, పదవిని బట్టి, సంఘములలో అనేక అధికారములిచ్చుట వలన, దేవుని చిత్త ప్రకారము సంఘ కార్యములను ఏ మాత్రము నడుపజాలని వారైయున్నారు.

వివాహముల విషయములోను చెప్పవలసి యున్నది. వివాహమాడ తలంచినప్పుడు తమ మానవ బుద్ధినే అనేకులు ఉపయోగించుచున్నారు. యౌవనస్థులు ఒకరినొకరు ఇష్టపడుట వలనను అధికముగా ఆకర్షించుట చేతను, ఈ ప్రేమ, వాత్సల్యము, ఆకర్షణను బట్టియే ప్రవర్తించుచున్నారు. ఆ సమయమందు వారు దేవుని వలననే జీవితకాల పాలి భాగస్థులుగా జత పరచబడుచున్నారని వారు తలంచుచున్నారే గాని, దేవుని చిత్తమును మాత్రము అడిగి తెలిసికొనుట లేదు. అవిశ్వాసులు అట్లు చేయుచున్నారని నేను చెప్పుట లేదు, విశ్వాసుల విషయమే. ఏలననగా విశ్వాసులు దేవుని సముఖము చేరి, ఆయన చిత్తము ప్రతి కార్యమందును తెలిసికొనగల భాగ్యము కలిగియున్నారు. తన ముఖము, తన చిత్తము వెదకు వారితో మాట్లాడుదునని దేవుడు వాగ్దానమిచ్చి యున్నాడు. తమ వివాహ విషయములో, దేవుడు తమ కొరకు ఎవరిని ఏర్పరచి యున్నాడో యని మోకాళ్ళమీద అడుగుటకు బదులు అనేక విశ్వాసులు ఇతరుల సలహా తీసికొని, తమ ప్రేమానురాగముల మీద ఆధారపడి, లేక ఏ బంధు మిత్రాదుల మీద పెక్కు అభిమానము కలదో, వారితో ఆలోచనలు చేసి, వివాహము చేసికొనుచున్నారు. ప్రార్థనల ద్వారా సహాయపడగల వారితో కలిసి, దేవుని చిత్తమేమిటో తెలిసికొనుటకై ప్రార్థన చేయ సమ్మతించక

పొవుటనలననే, ఎన్నో సంసారములు సంతోషము లేనివిగా యున్నవి. గంపెడంత ఆశతో తమ వైవాహిక జీవితములో ప్రవేశించిరి. ఎంతో కాలము గడువక మునుపే ఒకరితో నొకరు కాపురము చేయుట వీలు కాకున్నదని తెలిసికొనుచున్నారు. ఆ కుటుంబమందు ఎప్పుడూ కలహములే, వారి మనస్సులలో సంతోషము లేదు.

దైవ క్రమము చొప్పున విశ్వాసులమైన మనకు ప్రతి విషయములో కూడ దేవుని పూర్ణ చిత్తము తెలిసికొను బాధ్యత కలదు. సంఘ కార్యములలో నేమి, పరిచర్య యందేమి లేక దేవుని మందిరమందు ఇతరమైన ఏ సేవయందైనను ఈ రోజులలో అనేకులు నిండు ఆవేశము గలిగి, దేశములోని నానా భాగములకును లోకములోని ఆయా భాగములకును సువార్తను అందించవలెనని బహుగా కోరుచున్నారు. ఆసక్తి పరులైన వీరు ఇంటింటికి, వీధి వీధికి, దేశ దేశాలకు వెళ్ళుచు పెక్కు సమయమును, డబ్బును, శక్తిని వినియోగించుచున్నారు అయినను, ఏమంత కార్యము జరిగినట్లు కన్పించదు, విస్తార ఫలితమును చూడరు. వారి దగ్గరనుండి జనులు పుస్తకములు కొనుచున్నారనియు, దేవుని వాక్యమందు శ్రద్ధ చూపుచున్నారనియు, మొట్టమొదట కొంతకాలము మురిసిపోవుచున్నారు. అయినప్పటికిని ఇంత జరిగినందుకు ఫలితముగా తిరిగి జన్మించినవారు బహు కొద్దిమందియే. మనమును అదే విషయములలో నిందించబడవలసిన వారము గనుక వారిని నిందించలేము. నా స్వంత అనుభవము నే నెరుగుదును. చాలా కాలము క్రిందట 1933లో కరాచిలో నా పరిచర్య ప్రారంభించితిని. అనాడు ఇండియాలోని నానా భాగములకు చెందినవారు ఎందరో కరాచియందు ఉండిరి. కావున ఆయా భాషలలో సువార్తలు, చిన్న పుస్తకములు పట్టుకొని ఇంటింటికి, వీధివీధికి తిరుగుచుంటిని. ప్రొద్దుననే సేవ ప్రారంభించి, ఎన్నో పుస్తకములు కర పత్రికలు బైబిలు గ్రంథములు పంచిపెట్టుచు, ఆశ్చర్యమైన పరిచయములు

కూడ కలిగియుంటిని. హిందువులేమి, ముస్లిములేమి, సిక్కులేమి ఎందరో శ్రద్ధ చూపుచుండిరి. వారు తమ ఇండ్లకు నన్ను ఆహ్వానించెడివారు. అచ్చట వారితో గంటల కొలది కూర్చుండి రక్షణ మార్గమును గురించి చెప్పుచుంటిని. నా సాక్ష్యము చెప్పితిని. ఎట్టి ఫలితమును కనబడలేదు. నిజముగా తిరిగి జన్మించినవారు చాలా కొద్దిమంది. "నేను విధిగా చేయవలసిన పని చేసితిని" అని తలంచితిని. ఆత్మలు ఒకే దినములో తిరిగి జన్మించుట లేదు. దేవుడు తన సమయము వచ్చినప్పుడు ఫలమిచ్చి ఆశీర్వదించును. అయితే నేను నిరుత్సాహ పడితిని విసుగు చెందితిని. ఫలితము లేదేమియని ఆశ్చర్యమాయెను. కాగా ఇట్లు ప్రార్థన చేసితిని - "ప్రభువా! నా పని, పరిచర్య వలన ఏ ఫలితము కనబడుట లేదు ఎందుకు? భోజనము కూడ మానుకొనుచున్నాను. ఎన్నెన్నో మైళ్ళు నడుచుకుంటూ పోతున్నాను. ఎంతో మందితో మాట్లాడుచున్నాను. ఎంతగానో త్యాగము చేయుచున్నాను లాభమేమి కనబడలేదు." అప్పుడు దేవుడు నాతో "భోజనము మానుకొనుమని గాని, ఆహారము తీసికొనవద్దని గాని, ఇన్ని మైళ్ళు నడువుమని గాని, నేను నీకు చెప్పనే లేదు. నీ స్వంతబుద్ధిని ఉపయోగించి ఇదంతయు నీవే చేయుచున్నావు" అని తేటగా చెప్పెను. నామీద పిడుగు పడినట్లాయెను. ప్రారంభమందు ఇండియాకు నేను రాకముందే, నా స్వంత ఏర్పాట్లు ఎన్నడును నేను చేయరాదని దేవుడు నాకు చెప్పియుండెను. అప్పటిలో ఆయన చెప్పినది నాకు సరిగా అర్థము కాకుండెను. ఇప్పుడు విశ్వాసులమైన మనము క్రీస్తుయేసు ప్రభువు యొద్దకు పోగలమనియు ఆయన పరలోక ఏర్పాటును క్రొత్తదినములో ప్రవేశింపక ముందే పొందగలమనియు తెలిసికొంటిని. నేను బయట వెళ్ళనని ఆ దినమున తీర్మానించుకొంటిని. దేవుడు నాతో మాట్లాడనై యుండెను కావున, ప్రార్థనలోనే యుంటిని. చాలా సమయము ఇట్లు గడిపిన తరువాత, దేవుడు నాతో మాట్లాడి - "ఈ దినము నీవు సైనిక బజార్ (Soldiers' Bazaar) కు వెళ్ళవలె"నని

చెప్పెను. నా స్నేహితులను పిలిచి సైనిక బజారులో ఒక ఆత్మ సిద్ధముగా నున్నదని దేవుడు నాతో చెప్పియున్నాడు, దయచేసి మీరు కూడ రండి' అంటిని. వారు : "అబ్బో అంత దూరమా! ఆ స్థలము ఇక్కడికి నాలుగు మైళ్ళ దూరము ఉన్నది, ఇప్పుడు చూస్తే మిట్ట మధ్యాహ్నము. పైగా ఈ దినము చాలా వేడిగా ఉన్నది. రేపు ఉదయమున కొంత చల్లగా, చక్కగా ఉన్నప్పుడు వెళ్ళుదాములే" అనిరి. అప్పుడు నేను "అలాగు కాదు, దేవుడు తేటగా చెప్పియున్నాడు. వాక్యము కొరకు ఏదో ఆత్మ ఆకలితో అక్కడున్నదని నా నమ్మకము. ఆ ఆకలి తీర్చకుంటె ఎలాగు? మనము వెళ్ళక తప్పదు" అని చెప్పితిని. ఇష్టము లేకున్నను వారు నాతో వచ్చుటకు సమ్మతించిరి. ఇక నడువవలసి వచ్చెను. ఆ రోజులలో బస్సుగాని, ట్రాముగాని (Tram) ఎక్కి ఒక స్థలము నుండి మరొక స్థలమునకు సువార్త పనిమీద మేము వెళ్ళేవారము కాము. మూడు లేక నాలుగు మైళ్ళు నడచిన పిమ్మట ఒక దుకాణము ఎదుట ఒక ఖాళీ స్థలము ఉండుట చూచి, అక్కడ ఆగి ఒక పాటపాడి, ఒక వర్తమానము నివ్వనారంభించితిమి. ఆ దుకాణము నుండి ఒక మహమ్మదీయుడు బయటికి వచ్చి "ఇక్కడ చూడండి, నేనొక మహమ్మదీయుడను, ఇది నా అంగడి, నా అంగడి దగ్గర ఏ క్రైస్తవుని కూడ బోధచేయ నివ్వను" అని చెప్పెను. "దేవుని వాక్యము ఎవరికిని బలవంతపెట్టి వినిపించడము లేదు. మేము నిన్ను విడిచి వెళ్ళిపోతే, న్యాయతీర్పు దినమున, నీవే దేవునికి లెక్క అప్పగించవలసి ఉన్నది సుమీ, ఆయనే మమ్మును పంపియున్నాడు. నీవు వద్దంటే, వెళ్ళిపోతాము. అయితే దేవునికి లెక్క అప్పగించుటకు సిద్ధపడుమని" నేనంటిని.

మరికొంత దూరము సాగిపోయి, మరొక బయలు స్థలము కనపబడగా అక్కడ నిలిచి, ఒక పాటపాడి, బోధింప నారంభించితిమి. ఒక పోలీసువాడు వచ్చి, "ఇది పోలీసు స్టేషను ఇక్కడ మీరు నిలువడానికి వీలులేదు" అనెను. అప్పుడు దేవునితో, "ప్రభువా,

మమ్మును వెళ్ళిపొమ్మంటున్నారు' అని చెప్పితిమి. అటువెనుక తిరిగి, మరికొంత దూరము వెళ్ళితిమి. మరొక బయలు స్థలము కనబడెను. "ఇక్కడ ఆగుము" అని ప్రభువు సెలవచ్చెను. అక్కడ వాక్యము ప్రకటించి ఒక పాటపాడి, కొంత ప్రార్థన చేసితిమి. ఎప్పుడు, వాక్యము చెప్పుటకు ముందు ఒక ప్రార్థన చేయుచుంటిమి. ప్రార్థనతోనే వాక్యము ప్రారంభించుట మేలైనదని అనుభవ పూర్వకముగా అదివరకే తెలిసికొని యుంటిమి. మేము ఒక సిద్ధాంతము చేసికొనినది ఏమనగా, ఎక్కడెక్కడ సాధ్యమగునో ఆయా స్థలములలో మోకరించి, తన వర్తమానమును అందించుటకు మాకు సహాయము చేయుమనియు, వినువారు దేవుని వర్తమానమును అంగీకరించునట్లు చేయుమనియు, మేము మొరలిడుట చూచినప్పుడు వారి మనస్సులు మెత్తబడుచుండును. ఎప్పటి ప్రకారమే ప్రార్థన చేసి, వర్తమానము ఇచ్చి ముగించిన పిమ్మట కూడ ఒక చిన్న ప్రార్థన చేసితిని. అమర్‌నాథ్ అనబడిన ఒకరు నా యొద్దకు వచ్చి - "ఏమండి నాకొరకే దేవుడు మిమ్మును ఇక్కడికి రప్పించెను. నేనొక హిందువుడను. పంజాబ్ యూనివర్సిటీలో పట్టభద్రుడనైతిని. సమాధానము ఎక్కడ దొరుకునాయని వెదుకుచూ నాలుగేండ్లనుండి తిరుగుచున్నాను. నాకు సమాధానము కలిగించుటకు ఎవరును తోడ్పడలేదు. ఎన్నో పుణ్యక్షేత్రములకు యాత్ర చేసితిని. నాకెక్కడను తృప్తి కలుగలేదు. ఎవరైనా సత్ క్రైస్తవులను కలిసికోగలిగితే ఎంత బాగుండును అనుకొంటిని, అయితే, ఎక్కడకి వెళ్ళి వారిని కలిసికొనగలనో తెలియలేదు. ఇక్కడ మీరు క్రైస్తవ కీర్తనలు పాడుట వినిపించినప్పుడు నా సంతోషము, ఏమని చెప్పను? నా కొరకే దేవుడు మిమ్మును ఇక్కడికి తెచ్చి యున్నాడని నేను రూఢిగా నమ్ముచున్నాను" అని చెప్పెను. ఆ దినము అతనికి సమాధానము దొరికెను. అనేకులు బైబిలు చదువుటయు, క్రీస్తునందు నిజమైన సమాధానము పొందుటయు చూచుట వలన, నా మనస్సు ఆనందముతో నిండెను.

ఆ దినమునుండి పరిస్థితులు మారిపోయెను. అన్ని విధములైన స్థలములకు దేవుడు మమ్మును కొనిపోవుచుండెను. వీటిలో కొన్ని ఏకాంత స్థలములే అనవచ్చును. చాల కొద్దిమంది అక్కడ ఉండినను, ఆత్మలను ప్రభువు రక్షించుచుండెను. ఒకటిగా కూడుకొని ప్రార్థన చేసి, దేవుని ఏర్పాటు తెలిసికొని బయలుదేరవలెనని తీర్మానించుకొంటిమి. ఇట్లు చేయగా ప్రజలు రక్షించబడిరి. ఫలితము చూడసాగితిమి. ఆ పని ఇప్పటికిని అట్లే జరుగుచున్నది.

ఇంకొకటి జ్ఞాపకము వచ్చుచున్నది. కొన్ని ఏండ్ల క్రిందట బర్నాలు అనబడిన చాలా ఏకాంతముగా నుండిన ఒక గ్రామమునకు పొమ్మని దేవుడు నాతో చెప్పెను. ఆ గ్రామము నేనెప్పుడు చూచి యుండనందున తిరిగి ప్రార్థన చేసితిని. అప్పుడు "బర్నాల్ వెళ్ళు" అని దేవుని స్వరము వినవచ్చెను. నా స్నేహితునితో - 'రమ్ము పోదాము బర్నాల్ అనే గ్రామములో ఎవరో సిద్ధముగా నున్నారు' అంటిని. అతడు సమ్మతింపగా బయలుదేరితిమి. అక్కడికి చాలా దూరము పోవలెను. ఒక వందమైళ్ళు రైలు ప్రయాణము చేసి, కొంత దూరము కాలి నడకమీద పోయి అక్కడ నుండి ఓడమీద వెళ్ళి, తిరిగి నడచి పోవలసి యుండెను. అక్కడ ఎవరో ఉన్నారు. అందుచేత వెళ్లి తీరవలెను అని మాత్రము ఎరిగియుంటిని. మేము కొన్ని పుస్తకములు తీసికొంటిమి. ఒక ఉర్దు బైబిలు కూడ తీసికొని పొమ్మని, దేవుడు సెలవిచ్చెను. కాలినడక, రైలు, ఓడ ప్రయాణములు దినమంతయు చేసి, ప్రొద్దు గ్రుంకు వేళలో బర్నాల్ చేరితిమి. దారిలో నేనొక వైపు, నా స్నేహితుడొక వైపు నిలబడితిమి ఒక మహమ్మదీయుడు నా యొద్దకు వచ్చి "నీవు ఒక క్రైస్తవునిగా కనబడుచున్నావు, నేనొక మహమ్మదీయుడను, ఇది నా గ్రామము. నా గ్రామములో ఏ క్రైస్తవుని కూడ నేను బోధ చేయనివ్వను" అనెను.

నేనిచ్చిన జవాబు - "వాస్తవమే, నీవు మహమ్మదీయుడవు, ఇది నీ

గ్రామము. అయితే మనుష్యుడు ఎవడును నన్నిక్కడికి పంపలేదు. దేవుడే నన్ను పంపించెనని సత్యము పలుకుచున్నాను. నేను ఏ సంఘానికి నౌకరును కాను. నేను జీతానికి పని చేయడము లేదు. ఒకప్పుడు బైబిలు అంటే క్రైస్తవులంటే నాకు ద్వేషము. సిక్కు మతములో పుట్టి పెరిగితిని. ఒక ప్రసంగమైనా వినలేదు. ఒక కూటమునకైనా వెళ్ళలేదు. క్రీస్తుయేసు ప్రభువే నన్ను 1929, డిశంబరు నెలలో కలిసికొని నా జీవితము యావత్తును మార్చివేసినాడు. అటు తరువాత 1932లో ఆయన సేవకే నా జీవితాన్ని సంపూర్ణముగా సమర్పించు కొంటిని. ఎక్కడ పోవలెనో ఆయనే ఆజ్ఞాపించుచున్నాడు. నన్నెక్కడ పంపితే అక్కడికే పోవుచున్నాను. ఆయన మాట ప్రకారమే చేయుచున్నాను. పాపులందరి కొరకు మరణించిన సజీవ రక్షకుడైన ఆయన స్వరము విని, వచ్చియున్నాను. బర్మాలు పేరైనా నాకు తెలియదు.'' అప్పుడతడు 'సరేగాని, నీవు ఎక్కడ బసచేసి యున్నావు?' అని అడిగెను. ''నేను నిలబడిన స్థలమే నా బస'' అని అంటిని. 'సరే అయితే, నాతో వచ్చి మా యింట్లో ఉండండి' అని చెప్పెను. 'చాలా ఉపకారము చేస్తున్నారు' అంటిని. 'గ్రామస్థులను పిలిస్తే వాళ్ళకు ఒక వర్తమానము ఇస్తారా?' అని అడిగెను. మేము చూచిన ఆ మహమ్మదీయుడు, ఆ గ్రామ తలారి. తన పనివారిని పంపి చాలామంది హిందువులను, మహమ్మదీయులను పిలిపించి అక్కడ సమకూర్చెను. నేను చెప్పుచున్న దానిని తానే భాషాంతరము చేసెను. వర్తమానము ముగిసిన పిదప, ఎందరో ఆశతో పుస్తకములు కొని, ఇండ్లకు పోయిరి. మేము భోజనము చేసితిమి. అటు పిమ్మట, ఒక మహమ్మదీయ పోలీసువాడు నా దగ్గరకు వచ్చి, 'ఏమండి! నా కొరకే దేవుడు మిమ్మును ఇక్కడకు పంపించి యున్నాడు' అనెను. కొన్ని యేండ్లకు పూర్వము ఎవరో అతనికి ఒక ఉర్దు సువార్త ఇచ్చిరట. అతడు దానిని మరల మరల చదివి, రక్షణ మార్గమును మరింత వివరముగా బోధపరచువారు ఎవరైన వత్తురా! అని కనిపెట్టుచుండెనట. ఉర్దు బైబిలును తీసికొని పొమ్మని

దేవుడు నాకు చెప్పినది యిందులకే. అది అతనికి యిచ్చితిని. ఎంతో సంతసించినవాడాయెను. తృణలో నిజమైన సమాధానమును పొందెను.

ఈ రీతిగా, ఎప్పుడెప్పుడు మేము కలిసికొని ప్రార్థన చేయుట సాధ్యమాయెనో, అప్పుడంతయు ఫలితము, ఆశీర్వాదము, ఒక నూతనమైన విధముగా దేవుని శక్తిని పొందితిమి. ఇది ఎప్పుడో ఒకసారి మాత్రమే జరిగిన విషయము కాదు. ఇప్పటికి నా 32 సంవత్సరముల పరిచర్య కాలమంతయు ఇట్లే జరిగెను. అనుభవ పూర్వకముగా మేము తెలిసికొనినది ఏమనగా, చాలినంత వరకు ఓర్పుతో ఎట్టి పరిచర్యలోనైనను ప్రభువు చిత్తము కొరకు కనిపెట్టగా దేవుడు మాకు ఒక ప్రత్యేక విధముగా తోడ్పడియున్నాడు. సువార్త దండయాత్రలు, సువార్త కూటములు, పరిశుద్ధ కూటములు మేము జరిగించినప్పుడు, ఇంత ఆశీర్వాదము మాకు దొరుకుటకు ఇదే కారణము. మేము ప్రార్థన చేయుదుము, దేవుడు ఆశీర్వాదము నిచ్చును.

మా పరిచర్య విషయము దేవుని ఏర్పాటు ఏమని మేము కోరుచున్నందున డబ్బు అడిగే అవసరము ఉండదు. ఈ దినములలో ఎందరో ఒక పెద్ద కార్యము చేయ నుద్దేశించుకొని, డబ్బు లేనందున భిక్షమెత్తుచున్నారు. డబ్బు అడుగుట తప్పుకాదు అని తీర్మానించుకొని లోక పద్ధతులన్నియు అవలంబించుటయేగాక, భక్తి హీనులను కూడ అడిగి తీసికొనుచున్నారు. అపొస్తలులు ఎన్నడైనా ఇట్లు భిక్షమెత్తలేదని దేవుని వాక్యములో చూచియైనా వీరు తెలిసికొనకున్నారు. ఇచ్చువారికి తమ హృదయములలో ప్రేరేపణ కలుగగా, సంతోషముతో ఇచ్చుట నేర్చుకొనిరి. ఇండియాలో ప్రభువు కొరకు ఇన్ని సంవత్సరములు చేయుచున్న మా స్వంతసేవలో డబ్బు విషయము ఒక చిన్న సూచనయైన ఇవ్వవలెనను అవసరము మాకు ఎన్నడు లేకుండెను. అప్పుడప్పుడు ఒకటిగా కూడుకొని ప్రార్థన చేయుచుంటిమి. ఆ కార్యము

దేవునిదే అయినందునను, తన సేవకుల అక్కరలను తీర్చు బాధ్యత ఆయనదే అయినందునను, మాకు ఎల్లప్పుడు ఆయనే అనుగ్రహించి యున్నాడు. ఏ బిల్లును (bill) చెల్లించుటకైనా, ఒక్క దినము కూడా మేము ఆలస్యము చేసే అవసరము లేకపోయెను. సమయము మించనివ్వక ప్రభువు సమస్తము చెల్లించునను వాగ్దానము మాకు గలదు. అయినప్పటికిని, ప్రతికార్యములోను ఏ దండయాత్రకు గాని ఏ విధమైన సువార్త సేవకుగాని పూనుకునే ముందు మున్ముందుగా దేవుని ఏర్పాటు ఏమైయున్నదో, దేవుని సమయమేదో దాని నిశ్చయత కలిగి యుండవలెను. ఇండియాలోగాని, ఇతర దేశాలలోగాని, మేము ఎవరిని కూడ సహాయము కొరకు నమ్ముకొని యుండలేదు. మాకు కావలసినదంతయు దేవుని యొక్క ఏర్పాటు ఏమైయున్నదో అదే. మన వ్యక్తిగత జీవితములో నేమి, కుటుంబ జీవితములోనేమి, సంఘ జీవితములోనేమి ఇదే ప్రాముఖ్యమైనది. దైవ ఏర్పాటు అవలంబించిన ఎడల, మన సమస్త అక్కరలను తీర్చుటకు దేవుడే బాధ్యత వహించునని ఎరుగుదుము. లేదా దావీదువలె మన స్వంత జ్ఞానమునే ఉపయోగించి, దేవుని ఏర్పాటును మార్చితిమా మనకు సంభవించు నష్టము ఇంత, అంతయని చెప్పుటకు సాధ్యము కాదు. ఈ నష్టము ద్వారానే, దేవుని చిత్తము కనిపెట్టి తెలిసికొనుటయు, ఆయన మాటకు విధేయులగుటయు, ఆయన ఏర్పాటు వెంబడించుటయు ఎంత అవసరమో హెచ్చరింపబడుతున్నాము.

సంఘమును నిర్మించుటకు ఇది అత్యంత అవసరము. దేవునికి అనుకూలమైన సంఘ కాపరులే మనకు కావలసియున్నారు. దేవుడు ఎవరికి పిలుపునిచ్చి, సిద్ధము చేసి, ఈ గొప్ప కార్యము కొరకు ఏర్పరచియున్నాడో తెలిసికొనుటకై, ఎన్ని దినములు లేక వారములు లేక మాసములు పట్టినను సంఘముతో కలిసి ప్రార్థన చేయుట అగత్యము. దేవుని సేవయందు మనము పూనుకొనవలసియున్న బాధ్యత ఏదైయుండినను, మనము తప్పక దేవుని

సముఖము. ఆయన యొక్క ఏర్పాటు వెదకవలెను. మనము పూర్వకాలమందులేము. ఈ దినములు వేరు. ఆ దినములు వేరు, అప్పటి పద్ధతులు ఇప్పటికి కుదరవు అనుచు దేవుని వాక్యమును మనము మార్చివేయుటకు వీలులేదు. దేవుని వాక్యము ఎన్నటికిని మారదు. కావున నీ పరిచర్య యందు నీ బుద్ధికి తోచినట్లుగా నీవు చేసిన సేవ వలన, లేక ఆయన సముఖము వెదకి, ఆయన చిత్తము తెలిసికొనక వివాహము చేసికొనినచో వైవాహిక జీవితము వలన, నీవు పోగొట్టుకొనిన సమస్తమును తిరిగి పొందుటకు సహాయము చేయుమని దేవునికి ప్రార్థన చేయుము. నీ పశ్చాత్తాపము ద్వారా ఇతరులకు లాభముండవచ్చును. నీ వైవాహిక జీవిత విషయమై మీరు ఉభయులు చేసిన పొరబాటును గూర్చి పశ్చాత్తాపపడి, దేవుని క్షమాపణ కోరిన యెడల ఆయన తప్పక క్షమించును. పోగొట్టుకొనిన వాటిని తిరిగి పొందుట మాత్రమేగాక, యితరులకు కూడ మీ జీవితములు ఆశీర్వాదముగా ఉపయోగింపబడును.

# 5వ అధ్యాయము

# దావీదు పొందిన మూడవ నష్టము

2 సమూయేలు 11)

దావీదు సమస్తము తిరిగి తెచ్చుకొనెను. అచ్చట దావీదు పేరు కొట్టివేసి, మనలో ప్రతి యొక్కరము, మన మన పేర్లను ఆ స్థలమందు వ్రాసికొందము. పిమ్మట, మాకు కూడ ఆ మాటలలోని సత్యము అన్వయింప జేయుమని అడుగుచు, పరిశుద్ధాత్ముడు ఈ మాటలను మా హృదయముల మీద చెక్కును గాకయని ప్రార్థన చేయవలెను. మరి ఏ విషయమును జ్ఞాపకముంచుకొనునట్టి శక్తిలేని మొద్దుతల నీకుండినచో, ఈ కొన్ని మాటలు జ్ఞాపకముంచుకొనుము - దావీదు సమస్తమును తిరిగి తెచ్చుకొనెను. అనగా దావీదు పేరుకు బదులు నీ పేరు పెట్టుకొని ఆ మాటలను శబ్దముతో పలుకుచు, దీనిని నీ స్వంత అనుభవముగా చేయుమని ప్రార్థించుము. నీ నష్టము ఎంత పెద్దదై యుండినను, దానికి ఎంత సిగ్గుకరమైన కారణముండినను, ఆ నష్టపడిన దానిని తిరిగి తెచ్చుకొనవచ్చును. ఏ పాపియైనను, ఆ నష్టపడిన దానిని తిరిగి తెచ్చుకొనవచ్చును. ఏ పాపియైనను, ఏ దేశమందైనను, ఎంత మట్టుకు పోగొట్టుకొనినను దానిని తిరిగి పొందు నిమిత్తమే మన ప్రభువైన యేసు క్రీస్తు ఈ లోకమునకు వచ్చెను.

బాల్యకాలము నుండి, మనలో ప్రతి యొక్కరము ఎన్నెన్ని వస్తువులనో

పోగొట్టుకొని యున్నాము. విద్యార్థి దినములలో పుస్తకములు, పెన్సిళ్ళు, రబ్బర్లు, ఫౌంటెన్ పెన్నులు మొదలైనవి. కొందరు చెప్పులు, తాళపు చెవులు, చేతి గడియారములు (Watches) పోగొట్టుకొందురు. మొదటినుండి ఇప్పటి వరకు నీవు పోగొట్టుకొనిన వస్తువులు ఇన్నియని ఊహింపగలవా? జ్ఞాపకమున్నంత మట్టుకు ఒక పట్టిలో వ్రాయుము. ఒకానొక దినమున అవన్నియు నీకు తిరిగి దొరుకునని అనుకొనుము. నీకెంత సంతోషము కలుగును! అలాగుననే అనేకులు తమ ఆరోగ్యము, కొందరు తమ స్నేహితులను, కొందరు తమ పిల్లలను, మరికొందరు సంతోషమును పోగొట్టుకొందురు. ఇవన్నియు తిరిగి పొందుట, పోగొట్టుకొనిన సమస్తము తిరిగి దొరకుట ఎంత సంతోషము. ఆత్మీయముగా మనము పోగొట్టుకొనిన సమస్తము తిరిగి తెచ్చుకొనగలిగితే, ఈ సంతోషము ఇంకెంత గొప్పదై యుండునో! ఆత్మీయముగా ఎంతెంత పోగొట్టుకొనుచున్నామో మనకు తెలియుటలేదు. ఎంత బుద్ధిహీనులము. దీనిని సరిగా అంచనా వేయుటకు దేవుడే మనకు సహాయము చేయగలడు.

2 సమూయేలు 11లో కనబడుచున్న దావీదు యొక్క మూడవ నష్టమందు, విశ్వాసులకు, అవిశ్వాసులకును కూడ నొక వర్తమానము కలదు. మొదటిగా, మానవ హృదయము యొక్క చెడుతనమును, మోసమును మనము చూచునట్లు చేయుచున్నది. మనము ఎవరమైనను సరే పైకి ఎంత మంచివారుగా, చక్కనివారుగా కనబడినను అందరమును లోన ఒకే రీతిగా మురికి, మలినము, రోత కలిగియున్నాము. సత్యమనునది మన జీవితములు ఎరుగవు. మన నిజ స్థితి చూచుటకు మనకు ఏ మాత్రము ఇష్టము లేదు. ఎవరైనను మనకు తెలియచేసిన యెడల, మనలను అవమానపరచునట్లు ఎంచుచున్నాము. దేవుని వాక్యమును చదువునప్పుడు నొప్పి, కోపము కలుగుచున్నవి. మనమెల్లరము ఈ క్రింది కథలోని నీగ్రోజాతి వానివంటి వారము. ఒకనాడు ఎక్కడో కాలినడక మార్గమున పోవుచుండగా, ఒక అద్దము

వానికి దొరికెనట. అతడు ఎన్నడు తన ముఖ రూపము తెలియనివాడు. ఈ మొదటిసారి అద్దములో చూచుకొనగా మసిబొగ్గును మించిన నల్లని ముఖము, వ్రేలాడు దళసరి పెదవి, చేటలను పోలిన చెవులు కనబడగా, ఈ వికారమైన రూపమునకు కోపగించి, ఒక రాయితీసి అద్దమును ఇట్లనుచు పగలగొట్టి పారవేసెనట : "ఇది ఏమన్నమాట? నన్ను ఈలాగు అవమానము చేస్తున్నావు? నేనెక్కడైనా ఇంత నల్లగా ఉన్నానా? నీవంతా మోసమే" అద్దమును పగుల గొట్టినాడు సరే, దానివలన ముఖ రూపము మారినదా?

మన నిజస్థితి తెలుసుకొనుటకు మనము ఇష్టపడము. మనము ఉండు దానికంటె కొంచెము మేలుగానే కనపడవలెనని చూతుము. కొందరు, ఇండ్లలో మురికితోలుగానున్న గుడ్డలు వేసికొని యుందురు. ఇతడు పంచెను ఉదుకుకొని ఆరునెలలై యుండునా అనిపించును. అక్కడున్న తలగడలు, సంచులు మురికితో అట్టలు కట్టియుండును. వాటిని ఉదికి మూదేండ్లయినా కావచ్చును. బయటకు బయలుదేరినప్పుడు ఈ కుటుంబమును చూచితే, ఎంత రమ్యముగా, ఎంత శుభ్రముగా, ఎంత చక్కగా ముచ్చటగా నుందురో. కొందరి ఇంటిలోని కూర్చుండు గది ఎంతో శుభ్రముగాను, అందముగాను ఉండి విలువైన సొగసైన సామానులతో అమర్చబడి యుండును. స్నానపు గదికి (Bath room) వెళ్ళినట్లయితే గుడ్డతో ముక్కును మూసుకొనవలెను. వంటగదిలో అన్నియు మసి పాత్రలే. ఆ స్థలమంతయు మురికితో నిండియుండును. ఎందుకనగా అమ్మగారు బి.ఎ. పాసైనవారు; తలకు పోసికొని, బట్టలు చక్కగా ధరించుటకు అన్ని గంటలు పట్టితే, ఇల్లు చక్కబెట్టుటకు ఆమెకు సమయము ఎక్కడున్నది? ఇదే రీతిగా కొందరు ఆత్మీయముగా లోన ఒకటి, పైకి ఇంకొకటిగా నున్నారు. ప్రతి యొక్కరి హృదయ నిజస్థితి ప్రభువు ఎరుగును. ఆయన మన యొక్క నిజస్థితి యేమిటో ఉన్నది ఉన్నట్లుగా మనకు చూపించును. మనకది ఎంతో సిగ్గుకరముగా నుండినను, మన నిజస్థితిని గూర్చి దేవుడు చెప్పుదానిని తెలిసికొనుట మంచిది.

వైద్యుని యొద్దకు వెళ్ళినప్పుడు నీ జబ్బు ఇదియని సరిగా పరీక్షించి తెలిసికొంటేనేగాని, నీకెట్లు చికిత్స చేయగలడు? క్షయ రోగమునునది యొకటి యున్నది. పూర్వకాలమందు ఎందువలన ఈ రోగము వచ్చుచున్నదో తెలియక, క్షయరోగిని దయ్యము పట్టినవాడని తలంచెడివారు. రోగిని ఏ మూలనో పడవేసి చావనిచ్చిరి. కొన్నిసార్లు అనేక సంవత్సరములు అట్లే వుంచెడివారు. ఎప్పుడైతే దేనివలన క్షయ రోగము వచ్చుచున్నదని తెలిసికొనిరో, అప్పుడు దానికి చికిత్సను కూడ కనిపెట్టిరి. నేను డెన్మార్క్ వెళ్ళినప్పుడు క్షయ రోగుల కొరకు స్థాపింపబడిన చికిత్సాలయములు ఎన్నో ఖాళీగా నుండుట చూచితిని. ప్రారంభమందు క్షయకు కారణము తెలియని కాలములో, అనేక రోగులుండిరి. ఎప్పుడైతే కారణము, చికిత్స కూడ కనిపెట్టిరో, దేశమందు క్షయను నిర్మూలము చేసిరి. ఇదే విధముగా హృదయము యొక్క నిజస్థితి తెలిసికొనుట మేలు. తన వాక్యము ద్వారాను, తన సేవకుల ద్వారాను, నీ హృదయ నిజస్థితిని దేవుడు నీకు చూపగా ఆయన మీద కోపము తెచ్చుకొనవద్దు. బైబిలు ఏమి చెప్పుచున్నది? "హృదయము అన్నిటికంటె మోసకరమైనది, అది ఘోరమైన వ్యాధి కలది, దానిని గ్రహింప గలవాడెవడు?" (యిర్మీయా 17:9).

ఇప్పుడు 2 సమూయేలు 11లో దావీదు చరిత్రను చూచెదము. అతని మొదటి పరిచయము 1 సమూ. 16:18లో మనకు కలిగినప్పుడు దావీదు కంటె మంచివాడును, నేర్పరియు మరొకడు వుండి యుండడనుట చూడగలము. ఈ విషయము ప్రతివారు ఒప్పుకొనిరి. యౌవనము నుండియు, దావీదు దైవ భయము గలవాడు, జ్ఞాని, యథార్థవంతుడు, సత్పురుషుడు, మరియు దేవుడు ఏర్పరచుకొనినవాడు. ఏ దేశస్థుడైనను, ఏ కులస్థుడైనను ఒక ఉన్నత విద్యాపరుడును, నేర్పరియునై యుండవచ్చును గాని అది అతని హృదయాంతర్యమందు మార్పు కలుగజేయదు. ఎవరును తమ నిజ స్వభావ మును ఎరిగియుండలేదు. పాపములోనే జీవించు నిమిత్తము దావీదు జన్మించలేదు. కొందరు బిడ్డలు పుట్టుకతోనే దుష్ట స్వభావులుగా నున్నారు.

ఎదిగిన కొలది మాటలలోనేమి, చేష్టలలోనేమి దుష్టాభ్యాస చిహ్నములే వీరు కనబరచుచున్నారు. ఇట్టివి దావీదులో నుండలేదు. అతడు మంచివాడు, చాలా కాలము వరకు అతనిది మంచి జీవితమైయుండెను. చెడును ద్వేషించి, దానికి దూరముగా నుండెను. అయితే, దావీదు ఎరుగని ఒక దుష్ట స్వభావము అతని యందు ఎక్కడో మరుగైయుండెను. దీనివలన దేవుడు అతనిని మార్చితేనేగాని, అతడు ఏమంత విస్తారముగా ఉపయోగపడలేడు. 2 సమూయేలు 11లో కనపడిన విషయము ఏల సంభవించెననగా దేవుడు దావీదులో ఏమి చూచుచుండెనో, అది దావీదు తానే చూచుకొనవలెననియే. ఎంతో యుక్తిగా, ఎంతో ఉపాయముతో సాతాను దావీదును శోధనలో దించెను. దావీదును శోధనలో ముంచు నిమిత్తము, ఒక తరుణము వెదకుచు సాతాను ఎంతగానో కనిపెట్టుచుండెననునది ఈ అధ్యాయము మొదటి వచనములోనే మనము గ్రహించుచున్నాము.

రాజులు యుద్ధమునకు బయలుదేరు వసంతకాలము వచ్చెను. అయితే, యుద్ధవీరుడును పరాక్రమశాలియునైన దావీదు, తాను చేయవలసిన ధర్మము ప్రకారము యుద్ధమునకు వెళ్లుటకు బదులు యెరూషలేములో, ఇంటి దగ్గరనే కూర్చుండెను. ఇదేమంత ప్రమాదకరమైన విషయమని యనిపించును? కాని దేవుని దృష్టిలో అది అత్యధికముగా తప్పిపోవుటయే. రణశూరుడు యుద్ధమునకు వెళ్ళక ఇంటిలో కూర్చుండు పనియేలేదు. తరువాత వచనములో, అది ప్రొద్దు గ్రుంకు వేళయని యున్నది. ఈ పరాక్రమవంతుడైన దావీదు ప్రొద్దుగ్రుంకు వేళ వరకు నిద్రపోవుచునుండెను. తాము మేలుకొని యుండవలసిన సమయమందు నిద్రించుచున్నట్టివారు అనేకులున్నారు. ఎచ్చటనైనా ఏ వేళయందైనా, మీటింగులలో సహితము నిద్రబోగలరు. ఎవరైనను వారిని తట్టిలేపి నిద్రపోవద్దు అని చెప్పినచో, "నేనెక్కడ నిద్రపోయాను? ప్రార్థన చేయుచున్నాను" అని అందురు. ఇంత మాయలోపడి వీరుడైన దావీదు బద్ధకస్థుడాయెను. అడుగుమీద అడుగు వేసినట్లు ఏరీతిగా సాతాను

దావీదును శోధనలోనికి నడుపుచుండెనో చూచితివా? సాతాను బహు దుష్టుడు. యుక్తిగల శత్రువని జ్ఞాపకముంచుకొనుము. ఎంతో ఉపాయముతో అతడు దావీదును పడగొట్టుటకు ప్రయత్నించెను. తీరుబాటుగా రాజనగరి మిద్దెమీద దావీదు తిరుగుచుండగా శోధన ఎదుటకే అతడు తేబడెను.

ఈ పాపమును కప్పి వేయుటకు దావీదు ఆలోచించిన మార్గములు, సాధనములు, ఉపాయములు ఇన్ని అన్ని కావు. ఒక పాపమును దాచుటకై, పాపము చేయు ఇతర మార్గములను వెదుకసాగెను. ఇట్లు వేషధారుడాయెను. తన పాపము పట్టుబడిపోవునని దావీదుకు తెలియగానే, ఆ స్త్రీయొక్క భర్తయగు ఊరియాను దావీదు యుద్ధభూమి నుండి పిలిపించి ఎంతో శ్రద్ధ గలిగియున్నట్లు నటించి, యుద్ధము విషయమును, సేనానియగు యోవాబు, అతని సైన్యము, యుద్ధభటులను గూర్చియు సంగతులు అడుగనారంభించెను. "యోవాబు ఏలాగున్నాడు? నా సైనికులు ఎట్లున్నారు? యుద్ధము ఏలాగు సాగుచున్నది? ఇవన్ని కొంత నాకు తెలుపుము" అని అడిగెను. ఏమియు నెరుగని అమాయకునివలెనే నటించెను. అంతా వేషమే. ఇదంతయు పాపమునెట్లో మరుగు చేయవలెననియే. ఊరియామీద ఇంత అభిమానము చూపుట ఊరియా నిమిత్తమే అనుకొంటివా? సంభాషణ తీరిన వెనుక అతనితో దావీదు ఇట్లనెను - "ఊరియా, చాలా అలసిపోయి ఉన్నావు, నీకు తిరిగి పెద్ద ప్రయాణమున్నది. నేను చాల విచారించుచున్నాను. ఇంటికి పోయి, వేడినీళ్ళ స్నానము చేసి హాయిగా పండుకో! నీకు విశ్రాంతి అవసరము.

ఈ దినము రాజుగారికి ఏమి దయ! ఊరియా ఒక మామూలు యుద్ధ భటుడు. ఇతని మీద రాజుగారికి ఎంత శ్రద్ధ! ఊరియా రాజభవనము నుండి బయట అడుగు వేసెనోలేదో, అతని వెనుకనే ఒకడు వచ్చి, రాజుగారి భోజనపు బల్లనుండి తాను తెచ్చిన బిర్యాని, కోడికూర మొదలైన విందు పదార్థములు అనేకములను ఊరియాకు అందించెను. ఇట్టి భోజనము ఊరియా తన

జీవితకాలమందు ఎన్నడైనను చూచియుండెనా? ఈ దినము అతని మీద దావీదు రాజుకు ఎంత దయ కలిగెను. ఒక్క పాపము రెండవదానికి, అటు పిమ్మట మూడవదానికి మరియు నాలుగవదానికి కూడ నడుపుచున్నది. గొప్ప సార్వభౌముడు, జ్ఞానవంతుడైన దావీదు వ్యభిచారులలో మొదటి రకమైన వాడై, పిమ్మట మోసగాడు, వేషధారి, అబద్ధికుడు నాయెను. ఇదంతయు ఒక్క పాపమును కప్పివేయు నిమిత్తమే. అయితే ఊరియా ఇంటికి వెళ్లినవాడు కాడు. రాజభవన ద్వారము వద్దనే పరుండి నిద్రించెను. మరునాడు ఈ విషయము తెలియగా రాజు అతనితో నిట్లనెను - "ఊరియా, ఇప్పటికైనను, నీ ఆయాసము తీరలేదు. నీవు కొన్ని దినములు సెలవు తీసికొని ఉండిపోవచ్చును." సాధారణముగా జరుగు వ్యవహారమేమి? ఒక యుద్ధ భటుడు సెలవు కొరకు అర్జీ పెట్టినచో అది సాంక్షన్ (Sanction) చేయుటకు 6 నెలలు పట్టును. "నా భార్య జబ్బుగా నున్నది" అని చెప్పినచో, లేదు నీవు వెళ్ళడానికి వీలుకాదు" అని అధికారులు చెప్పెదురు. ఇక్కడ చూచితే, "నీవు అర్జీ పెట్టకుండానే, నీకు ఇన్ని దినాలు సెలవిస్తున్నాను" అని దావీదు అంటున్నాడు. ఏలయని ఎవరికిని అర్థము కాలేదు. అయినప్పటికిని ఊరియా ఇంటికి మాత్రము వెళ్ళకుండెను. సైన్యమంతా యుద్ధభూమి మీద యుండగా, ఊరియా మాత్రము ఇంటిలో సుఖనిద్ర చేయునా? దావీదు చేసిన ఈ ఉపాయము చెల్లినది కాదు. చివరకు ఊరియా చావవలసినదేయని దావీదు తీర్మానించి యోవాబు ద్వారా ఈ పనిని జరిగించెను. ఎంత ఘోరమో! జ్ఞానవంతుడైన రాజు నరహంతకుడాయెను. ఊరియా ప్రాణమును తీయు పుద్దేశము దావీదుకు లేదు. వ్యభిచారము చేయవలెనను ఉద్దేశము అతనికి లేదు. తనలో మరుగుగా నుండిన ఈ స్వభావమును అతడు ఎరిగి యుండలేదు. శోధన కలిగిన తరువాతనే, తన హృదయము ఎంత చెడ్డ హృదయమో అతడు గ్రహించెను.

కొన్ని వ్యాధులు ఎట్టివనగా, అవి మనకు తగిలినప్పుడు, వెంటనే

మనకు తెలియుట లేదు. విష బీజములు శరీరమందు కొన్ని యేండ్లు పనిచేసిన పిమ్మటనే తెలిసికొనుచున్నాము. అంతకాలము, బాగుగానే యుంటిమి. చక్కగానే నిద్ర పట్టుచుండెను. ఆహారము కొరకు మంచి ఆకలి యుండెను. మనము జబ్బుగా నున్న సంగతి ఇతరులు విన్నప్పుడు : "మీకు అనారోగ్యముగా యున్నదని మాకు తెలియలేదు" అని అందురు. చాలా జబ్బు చేసిన తరువాతనే, ఒకప్పుడు పెద్ద జబ్బు బయటపడిన తరువాతనే ఇన్ని యేండ్లు ఆ వ్యాధి లోపల వుండెనని తెలుసుకొనుచున్నాము.

దావీదు విషయమైన ఈ సంగతి బైబిలులో ఏల వ్రాయబడెను? సాతాను యొక్క మోసములో మనము పడకుండునట్లు, మనలను జాగ్రత్తగా వుంచుటకే. సాతాను మనలను ఎట్లు మోసగించునో, మనకు తెలిసియుండుట మంచిది. ప్రతి యొక్కరము పాప స్వభావముతోనే జన్మించితిమి. దావీదు పాపములో పడిన తరువాతనే ఈ సంగతి తెలిసికొనెను. కావుననే కీర్తన 51లో ఇట్లనుచున్నాడు : "నేను పాపములో పుట్టిన వాడను." 1 సమూయేలు 16లో దావీదు విషయము ప్రజలు, "అతడు చాలా మంచి యువకుడు, దేవుని భయము, బలమైన విశ్వాసము కలిగినవాడు. అందరికి మంచివాడు, అందరిని ప్రేమించువాడు" అనిరి. ఈ మానవ యోగ్యతలలో ఒక్కటియైనను శాశ్వతము కాదు. ఎవడును ఎల్లప్పుడు మంచివాడై యుండడు. ఎట్టి విద్యయైనను మన అంతరంగ స్వభావము మార్చివేయజాలదు. అందరము కూడ పాప స్వభావముతో పుట్టితిమి. ఒకనాడు అది బయలుపడి సిగ్గుకరమైన కార్యములను మనచేత చేయించును. ఎన్నో సంవత్సరములు గడచిన తరువాత ఇది జరుగవచ్చును.

దేవునికి తెలియకుండునట్లు నీ స్థితిని దాచి పెట్టలేవు. మనలను క్షమించి, మార్చివేయు నిమిత్తమే మన పాప స్వభావమును దేవుడు బయలు పరుచుచున్నాడు. తాను ఏర్పరచుకొనిన పాత్రగా దావీదును ఉపయోగించుటకు ముందుగా, దేవుడు అతనిని మార్చివేసి, రూపాంతరము చేసి, శుభ్రపరచి,

కడిగి, శుద్ధీకరించవలసి యుండెను. కీర్తన 51లో దావీదు ఏమనుచున్నాడో చూచితివా? తన నిజస్థితి ఇదియని, తన హృదయమిట్టిదని గ్రహించెను (వచనములు 7,9,10). రాజ్య మంతటను ఎంతో గొప్పగా మెచ్చుకొనబడిన ఆ దావీదే ఇట్లు తన విషయము ఒప్పుకొనుచున్నాడు. విరిగిన హృదయముతో ఇట్లనుచున్నాడు "ఓ దేవా! నాకొక శుద్ధ హృదయము, నూతన హృదయము నిమ్ము. నాకొక పవిత్ర హృదయము ననుగ్రహించుము నన్ను శుద్ధీకరించుము, శుభ్రపరచుము, సంపూర్ణముగా కడిగివేయుము. నా దోషమునంతయు తుడిచివేయుము."

దేవుడు నీలో ఏమి చూచుచున్నాడో నీ యొక్క ఆ నిజస్థితిని నీవు చూచుకొనుటకు ఇష్టపడవలెను ఒకడు "నీవు పాపివి" అని నీతో చెప్పిన యెడల - "నేను పాపినని చెప్పడానికి నీవు ఎవరు? నా స్నేహితులను పొరుగువారిని పోయి అడిగిచూడు" అని జవాబు చెప్పెదువు. మనుష్యుల సంగతి అటుంచుము. దేవుడు నీ గురించి ఏమి భావించుచున్నాడు. ఆయన నిన్ను పరీక్ష చేయనిమ్ము. ఆయన పాపమును, పాపమే అని చెప్పును. కొందరు గ్రుడ్డివానిని 'గ్రుడ్డివాడా!' అని పిలిచిన బహు కోపము వచ్చును. అట్లుగాక "సూర్యదాసూ! ఏలాగు వున్నావు?" అని అడిగినచో చాల సంతోషముగా నుందురు. సూర్యదాసు పేరుగల ఒక ప్రఖ్యాతి చెందిన హిందూ భక్తుడు ఉత్తర ఇండియాలో నుండెను. అతడు గ్రుడ్డివాడు. ఉత్తర ఇండియా వారు ఏ గ్రుడ్డివానినైనను సూర్యదాసు అని పిలుతురుగాని "గ్రుడ్డివాడా" అని పిలువరు. బైబిలు పాపమును, పాపమే అనుచున్నది. నీవు న్యాయవాదివైన, వైద్యుడవైన, విద్యావంతుడవైన, ధనికుడవైన, దరిద్రుడవైన, జ్ఞానవంతుడవైన, ఎవరైనను సరే, దేవుని దృష్టిలో నీవు పాపివి. భయంకరముగా చెడిపోయియున్న పాపివి, దండన క్రింద నున్నవాడవు, మలినమైన వాడవు, ఎండిపోయిన ఆకువంటి వాడవు, వడలిపోయిన పువ్వులాంటి వాడవే. ఒక పురుగువు మాత్రమే, కేవలము మంటివాడవే.

ఈ రీతిగా మనము జన్మించుచున్నామని బైబిలు చెప్పుచున్నది. దేవునికి స్తోత్రము. ఇవన్నియు మార్చివేయబడగలవు. పాపి పరిశుద్ధుడు కాగలడు, అపవిత్రుడు కడిగి వేయబడగలడు. మలినుడైన పాపి పరలోక వస్త్రములు ధరింప చేయబడి తన సమస్త పాపముల నుండి విడుదల చేయబడగలడు. నీవు ఉన్నది ఉన్నట్లుగానే దేవుని దగ్గర ఒప్పుకొనుము. నీ స్థితిని నీవే మార్చుకొన చూడవద్దు ``అవునా ప్రభువా! నేను పాపిని`` అని చెప్పుము గాని ``వానికంటె నేను కొంచెము మేలే పట్టభద్రుడైన ఒక పాపిని, లేక నాగరికుడైన ఒక పాపిని`` అని ఈ విధముగా చెప్పకుము. ఇవన్నియు చెప్పుకొంటివా నీవు ఇప్పుడున్నట్లే వుండిపోదువు. దేవుడు నిన్ను ప్రేమించుచున్నందున, నీ నిజస్థితి ఆయనకు తెలియజేసి - ``ప్రభువా! నేనంతయు మలినమైయున్నాను నన్ను కడుగుము నాకు శుద్ధ హృదయమును కలిగించి, నా పాత స్వభావమును తీసివేయుము`` అని విన్నవించుము. నీవు పోగొట్టుకొనిన ప్రతిదానిని తిరిగి పొందురీతి ఇదే. నశించుచున్న నీ జీవితము అపరిమితముగా ఫలించును. నీవు పలుకు ప్రతిమాట, నీవు చేయు ప్రతి కార్యము శాశ్వతమైన ఫలమునిచ్చును. నీ పాపపు జీవితము ఏ మాత్రము జ్ఞాపకమునకు రాదు. దేవుడు క్షమించినచో, ఆ క్షమాపణ నిత్యత్వమునకే. మనుష్యులు ఇట్లు క్షమింతురా? వారు మరచిపోరు. దేవుడు క్షమించిన యెడల ఎల్ల కాలమునకు మరచిపోవును. నీ పాపములను కప్పివేయును. నీ పాపములు ఎల్లకాలమునకు గతించిపోవును, అవి తుడిచి వేయబడును. ఏలయనగా నీకు బదులు ప్రభువైన యేసుక్రీస్తు మరణించి, నీ పాపపు శిక్ష యొక్క సంపూర్ణ విలువను తానే చెల్లించి యున్నాడు. నీ హృదయమును కడుగుమని ఆయనను వేడుము. నీవు అడుగనిదే ఆయ.న ఏమియు చేయజాలడు. ``ప్రభువా! నాలో ఒక పవిత్రమైన, శుభ్రమైన హృదయమును కలిగించుము. నన్ను కడిగి, శుద్ధీకరించి, సంపూర్ణముగా శుభ్రపరచుము`` అని చెప్పెదువా? నీవు ఈ విధమున దీనముగా, నిజముగా కోరి అడిగినచో ఆయన వినును, నీకు నిశ్చయముగా ప్రత్యుత్తర మిచ్చును.

## 6వ అధ్యాయము

# నష్టము : దానికి కారణము, దాని ఫలితము, దానికి మందు

దావీదు సమస్తమును తిరిగి పొందెను. అనగా అతనికి నష్టము కలిగియుండెనని ఈ మాటలే సూచించుచున్నవి. ఇంతవరకు చెప్పినట్లుగా మనమంతా ఎన్నో రీతులుగా నష్టము పొందినవారమే. చెప్పులు పోగొట్టుకొనినను కొంతకాలము మనస్సు ఏమియు బాగుండదు. ఒకప్పుడు చాలా చోట్ల చినిగియుండిన ఒక షర్టును చాకలివాడు పోగొట్టినను మనస్సుకు కష్టము కలుగును. ఆ పాత షర్టునే తిరిగి తెచ్చిపెట్టు మనుచున్నాము. మానవులైనందున వస్తువులే మనకు అతి ప్రాముఖ్యముగా నున్నవి. ఆత్మీయముగా ఎన్నెన్ని నష్టములు పొందుచున్నామో, వాటిమీద చింతలేదు. ఇది మరుపకుము, ప్రభువైన యేసుక్రీస్తును కలిగియుండక మనము గడిపే ప్రతి క్షణమును నిత్యత్వమునకు నష్టమే.

చాలా యేండ్ల క్రింద ఒక వృద్ధుని కలిసియుంటిని. నున్నని తలలో ఉండిన కొద్దిపాటి వెంట్రుకలు పండిపోయి యుండెను. "దేవుని రక్షణ మీకు అనుభవమేనా?" యని నేను అడుగగా, పెద్దవాదము మొదలు పెట్టెను. నాకు లోకమే తెలియదు, అని భావించి హాస్యము చేయనారంభించెను. అతడొకవేళ ఇట్లు మనస్సులో తలంచుకొని యుండవచ్చును "వీడొక కుర్రకుంక,

నాకేమో నేర్పుతావట." ఎన్నో మాసములు గడచిన తరువాత ఆ ముసలివానిని తిరిగి కలిసికొంటిని. కన్నీరు కార్చుచు వచ్చి - "సహోదరుడా! నన్ను గుర్తింప గలవా?" అని నన్ను అడిగెను. "అవును అనేక మాసముల క్రిందట ఫలాని చోటికి మీరు వచ్చియున్నారు" అని అంటిని. అప్పుడతడు - "నీవు వెళ్ళిపోయిన తరువాత నా మనస్సంతా కలతగా వున్నది. నీవు చెప్పిన మాటలు మరచిపోవలెనని ఎంత ప్రయత్నించినను లాభము లేకపోయెను" అనెను. నేను అతనికి ఇచ్చియుండిన వచనములు అతడు చదువునట్లు పరిశుద్ధాత్మ అతనిని బలవంతపెట్టెను. అతడు చెప్పినదేమనగా - "నా స్థితిని నేను తెలిసికొంటిని. నేను జీవించినది చీకటిలోనేననియు, నేను ప్రభువైన యేసుక్రీస్తుని నా స్వంత రక్షకునిగా అంగీకరించితే, ఆయన పాపములను క్షమించునని తెలిసినది." తిరిగి ఏడ్చుచు ఇట్లనెను - "అరవై సంవత్సరములు వ్యర్థము చేసినాను. ఇప్పుడు ఆయన నన్ను ఉపయోగించుకొనవలయునని కోరుచున్నాను. ప్రభువైన యేసుక్రీస్తును అంగీకరించితిని". మరల మరల ఇట్లే చెప్పుచుండెను! "బ్రతుకంతా వ్యర్థము చేసితిని జీవితములో శ్రేష్టమైన కాలమంతా గతించి పోయినది. మిగిలియున్న కొద్దిరోజులు ఆయనకు ఇష్టమైనట్లుగా జీవించాలని కోరుచున్నాను."

నీ పాపములు క్షమించబడని యెడల దేవుని దృష్టిలో నీ జీవితమంతా వ్యర్థమైపోయినది. ఈ సంగతి నీవు గ్రహింప గలుగుచున్నావా? యోవేలు 1:4 లో కాపువాని పంటను భక్షించి వేయునట్టి నాలుగు విధములైన కీటకములను చూచుచున్నాము. గొంగళి పురుగులు, మిడుతలు, పసరు పురుగులు, చీడ పురుగులు. కాపువాండ్రు ఎంతో ఆశతో రాత్రింబవళ్ళు కష్టపడి పనిచేసి నేలను సాగుబడి చేసి, విత్తనములు చల్లుచున్నారు. ధాన్యము చక్కగానే పండెను. కోతకాలము రాగానే ఏదో సంభవించి, పంటను పాడు చేసివేసెనని తెలిసికొనిరి. ఒక రకము పురుగుల వెనుక ఇంకొక రకము బయలుదేరి పొలమునంతటిని ధ్వంసము చేసివేసెను. కోతకు ఎంత పంట మిగిలెను? ఏమియు లేదు, అంతా

నశించెను. దేవుడేమి చెప్పుచున్నాడు? "పాపులారా! మీ జీవితమును ఎందుకు పాడు చేసికొనుచున్నారు? "పైన చెప్పబడిన పురుగులు తినివేసిన పొలము వలెనే మీ జీవితము యున్నది.

బాల్యమందు మనకెన్నో చెడు అలవాట్లుండెను. మొండితనముగా చేయరాని పనులు చేయుచు, కాలమంతయు వ్యర్థము చేయుచు తల్లిదండ్రులను దు:ఖపరచితిమి. అటు తరువాత మన పొరపాట్లను తెలిసి కొంటిమి. "అయ్యో! కొంత ఎక్కువ శ్రమపడి ఉంటే పరీక్షలో తప్పిపోయి యుండను కదా!" అంటిమి. యౌవనకాలము వచ్చెను. కామ మోహాలు మొదలైన వాటికి బానిసలై ఆ కోరికలను తీర్చుకొను నిమిత్తము జీవితములో శ్రేష్ఠమైన కాలమంతయు పాడు చేసికొంటిమి. యువకులు అనేకులు తల్లిదండ్రులు, గురువులు గద్దించి, బుద్ధి చెప్పిన యెడల, ఈ విధముగా చెప్పుచున్నారు: మీకేమి తెలియును? జీవితమంటే ఏమిటో మీకు ఏమి తెలియదు. ముసలోళ్ళకి గ్రహించే జ్ఞానమైనా లేదు. సబ్బు పెట్టి ముఖము కడగడమైనా రాదు. నాన్నగారు! మీ వయస్సు పెద్దదే గాని కట్టుకొన్న బట్టతోనే ముఖము తుడుచుకొనుచున్నారు. మేము యూనివర్సిటీ విద్యార్థులము కామా? ఈ సబ్బు చూడండి, ఎంత సువాసనగా ఉన్నదో! ముఖము తుడుచుకొనే తువాలు ఎంత బాగున్నదో. మీరు మాకు ఏదైనా బోధింపగలరా?" మన యౌవన కాలమందు మన సమయము, డబ్బు, బలము అంతా ఈ రీతిగానే పాడుచేసికొంటిమి. అమితమైన బలము, అవకాశము కలిగియుండిన కాలమందు అవమానపు బ్రతుకు బ్రతికితిమి. ఇక పనులు చేసి సంపాదనలు చేయుకాలము వచ్చెను. అవినీతి మార్గములలో డబ్బు సంపాదించి, డబ్బుమీద ఆశ వలన కూడ బెట్టుకొని, గర్విష్ఠులమైతిమి. ఏమి చెప్పుకొంటిమంటె "ఎంత తెలివితేటలు గలవాడను, ఎంత కొద్దికాలములో, ఎంత విస్తారముగా డబ్బు గడించుకొంటినో, నా ఉద్యోగ కాలము తీరిన తరువాత కొంత భూమి కొంటాను. దానిలో చాలా గదులతో ఇల్లు కట్టించుకొని, బిడ్డలు మనుమలు

మనుమరాండ్రతో కలిసి, హాయిగా సునాయాసముగా సుఖభోగాలతో జీవిస్తాను." "అయితే నీకు ముసలితనము వచ్చును. ఒకరి వెనుక నొకరు నీ బిడ్డలు వేరుగా వెళ్ళి పోవుదురు. నీ పండ్లు కూడ ఊడిపోవును. నీ డబ్బంతా వైద్యులకే వెళ్ళును. అప్పుడు నీవు కన్నీళ్ళు కార్చుచు. "ఇప్పటికే అరవై సంవత్సరములు నా జీవితమంతా పాడుచేసుకొంటిని. బ్రతుకంతా వ్యర్థమైపోయినది. గొంగళి పురుగులు, మిడుతలు, పసరు పురుగులు, చీడ పురుగులు నా కాలమంతటిని తినివేసినవి."

నేడు నీ స్థితి ఇట్లే యుండవచ్చును. నీ జీవితము వ్యర్థమాయెననియు, ఇప్పటికిని వ్యర్థమగుచున్నదనియు నీవు ఎరుగుదువు. ధైర్యముగా నుండుము. నీవంటి వానికి కూడ నిరీక్షణ యున్నది. నీవు పోగొట్టుకొనిన సమస్తము తిరిగి పొందగలవు. ఆ నష్టము ఎంత గొప్పదైనను, ఎంత అవమానకరమైనదైనను సరే, నీ జీవితము విస్తారముగా ఫలించును. నీవు గడుపు ప్రతి క్షణము నిత్యఫలము నిచ్చును. ఇందుకొరకే మన యేసుక్రీస్తు ప్రభువు ఈ లోకమునకు వచ్చెను. యోహాను 15:5లో ఆయనిట్లనుచున్నాడు – "ద్రాక్షవల్లిని నేను, తీగలు మీరు." ఆయనలో నిలిచియుంటేనేగాని స్థిరమైన ఫలితము మనయందుండదు. ఎన్ని సంవత్సరముల నుండి పోగొట్టుకొనిన వైనను, తిరిగి సమకూర్చుకొనవచ్చును. రక్షణ యొక్క ఆశ్చర్యకరమైన అద్భుతమిదే. పాపము వలన, సిగ్గుకరమైన కార్యముల వలన జీవితమంతా వ్యర్థమైయుండినను, క్రీస్తుయేసు ప్రభువులో నిలిచియుండి, ఆయనలో అంటు కట్టబడి యుండిన యెడల విస్తారముగా ఫలింపగలము.

అప్పుడప్పుడు తలంచని నష్టములు కలుగును. 2 రాజులు 4:38లో ఒక గొప్ప కరువు వచ్చిన విషయము చదువుదుము. వానలు కురియక ఎక్కడ పంటలు లేవు. ఇట్లు భూమి బీడుగా పడియున్నందున, తినుటకు ఏమైనను దొరుకునాయని జనులు ఇటునటు వెదుకుచుండిరి. బియ్యము లేవు, గోధుమలు లేవు, కూరగాయలు లేవు. ఆకులు ఏరుకొని తిని, ప్రాణములు

నిలుపుకొనుచుండిరి. ఈ దినములలో నగరములందు గొప్ప భవనములు లేచుచు, విశాలమైన క్రొత్త వీధులు వేయబడుచు, పెద్దపెద్ద కళాశాలలు, క్రొత్త పరిశ్రమలు, పరిశ్రమశాలలు తెరువబడుచు ఇట్లు క్రొత్త క్రొత్తవి బయలుదేరుచు నుండుటను చూచి, మనము నివసించునట్టి ఈ లోకము చాలా దర్జాగా యున్నదని మురిసిపోవుచున్నాము. దేవుని దృష్టి యందైతే ఇదంతయు నిష్ఫలితమైన శూన్య ప్రదేశమే. ఈ లోకమును ఒక ఎడారియనియు, భయంకరమైన అరణ్య భూమియనియు బైబిలు చెప్పుచున్నది. ఒకనాడు ఈ చిత్ర విచిత్ర వస్తువులన్నియు తీసివేయబడి కాల్చివేయబడును.

2 రాజులు 4లో ఆ కరువును బట్టి ధాన్యముగాని, ఏ భోజన వస్తువుగాని దొరుకనందున జనులు అడవులకు పోయి, అక్కడి మొక్కల యొక్క ఆకులను ఏరుకొనుచుండిరని మనము చూచుచున్నాము. అదే వారి ఆహారము. లోకములో ప్రస్తుతమున్న పరిస్థితి కూడ ఇదే. కరువు ఇట్లు లోకమందుండగా, ఒక వైపున తమ లౌకిక విద్య, ఐశ్వర్యము, అభివృద్ధి విషయము డంబములు కొట్టుకొనుచున్నారు. మరియొక వైపున, పాప నిలయములందుపడి, అశుద్ధత, మైల, మలినములతో క్రుళ్లుచున్నారు. ఎంత సమయము సినిమాలలోను, చెడుగు తావులలోను గడుపుచున్నారో! ఎక్కడ పోయినా, పాడు మ్యాగజీనులను (Magazines) తమతోనే తీసికొనిపోవుచు, చదువుటకు ఎంత సమయము గడుపుచున్నారో! నలువది మూడు సంవత్సరములు లోకములో ఎన్నో భాగములు తిరుగుచుండి రైలు బండ్లలోనూ, విమానములలోను, ఓడలలోను ఎందరినో కలిసియుంటిని. వారు నాతోటి ప్రయాణికులు, విద్యావంతులు, స్థితిమంతులు. ఈ స్త్రీ పురుషులను గమనించుచుంటిని ఎంతో పాడు పుస్తకములను, మ్యాగజీనులను నవలలను తమతో కూడ తెచ్చుకొని గంటలకొలది వాటిని చదువుచుందురు. ఈ లోకము ఎంతటి పాడు స్థలమో ఇదే దానికి ఋజువు.

2 రాజులు 4:39లో చెప్పబడిన పురుషులు అడవిలోనికి వెళ్ళి అడవి

కూరాకులను ఏరుకొనుచుండగా కొన్ని అడవి పాదులు కనబడెను. ఇవి చాలా బాగున్నవి, మంచి రుచికరమైన ఆహారము కాగలవు అని తలంచి, ఆ వెర్రి ద్రాక్ష తీగెలను తెంపి ఒక పెద్ద కూరకుండలో ఆకులను వేసిరి. ఆ ఆకుల రంగువలన మోసపోయి అవి ఆహారమునకు బాగుండునని యెంచిరి. ఆ కూరను వండుచు - ``మనకు మంచి భోజనము దొరికినది`` అనుకొనిరి. భోజనము వడ్డించి వారు తినుటకు ఆరంభించగా, వారిలో కొంచెము జ్ఞానము గలవాడు ఒకడు ఆ వంటలో ఏదో పొరబాటున్నదని గ్రహించి, ``దైవజనుడా! కుండలో విష మున్నది`` అనుచు కేకలు వేసెను. ఆ పదార్థము యొక్క రుచిని బట్టియో, వాసనను బట్టియో అది మరణము కలిగించు విషమై యుండెనని తెలిసికొనెను. కొందరు చేతిని నోటికి ఎత్తుచుండిరి. కొందరు అప్పుడే కొంత నోటిలో వేసియుండిరి. ప్రతివారు నిశ్చేష్టితులైనట్లు తినకుండా విడచిరి. ఏలయనగా కుండలో విషమున్నదని వినుట వలననే. ఈ పురుషులు మంచివారును, దేవుని సేవకులని చెప్పబడియున్నది. అయినను మంచి మొక్కలు ఏవో, విషపు మొక్కలేవో తెలియని వారైనందున ఈ వెర్రి ద్రాక్షతీగలను తెంపుకొనిరి. చేయుచున్న పని ఏమిటో తెలియక, స్వహస్తములతో విషమును కుండలో వేసిరి. ఇట్లే స్త్రీ పురుషులు మంచివారు సహా తమ కుటుంబముల లోనికి మరణమును తెచ్చుచున్నారు. గృహములలోనేమి, జీవితములలోనేమి తల్లిదండ్రులు, భార్యా భర్తలు, సోదర సోదరీలు గ్రహింపు లేనివారై మరణమును తెచ్చుచున్నారు. వారు ఎక్కడ పోయినను గ్రహింపు లేకనే తమ బిడ్డలను విషమునే తిననిచ్చుచున్నారు.

తిరిగి జన్మించనివారు ఇట్టివారు. ఏ రీతిగా మరణము వారి హృదయములలోను, కుటుంబములలోను ప్రవేశించుచున్నదో ఎరుగక మేమెంతో కులాసాగా జీవించుచున్నాము అని భావింతురు. మా బ్రతుకు ఎంతో ఆనందముగా నున్నదని తలంచెదరు. వెర్రి పురుషులు! వెర్రి స్త్రీలారా! మరణమును మీతోనే ప్రతిచోట కొనిపోవుచున్నారని తెలియని వారలారా! మీ

సంభాషణ మూలముగానో, మీ అభ్యాసముల ద్వారానో ఇతరులకు మరణము తెచ్చుచున్నారు. దైవ వెలుగులో మాత్రమే నీ స్థితిని మార్చుకొనగలవు. "పాపము యొక్క జీతము మరణము" అని దేవుని వాక్యము చెప్పుచున్నాది. ఆత్మీయ మరణము వచ్చుటకు ఒక్క పాపమైనా చాలును.

చాలా మోసకరమైన విషములు కొన్ని గలవు. మరణము గలుగ జేయుటకు ఒక చిన్నచుక్కయైనా చాలును. ఒక చిన్న పాపపు తలంపు, మాట, క్రియ మాత్రమే ఇంతపని చేయును. వీటి ద్వారానే మరణము పుట్టించు విషము తనుచు త్రాగుచున్నాము. ఈ బైబిలు కథలో ఆ ప్రవక్త శిష్యులు ఎంతో ఆశతో భుజింపబోవు చున్నప్పుడు ఆ కుండలో విషమున్నదని వినగానే, వైద్యులు, డాక్టర్ల దగ్గరకు పరుగెత్తక దైవజనుని కడకు పోయిరి. "రండి యెరూషలేముకు పోయి, పెద్ద స్పెషలిస్టును (Specialist) చూద్దాము" అని చెప్పుకొని యుండవచ్చును. అయితే జ్ఞానము గలవారైనందున మరణము నుండి ఏ డాక్టరు, ఏ స్పెషలిస్టు తప్పించలేడని తెలిసినవారు గనుక దైవజనుని కడకు పోయి - "ఓ దైవజనుడా! కుండలో విషమున్నది, మేము కొంత ఆ పదార్థము తింటిమి. ఇప్పుడు దయతో సహాయము చేయుము. కొన్ని నిమిషములలో మేము చనిపోనైయున్నాము" అని చెప్పిరి.

ఇదే పాఠము ఒకనాడు నీవు నేర్చుకొనబోవుచున్నావు. నీ జీవితము నవ్వుతోను, హాస్యపు మాటలతోను వ్యర్థపరచితివి. అయినను "మా బ్రతుకులు ఎంతో బాగున్నవి. మా జీవితములో శ్రేష్ఠమైన దానిని పొందుచున్నాము" అనుచున్నావు. అయితే ఒక దినము వచ్చుచున్నది. అప్పుడు నీవు మాత్రమేకాక, నీ పిల్లలు, నీ కుటుంబమంతా మరణాపాయములో నున్నారనియు, కేవలము నరకమునకు పాత్రులనియు తెలిసికొందువు. సమయము వచ్చినప్పుడు నిన్ను రక్షించువారే కనబడరు. పై కథలోని జ్ఞానము గల పురుషులు దైవజనుని కడకు పోయిరి (వ. 41). ఆయన మాట ప్రకారము కొంత పిండి తెచ్చి ఆ

కుండలో వేయుగా అది పాషాణమునకు విరుగుడు ఆయెను. క్రీస్తుయేసు నాథుడు ఇట్లనెను: "జీవాహారము నేనే, ఎవడైనను ఈ ఆహారము భుజించితే వాడెల్లప్పుడును జీవించును." పాపము వలన నీ బ్రతుకులో ప్రవేశించిన విషమును ఈ ఆహారము మాత్రమే తీసివేయగలదు.

ఆ ప్రవక్తల శిష్యులు ఆకలితో నుండిరి. వారికి ఆ విషమునుండి మరణము తప్పెను గాని ఆకలి తీరుట ఎట్లు? మనకు ఆహారము దొరుకుట యెట్లు? అనుకొనుచుండిరి. అప్పటికి ఒకడు ఇరువది బార్లీ రొట్టెలను తెచ్చి దైవజనునికి ఇచ్చెను "జనులకు వడ్డించుడి" అని ప్రవక్త చెప్పెను (వ. 43). ఆకలిగొనున్న బలాఢ్యులైన అంతమందికి ఈ ఇరువది రొట్టెలు మాత్రమే పంచుట ఎట్లు? పంజాబులో ఒక్కొక్కడు పదునెనిమిది చపాతీలు తినడము నేను చూచియున్నాను. ఇక్కడ నూటికి మించిన సంఖ్యకు కేవలము ఇరువది బార్లీ రొట్టెలున్నవి. వడ్డించేవాడు - "ఈ ఇరువది రొట్టెలతో ఇంత జనమునకు ఆకలి తీరునా?" యని ప్రవక్తను అడిగెను. "వారు తినగా మిగులునని" యెహోవా సెలవిచ్చియున్నాడు, గనుక జనులు భోజనము చేయునట్లు వడ్డించుము అని ప్రవక్త ఆజ్ఞాపించెను. వారు భుజించిరి. గొంతువరకు తిని ఇక తినజాలక విడిచిరి, ఇంకను ఎంతో మిగిలిపోయెను.

నేడు ఎందరో లోకరీతిగా తమ ఆకలి తీర్చుకొన జూచుచున్నారు. విస్తారముగా ఖర్చుచేసి, దిట్టముగా తినుచున్నారు. వారు వేసికొనుచున్న బట్టలు ఎక్కువ ఖరీదు గలవి. దినమునకు పలుమార్లు బట్టలు మార్చుకొను చున్నారు. నెల నెల క్రొత్త వస్త్రములు కొనుచున్నారు. దీనితో తృప్తి చెందిరా? కొందరికి ప్రాతఃకాల భోజనము చేయుటకు అనేక పదార్థములుండును 'తృప్తిగా తింటివా? అని అడిగితే లేదు, అందురు. ఎంతో ఖర్చుచేసి, ఎంతో ఆహారము తినికూడ ఇట్లు చెప్పుదురు. వారు తిని త్రాగినది మరణమునే, ఆ తరువాత నిరీక్షణ లేనిచావు చచ్చెదరు. అయితే జీవాహారమును ఎవరైతే

భుజించిరో, వారే విషమును తప్పించుకొనిరి. కొంచెమైనను సరే దేవుడు ఎంత ఇచ్చెనో అంతే భుజించి తృప్తి చెందుచున్నారు. వారి హృదయములు స్తోత్రము, కృతజ్ఞతార్పణ, స్తుతులతో నిండియున్నది. విషము త్రాగుట వలన నష్టపడిన సమస్తమును తిరిగి రాబట్టుకొనియున్నారు.

కడుపులో, నరములలో, మెదడులో చెరుపుచేయు విషము ఒకటి గలదు. చాలా నిదానముగా దాని పనిని అది జరిగించును. పాపము చేయు పనికూడ ఇట్లే యున్నది పాపమందు జీవించుట చేత అనుదినము విషము తినుచు, త్రాగుచు నీ జీవితమును పాడుచేసి కొనుచున్నావు. నీవు కలిగియున్న దానినంతయు వ్యర్థపరచి, పాడుచేసి నీ జీవితమును కూడ ఇట్లే చేసికొని అపజయము, సిగ్గు నింద నీతో కొనిపోదువు గాని, ఈ లోకమును నీవు విడచునప్పుడు మరేదియు నీతో రాదు. కావున నేడు మేము నిన్ను వేడునది ఏమనగా - విశ్వాసము ద్వారా జీవాహారమును భుజించుము. పాప విషము వలన కలిగిన నీ పాపపు స్వభావమును, దాని బలమునంతయు అది తీసివేయును. నీవు పోగొట్టుకొనిన సమస్తము తిరిగి పొందనారంభింతువు. అది నీకు నిత్య జ్ఞానము, నిత్య ఐశ్వర్యము, నిత్య బలము నిత్యతృప్తి కలిగించగా గడచిన కాలమందు నీవు పోగొట్టుకొనిన ప్రతిదానిని సంపూర్ణముగా తిరిగి పొందుదువు. "దావీదు సమస్తమును తిరిగి తెచ్చుకొనెను!" అదే రీతిగా బుద్ధిహీనత, పాపము, మాలిన్యము వలన కలిగిన కీడును, నష్టమునంతటిని తిరిగి పొందవచ్చును. నీవు చేయవలసిన కార్యము ఇదే. క్రీస్తు యేసు ప్రభువు చేతినుండి జీవాహారమును అందుకొని భుజించుము. ఎలీషా కంటెను, ఇతర సమస్త ప్రవక్తలకంటెను, మానవులందరి కంటెను ప్రభువైన యేసుక్రీస్తు ఎక్కువైనవాడు. ఆయనే ఈ జీవాహారమును నేడు నీకు అందించుచున్నాడు.

## 7వ అధ్యాయము

# తిరిగి పొందుటలోని ఒక రహస్యము విధేయత

దావీదు పోగొట్టుకొనిన సమస్తమును తిరిగి తెచ్చుకొనెను అను పదములు తిరిగి తిరిగి చెప్పుకొనుచున్నాము. ఏలననగా యీ చిన్న పదములలో మనకందరికి, దేవుడు ఒక వర్తమానము ఇ[illegible] యున్నాడని హృదయ పూర్వకముగా నమ్ముచున్నాము. ఇంతకు ముందు మనకు అర్థము కానివి ఎన్నో గలవు. అయితే, ఎన్నో దినములు, లేక మాసములు, లేక సంవత్సరములు గడిచిన పిదప అవి తేటగా అర్థమగును. ఇప్పటివరకు చెప్పుకొనిన విషయములు, సంపూర్ణముగా మనము గ్రహింపకున్నను, గ్రహించు దినమొకటి వచ్చుచున్నది.

పై పదములలో గల వర్తమానము రక్షింపబడిన వారికే గాక ఇంకను రక్షింపబడని వారికి కూడ చెందుచున్నది. ప్రభువైన యేసుక్రీస్తును కలిగియుండని కాలమంతయు, మనము ఏది కలిగియుండినను, ఏ కార్యము చేసినను, సమస్తము వ్యర్థమే, వృధాపరచబడినదే. ఈ విషయము తమ మరణకాలమందు మహా పురుషులు కూడ తెలిసికొని యున్నారు. చాలా కాలము క్రిందట, హర్బర్ట్ స్పెన్సర్ అనబడిన గొప్ప తత్వజ్ఞాన శాస్త్రజ్ఞుడు (Philosopher) దేవుని నేమి, బైబిలునేమి హేళన చేసెడివాడు, తానెంతో తెలివిగలవాడని భావించియుండెను.

అతడు మరణావస్థలో నుండగా ఒకనాడు బంధువులు చూడవచ్చి, 'స్పెన్సర్, నీ కడపటి కోరిక ఏమిటి? నీ సమాధి రాతిమీద ఏ మాటలు చెక్కబడుట నీ కిష్టము?'' అని అడిగిరి. ''ఏ మాత్రము సంతోషము లేనివాడు'' అని చెక్కుమనెను. నేటికిని, అతని సమాధిమీద ఆ మాటలు చూడగలవు. పాప క్షమాపణ పొందక మరణించెనందున అతని తెలివి, లోకాభివృద్ధి మేలు చేయలేదు. ప్రభువైన యేసుక్రీస్తు లేకయే నీవు జీవించుచు, మరణించనై యున్న యెడల నీవు బ్రతుకు కాలమందు చేయుచున్న సమస్తము వ్యర్థమే. నీతో ఏదియురాదు, దేవుడు లేనివాడవై సంతోష సమాధానములు లేకయే మరణింతువు.

తన జీవమును మనకు ఇచ్చు నిమిత్తమే, క్రీస్తు యేసు ప్రభువు మృతులలో నుండి లేచెను. ఇందు నిమిత్తమే, మరణమును జయించి తిరిగి లేచెను. ఆయనను మన హృదయములందు అంగీకరించునప్పుడు ఆయన మనకిచ్చు క్రొత్తజీవమే, క్రొత్త జన్మము అనబడుచున్నది. యేసుక్రీస్తు ప్రభువును అంగీకరించగా, నీవు విశ్వాసము ద్వారా ఎంత పొందుచున్నావో గ్రహించుటకు నిత్యత్వమంతయు పట్టును. ఆయన మన పాపములను క్షమించుటయే గాక, తాను కలిగియుండిన సమస్తము మనము పొందవలెననియు, ఆయన ఎక్కడున్నాడో అక్కడ మనమును ఉండవలెననియు కోరుచున్నాడు. ప్రపంచమును సృష్టింపక పూర్వమే ఎంతో కాలము ముందు నుండి ఆయన మనకొరకు సిద్ధము చేయుచు వచ్చిన పరలోక స్వాస్థ్య మంతయు మనము పొందవలెనని కోరుచున్నాడు.

కొన్ని దేశములలో, యువతులు వివాహముగాక ముందు ''నిరీక్షణ పెట్టె'' అనబడు ఒక పెద్దపెట్టెను వారి ఇండ్లలో నుంచుదురు. ఎప్పటికో ఎన్ని ఏండ్లకో వివాహము జరుగనైయున్నను పుట్టబోయే శిశువుల కొరకు అవసరమగు తువాలు గుడ్డలు, ఫ్రాకులు ఇతరమైన వస్తువులు, మరియు తన కొరకు తన

గృహమునకు కూడ ఎన్నెన్నో వస్తువులు ఆ పెట్టెలో రహస్యముగ వేయుచు ఆ బాలిక సేకరించుచుండును. ఆ పెట్టెలో ఏమున్నదో తన కుటుంబము వారికైనను తెలియదు. వివాహము జరుగునను నిరీక్షణతో మాత్రము ఎన్ని సంవత్సరములైనను ఇట్లు వస్తువులు చేర్చుచుండును. భూమిని, నరులను సృజించుటకు ఎంతో కాలమునకు పూర్వమే, మనలను ప్రభువు ఎరిగియుండి మనకొరకు ఒక పరమ స్వాస్థ్యమును సిద్ధపరుచుచుండెననుటకు ఇది ఒక ఋజువు. మన బలహీనతలు, లోటుపాట్లను ఎరిగియుండియే, మనకొరకు ఏర్పాటుచేసి ఆ స్వాస్థ్యమును మనము పొంది సంతోషించు నిమిత్తము ప్రస్తుతము మనలను ఈ భూమి మీద సిద్ధము చేయుచున్నాడు. 1 కొరింథీ 2:9,10లో మనము చూచునట్లు "దేవుడు తన్ను ప్రేమించు వారి కొరకు ఏవి సిద్ధ పరచెనో అవి కంటికి కనబడలేదు. చెవికి వినబడలేదు, మనుష్య హృదయమునకు గోచరము కాలేదు." గొప్పవియు, మంచివియునైన విషయములు ప్రభువు సిద్ధపరచియుండగా ఈ ఆత్మీయ స్వాస్థ్యము మనము రుచింపకూడదని శత్రువు ఎంతో ప్రయత్నము చేయుచున్నాడు. ఈ పరీక్షలు, పోటీలు శత్రువు వలన మనకు కలుగునని ప్రభువు ఎరిగియుండకపోలేదు. కావున వాటిని మనము జయించునట్లు సహాయము కూడ సిద్ధపరచియున్నాడు.

దొంగల మధ్య నివసించువారు దొంగతనము విషయము ఎంతో జాగ్రత్త వహించవలెను. దొంగలు రాకుండ చాలా ఎక్కువ బలమైన తాళములు, ఇనుప ఊచలు ఉపయోగించవలెను. దొంగలను, దొంగ జిత్తులను ఎరిగినందున వారు పట్టుబడుటకు ఏర్పాట్లు చేసికొందురు. మనుష్య మాత్రులైన దొంగలకంటె అపవాది బహు ఎక్కువ తెలివిగలవాడును, జిత్తులమారి. శరీర సంబంధమైన సాధనములతో, ఆయుధములతో ఏ మాత్రము వానిని జయింపలేము. ఆత్మీయమైన, పరమ ఆయుధములే ఉపయోగించవలెను. బైబిలులో దావీదు చరిత్రను దేవుడు వ్రాయించి పెట్టినది, సాతాను తోటి యుద్ధము ఎట్టిదో,

యుద్ధోపకరణములు ఎట్టివో, మనకు చూపవలెననియే. దావీదు పొందిన నష్టములు రెండు విధములు : తన స్వంతమునకు కలిగిన నష్టము, దేశానికి కలిగిన నష్టము. స్వంతమునకు కలిగిన నష్టము తనయొక్క తప్పిదము వల్లను, అజాగ్రత్త వల్లను, నిర్లక్ష్యత వల్లను తాను తెచ్చుకొనినదే. అయినను పోగొట్టుకొనిన సమస్తమును అతడు తిరిగి పొందవలెననునది దేవుని యుద్దేశము. మరియు తన తప్పిదము, తన బుద్ధిహీనత వలన దేశానికి గలిగిన నష్టమును కూడ తిరిగి పొందవలెనని దేవుని కోరిక.

తన ప్రజలైన ఇశ్రాయేలీయులకు దేవుడు ఇచ్చిన గొప్ప ఫలవంతమైన దేశమును గూర్చి వినియున్నాము. ఆదికాండము 12వ అధ్యాయములో ఈ చరిత్ర ప్రారంభమగుచున్నది. కల్దీయులకు చెందిన ఊరు అనుపుర నివాసియగు అబ్రాహాము అను పేరుగలవాడు ఒకడుండెను. కల్దీయుల దేశము గొప్ప నాగరికతతో నిండిన దేశమని పురాతన వస్తు శాస్త్రజ్ఞులు నిరూపించియున్నారు. అబ్రాహాము విస్తారమైన బంగారు, వెండి, పనివారు, ఆస్తి, భూములు కలిగిన ధనవంతుడు. ఆత్మీయముగా పట్టి పేదవాడు. ఆనాడు దేవుని ఎరుగక, ఆయనను పూజించుటగాని, వెంబడించుటగాని తెలియకుండెను. ఒక దినమున దేవుడు అతనికి అకస్మాత్తుగా ప్రత్యక్షమయ్యెను. యెహోవా - "నీవు నీ దేశము నుండియు, నీ బంధువుల యొద్దనుండియు, నేను నీకు చూపించు దేశమునకు వెళ్ళుము" అని చెప్పగా ఆయన స్వరమును బహుతేటగా వినెను. దేవుని మాట నమ్మి, అబ్రాహాము ఇంటికి వెళ్ళినప్పుడు భార్యను, నౌకరులను పిలిచి ఇట్లనెను: "రండి వస్తువులన్ని ప్రయాణానికి సిద్ధము చేయండి. మనము బయలుదేరి వెళ్ళుచున్నాము." "ఎక్కడికి వెళ్ళుచున్నావు?" అని భార్య అడిగియుండగా "ఎక్కడికో నాకు తెలియదు" అనెను, ఇరుగు పొరుగువారు, స్నేహితులు ఈ సిద్ధపాటు చూచి, "అబ్రాహామా ఎక్కడికి వెళ్ళుచున్నావు?" అని అడిగియుందురు. "నాకేమి తెలియదు" అనుచున్నాడు. బంధువులు ఇదే

ప్రకారము ప్రశ్నించి యుందురు. "సామానులన్ని మూట కట్టడము చూచితే, దూర ప్రయాణము మీదనే ఉన్నట్లు కనబడుతున్నది. ఎక్కడికి పోవుచున్నావు?" "నేనెరుగను". "నీవు కాకుంటె ఇంకెవరు ఎరుగుదురు?" "ఎవ్వరూ, ఎరుగరు." పొరుగువారు, స్నేహితులు, వ్యసనముతో గుస గుస లాడుకొనుట మనము ఊహించగలము. "తప్పక అబ్రాహామునకు పిచ్చెక్కినది. ఈ పిచ్చి కుదర్చ గలవారు ఎవరైనా మంచి డాక్టర్లు నీకు తెలుసా? ఇల్లు భూములు సమస్తము విడిచిపెట్టి వెళ్ళిపోవడమేమిటి? తిరిగి రావడమూ లేదట? ఎక్కడికి వెళ్ళుచున్నారో కూడా తెలియదట!" ప్రతివారు కూడ అబ్రాహాముకు పిచ్చెక్కినదనే భావించి, విచారపడి యుందురు. అతని భార్య సహితము, పరితాపము చెందియుండ వచ్చును. "భర్తగారు అంతా మంచివారే! ఇప్పుడు ఆయనకు ఏమి సంభవించినది?" తనకు పిచ్చి ఏమియులేదని అబ్రాహాము ఎరుగును. దేవుని స్వరము సాక్షాత్తుగా వినినందున ఆయన మాటకు లోబడెను. అబ్రాహామునకు దేవుడు ఆది కాం. 12:2,3లో ఒక గొప్ప వాగ్దానము నిచ్చెను : "నిన్ను గొప్ప జనముగా చేసి, నిన్ను ఆశీర్వదించి, నీ నామమును గొప్ప చేయుదును, నీవు ఆశీర్వాదముగా నుందువు, నిన్ను ఆశీర్వదించువారిని ఆశీర్వదించెదను, నిన్ను దూషించువారిని శపించెదను, భూమి యొక్క సమస్త వంశములు నీయందు ఆశీర్వదించబడును." ఇట్లు యేడు గొప్ప ఆశీర్వాదములు అబ్రాహామునకు దేవుడు వాగ్దానము చేసెను.

దేవునికి విధేయుడైన వానిని దేవుడు ఆశీర్వదించును. దేవుడు అబ్రాహామునకు ఇచ్చిన ఆశీర్వాదము కంటె ఎక్కువైనది ఎవరైనను పొందగలరా? దేవుడు అంత తేటగా చెప్పిన విషయములను అబ్రాహాము సంతతివారు గ్రహించుటకు అనేక శతాబ్దములు పట్టెను. ఈ ప్రజలు ఐగుప్తునుండి కానాను వెళ్ళుటకు బయలుదేరినప్పుడు, ద్వితీయోపదేశ కాండము 7:1లో ఉన్న ప్రకారము మోషే ద్వారా, దేవుడు వారికి తెలిపిన దేమనగా, ఎట్లు ఏడు ఆశీర్వాదములుండెనో,

అటులనే ఏడు శత్రు జనాంగములు ఆ దేశమందు నివసించుచుండిరని, అబ్రాహామునకును అతని సంతతికిని ఆ దేశమును ఇత్తునని నాలుగు వందల ఏబది ఏండ్లకు పూర్వమే దేవుడు వాగ్దానము చేసియుండెను. ఆ వాగ్దానమును మరువలేదు. దేవునికి ఎన్నడు మరుపురాదు. ఆయన చెప్పినదంతయు జ్ఞాపకముంచుకొని నెరవేర్చును. తాను చేసిన వాగ్దానములను నెరవేర్చుటలో తప్పిపోడు. అయితే తన ప్రజలు ఆ స్వాస్థ్యము పొందుటకు వారిని ఆయన అనేక శతాబ్దములు తర్ఫీదు చేయవలసి యుండెను.

ద్వితీయోపదేశ కాండములోని 7వ అధ్యాయమందు, కానానులో నివసించుచుండు ఏడు జనాంగములు కూడా ఆ దేశమునుండి పూర్తిగా తొలిగించి వేయబడుదురని దేవుడు వారితో చెప్పెను. ఆయన రెండు ఉద్దేశములతో ఇట్లు చెప్పెను. మొదటి కారణము కనానీయులు ప్రతి విధమైన పాపము, మలినము సకలాంధకారముతో నిండియుండిరి. లేవీయకాండము 18లో ఇవ్వబడిన పట్టీ, అవి ఎంతటి హేయమైన, భయంకరమైన, సిగ్గుకరమైన పాపములో చూపుచున్నది. నాలుగువందల ఏబది ఏండ్లు వారు, పశ్చాత్తాప పడుదురేమోయని దేవుడు ఓపికతో కనిపెట్టెను. వారికి పశ్చాత్తాపము లేదు. ఇక వారికి తీర్పు తీర్చి వారిని శిక్షించు కాలము వచ్చెను. వారికి తీర్పు తీర్చుటకు దేవుడు తన ప్రజలను ఉపయోగించెను. మోషే ద్వారా వారితో దేవుడు ఇట్లనెను – "ఓ జనులారా! నా జనులారా! నేను ఏర్పరచుకొనిన జనులారా! నా ప్రశస్తమైన జనులారా! నా స్వకీయ సంపాద్యమా, మీరు నా పాలి భాగస్థులు. ఇప్పుడు వెళ్ళి భయంకరమైన పాపములోనున్న ఆ ఏడు జనాంగములను వెళ్ళగొట్టుడి. వారికి తీర్పు తీర్చి శిక్షించు వేళ వచ్చినది." మరియు దేవుడిట్లు చెప్పెను - "వారితో నిబంధనగాని, ఒప్పందముగాని చేసికొనగూడదు. వారి కుమార్తెలను మీరు వివాహము చేసికొనకూడదు. మీ కుమార్తెలను వారికి పెండ్లి చేయకూడదు. వారి

విగ్రహములను, దేవతా స్థంభములను పడగొట్టవలెను." దేవుడు ఇంత తేటగా చెప్పినను వారు ఆయనకు సంపూర్తిగా విధేయులు కాలేదు. ఇదేవారి మొదటి పతనము.

ఎన్ని మారులు దేవునికి విధేయులుగా నుండవలెనని మనము ప్రయత్నించినను సంపూర్ణ విధేయత చూపుటలేదు. బహుశః మనము విధేయత చూపకుండుట కొన్ని విషయాలలోనే కావచ్చును. మానవ సానుభూతి, మానవ ప్రేమ, మానవ జ్ఞానము వలన మనము అవిధేయులము కావచ్చును. ఇక్కడ కూడ యింతే. ఒక పొరబాటు చేయగా ఆ ప్రజలు ఇంకను పొరబాట్లు చేయుచు వెళ్ళిరి. యెహోషువ 1:12 దీనిని చూపుచున్నది. ఇశ్రాయేలీయులు ఇట్లనిరి – "ఈ మనుష్యులు ఇప్పుడు మనకు దాసులై యున్నారు. కట్టెలు నరుకువారుగాను, నీళ్ళు చేదువారుగాను వారిని ఉపయోగింతము." ఈ చిన్న అవిధేయత సాతాను పని చేయుటకు దారి తీసెను. ఆటు తరువాత వివాహముల విషయములో కూడ పొరబాట్లు వచ్చెను. అటు పిమ్మట దేవుని ప్రజలు విగ్రహ పూజ సహితము ప్రారంభించిరి. కానానుకు వచ్చిరి గాని ఆ దేశమును అనుభవింప జాలకుండిరి.

విశ్వాసులనేకుల స్థితి కూడ ఇదే. వారు తిరిగి జన్మించినవారే. దేవుని వాక్యము తెలిసినవారే. అయినను అసంపూర్ణ విధేయతను బట్టి వారికి దేవుడు అనుగ్రహించిన దానిని అనుభవించలేక యున్నారు. ఎందరు విశ్వాసులు అవిశ్వాసులను వివాహమాడి యున్నారు! ఈ దౌర్భాగ్యమైన సంబంధము లనేకములకు తల్లిదండ్రులే కారకులు. వారు అంధకారమందున్నారు. వారి వైవాహిక జీవితము పాడాయెను. అందువలన తిరిగి జన్మించిన తమ బిడ్డలను అంధకారము లోనికి ఈడ్చి, వారి బ్రతుకు కూడ పాడు చేయుచున్నారు. కొన్ని సమయములందు యువతీ యువకులు తామే స్వయంగా

ఏర్పచుకొనుచున్నారు. వారి వాదము యేదనగా "ఇప్పటికి అతడు (లేక ఆమె) తిరిగి జన్మించలేదు నిజమే. అయితే తరువాత తిరిగి జన్మించును." వివాహము జరిగిన తరువాత మారు మనస్సు పొందనివారు మారు మనస్సు పొందినవారిని తమ దారికే త్రిప్పెదురు. అనేకమంది విశ్వాసులు జీవితకాలమంతయు కన్నీరు కార్చుచుండుటకు ఇది కారణము. తెలివితక్కువ, బలహీనత, గ్రుడ్డితనము వలన చెడిపోయిరి.

బెన్యామీను గోత్రమువారు, కొందరు యెబూసీయులను యెరూషలేములో నుండనిచ్చిరి. వారు దాసులుగానే యుండిరి. క్రమేణ ఈ కొందరు బలమైన జనాంగమైరి. 1 సమూ. 5లో మనము చదువునదేమనగా దావీదు యెరూషలేముకు వచ్చినప్పుడు, ఈ యెబూసీయులు అతనిని హేళన చేసిరి. బల పరాక్రమము గలవాడైన దావీదు రాజు తన శూరులతో వెళ్ళగా అప్పటి యెబూసీయులు శక్తి, బలము కలిగిన జనాంగముగా యుండిరి. దావీదు వచ్చెనని వినినప్పుడు ఎంతో తృణీకారముగా - "దావీదు యెవ్వడు? అతని మీద యుద్ధానికి ఒక గ్రుడ్డివాడు వెళ్ళితే చాలదా!" అనిరి. యెరూషలేము నందు వారు ఎంత బలముగా స్థాపించుకొని యుండిరనగా, దైవజనుడైన దావీదును వెక్కిరించి ఎగతాళి చేసిరి. యెబూసీయుల వలన సమస్త ఇశ్రాయేలీయుల జనాంగము గొప్ప నష్టము పొందియుండిరి. వారు దేవుని యొక్క ఏర్పరచబడిన ప్రత్యేక, ప్రశస్త ప్రజలై యుండియు, ఆయన యొక్క ధననిధియై యుండియు ఆత్మీయాంధకారములో నుండిరి. కారణమేమనగా దేవుని సంకల్పమేమిటో తెలిసికొనక, తనకు ఏది బాగున్నదని తోచెనో ఆ ప్రకారము ప్రతివాడు తన యిష్టానుసారముగా ప్రవర్తించెను. వారు దేవుని సరిగా గ్రహించక, ఆయన నెట్లు పూజింపవలెనో తెలియక యుండుట చేత వారిలో దేవుడు తన కార్యమును సంపూర్తిగా చేయజాలకపోయెను. దీనిని బట్టి తమ జనాంగమంతటి మీద ఇతర జనాంగములు పడి ఓడించుచుండిరి.

విశ్వాసులుగా నుండియు మనము ఎన్నో విధములుగా నష్టపడుట చూచగా ఎంత వ్యసనము? నేను నామకార్థ క్రైస్తవులతో కాదు, తిరిగి జన్మించినవారితోనే మాట్లాడుచున్నాను. వారింకను అంధకారములోనే యుండి, వారు పోగొట్టుకొనుచున్నది యేమని యెరుగక నున్నారు. మేము తిరిగి జన్మించితిమి, అని ఎవరెవరు అనుకొనుచున్నారో వారికే చెప్పుచున్నాను. నిస్సందేహముగా ఒక కాలమున వీరు గొప్ప సంతోషము, గొప్ప ఆసక్తి, గొప్ప సమాధానము. దేవుని వాక్యము కొరకు ఎక్కువ ఆకలి కలిగియుండిరి. ఇప్పుడెట్లున్నారు? అంధకారము, అపజయము, తప్పిదములు, ఓర్పులేనితనము, నిష్ఫలితము ఇట్టివాటిలో పడియున్నారు. ఏలయనగా ఒక్కడేకాదు, అనేకమంది యెబూసీయులు వారి హృదయములలోను, కుటుంబములలోను ప్రవేశించి యున్నారు.

యెబూసీయులు దావీదును వెక్కిరించిరి. వారిని మీ హృదయము లోనికి రానిచ్చితిరా, మిమ్మును కూడ వెక్కిరింతురు. మన పరమ దావీదైన క్రీస్తు ప్రభువును వెక్కిరింతురు. నీ పొరుగువారు, నీ స్నేహితులు, నీ బంధువులు సహితము నిన్ను వెక్కిరింతురు. "మాకంటె మీరు ఏమి మేలు? వీళ్ళంతా విశ్వాసులు అనిపించుకుంటూ వ్యభిచారములో జీవిస్తున్నారు" అందురు. నిస్సందేహముగా, అనేక స్థలములలో ప్రభువైన యేసుక్రీస్తును వెక్కిరించె యెబూసీయులున్నారు.

యెరూషలేము నుండి యెబూసీయులను దావీదు పారద్రోలివేయుట సులభమైన కార్యము కాదు. దేవుడు తన యేర్పాటు ప్రకారము అతనిని సిద్ధపరచవలసి యుండెను. సౌలు వలననేమి అబ్షాలోము వలననేమి, ఇంకను యితరుల వలననేమి దీర్ఘకాలము బహు బాధకరమైన పరిస్థితుల గుండా దేవుడు అతనిని పోనిచ్చెను అతనిని హెబ్రోనుకు తెచ్చిన పిమ్మట ఏడు

సంవత్సరముల ఆరు నెలలు గడిచిన తరువాత సీయోనుకు తీసుకొనిపోయెను. అప్పుడే యెబూసీయులను సీయోను నుండి పారద్రోలివేయ గలిగెను. అటు పిమ్మట పరలోక ఏర్పాటు ప్రత్యక్షమాయెను. దాని తరువాత దేవాలయము వచ్చెను. దాని తరువాత మహిమ వచ్చెను.

యెబూసీయులను వెడల గొట్టుటకు అవశ్యమైయుండు ఆయుధములు రెండు. ఒకదాని పేరు హెబ్రోను, రెండవదాని పేరు సీయోను. ఈ రెండు ఆయుధములతో దావీదు సమస్తమును తిరిగి పొందెను.

హెబ్రోను అనగా అర్థమేమి? సీయోను అనగా అర్థమేమి? ఈ అర్థము నీవు గ్రహించినప్పుడే నీవు పోగొట్టుకొనిన సమస్తమును తిరిగి తెచ్చుకొనగలవు. ఎందుకనగా ఈ రెంటి ద్వారానే అది సాధింపగలవు. దేవుని మహిమార్థము ఇట్లు చెప్పగలను - హెబ్రోను, సీయోను అను ఈ రెండు యుద్ధోపకరణముల ద్వారా, పోగొట్టుకొనిన ప్రతిదానిని తిరిగి పొందగలవు. అది వ్యక్తిగతముగా నష్టపోయినదైనను, కుటుంబముగా పోగొట్టుకొనినదైనను, సంఘముగా నష్టపడినదైనను సమస్తమును పొందగలవు. హెబ్రోను, సీయోనుల ద్వారా మనము నష్టపోయిన సమస్తమును తిరిగి తెచ్చుకొను విధము దేవుడు మనకు బోధించునుగాక. నేను చెప్పుచున్నది ఆత్మీయమైన హెబ్రోను, సీయోనులు. ఈ రెండు ఆయుధముల విషయము సంపూర్ణముగా దేవుడు నీకు నేర్పునట్లు ప్రార్థించవా?

మనము పోగొట్టుకొనినది ఏమిటి? ఆ నష్టము ఎంత పెద్దది? యని మొదట మనము తెలిసికొనవలయును. అటు పిమ్మట ఇది తిరిగి పొందుటయు, దానితో ఇంక కొంత కలుపుకొని తెచ్చు విధమును మన మెరుగవలెను. ఉదాహరణముగా యోబు అను ఒక వ్యక్తి యుండెను. మొదట ఇతడు లౌకికుడు. నిజముగా మంచివాడు, ధనికుడు అయినను ఆత్మీయ అంధుడు.

మానవ దృష్టిలో గొప్పవాడు, నింధారహితుడు. దేవుని దృష్టిలో ఆత్మీయముగా గ్రుడ్డివాడు, చెవిటివాడు, దరిద్రుడు, లోపములు కలవాడు. కొలిమి ద్వారా దేవుడు అతనిని తీసికొని వెళ్లినంత వరకు కూడ తానెట్టివాడో యోబుకు తెలిసియుండలేదు. ఒక్క దినములోనే తన బిడ్డలందరు మరణించిరి. ఒక్క దినములోనే అతని భవనములు కాలిపోయెను. ఒక్క దినములోనే అతని పశువులన్నియు నాశనము చేయబడెను. అతనికి వచ్చిన భయంకరమైన నష్టము ఇంతంత అనుటకు వీలులేదు. అతని స్నేహితులే అతనిని అన్యాయముగా నిందించిరి. అతని భార్యయే అతనికి విరోధముగా తిరిగెను. అగ్నిలో పడవేసినంత బాధ దేవుడు ఎందుకు అతని మీదికి రానిచ్చెను? కేవలము యోబు తన నిజస్థితి గ్రహించి, తన నిజమైన స్వాస్థ్యము పొందు నిమిత్తమే. యోబు 42:5,6,12 చదివినట్లయితే ఎందుచేత దేవుడు యోబు జీవితములో అటువంటి బాధను రానిచ్చెనో గ్రహించగలవు. ఈ కష్టముల ద్వారానే దేవుడు తనకు ఎంత నిజమై యున్నాడో గ్రహించుట చేత, ఆయనకు యెట్లు ప్రార్థన చేయవలెనో, ఆయనతో ఎట్లు సంభాషించవలెనో తెలిసికొనెను. కావున కడపటికి తాను పోగొట్టుకొనిన దానికంటె, మరింత అధికముగా పొందెను. మొదట మనము కూడ యోబువలె ఏమి పోగొట్టుకొనుచున్నామో ఎరుగకయే యున్నాము. మన నిజమైన ఆత్మీయ స్థితి తెలియనందున కొన్ని బాధకరమైన పరిస్థితులను దేవుడు ఉపయోగించి, తన దృష్టిలో మనము ఎట్లున్నామో, అది మనమే చూచుకొనునట్లు మన కండ్లు విప్పవలసి వచ్చును.

ఈ దృష్టాంతము కూడ తీసికొందుము. హిమాలయ పర్వతములలోని ఎవరెస్టు శిఖరము అరుణోదయ కిరణములలో బహు రమ్యముగా కనబడును. డార్జిలింగ్ దగ్గర టైగర్ హిల్ (Tiger Hill) అను స్థలము నుండి ఈ దృశ్యము చూడవచ్చును. గనుక లోకములోని నానా భాగముల నుండి ఈ శిఖరమును చూచుటకు జనులు వత్తురు. 1956లో ఇద్దరము, మాకు త్రోవ చూపువానితో

(Guide) ముఖ్యరము, అక్కడికి వెళ్ళితిమి. పై భాగము చేరుటకు చీకటితోనే బయలుదేరి బహుశ్రమతో ఎక్కితిమి. లోకములో ఎక్కడెక్కడి నుండియో వచ్చినవారు రెండువందల మందికి పైగ అక్కడ కూడియుండిరి. సూర్యోదయమాయెను, ఆకాశము శృంగారముగా వెలిగింపబడెను. అది చూచిన పిమ్మట ఒక్కొక్కరుగా అందరు వెళ్ళిపోయిరి. నలుగురము మాత్రమే నిలిచియుంటిమి. "ఇందులో ఎవరెస్టు శిఖరము ఏది?" అని నా స్నేహితుని అడిగితిని. "అదిగో అదే" యని వ్రేలితో చూపెను. అటుచూడగా సొగసైన తెల్లని స్థలమొకటి కనబడెను. నేను దానిని చూచుచుండగానే అది కదలి పోసాగెను. కాబట్టి నేను - "ఇది ఎట్లు ఎవరెస్టు శిఖరమైయుండును? కదులుచూ ఉన్నది. ఒక మేఘమై ఉంటుంది" అంటిని. అప్పుడు మరొకరిని "ఎవరెస్టు శిఖరమేది?" అని అడిగితిని. "వెనుకకు తిరిగి కొంతసేపు కనిపెట్టుచూ చూడు, ఆ మబ్బు పోయిన తరువాత ఆ శిఖరము కనపడును" అనెను. నేను అట్లే చేసితిని. మబ్బు పూర్తిగా పోయిన పిమ్మట, ఆ శిఖరమును చూచితిని. చాలా వినోదకరమైన దృశ్యముగా నుండెను. అయితే రెండు వందలకంటె ఎక్కువ జనము మేఘమునే చూచి, అదే ఆ శిఖరమనుకొని "మేము ఎవరెస్టు శిఖరము చూచితిమి, ఎవరెస్టు శిఖరము చూచితిమి" అనుచు వెళ్ళిపోయిరి.

మన ఆత్మీయస్థితి ఇటువంటిదే. మేము దేవుని చూచితిమి అని అనుకొందుము గాని, మనమింకను చూడనేలేదు. చూచుటకు మనకు కండ్లు ఇచ్చు నిమిత్తము అనేక బాధకరమైన పరిస్థితులగుండా దేవుడు మనలను తీసికొని పోవలెను.

దావీదు సమస్తమును తిరిగి పొందెను. దేవుని మహిమ దిగివచ్చెను. దేవుడు కూడ మనయొద్దకు దిగివచ్చును. మనము ఆయన యొక్క ప్రజలమగుదుము. మనము పొందిన నష్టమంతయు హెబ్రోను, సీయోనుల ద్వారా తిరిగి పొందుదుము.

## 8వ అధ్యాయము

# నష్టమునకు కొన్ని కారణములు

కొన్ని వస్తువులు మనకు తిరిగి దొరికినప్పుడు, మనకు ఎక్కువ సంతోషము కలుగును. ఈ మధ్య ఇద్దరము పాకిస్తాను వెళ్లి రెండు దినములు లాహోరులో కూటములు జరిపితిమి. రావల్పిండి నుండి లాహోరుకు రాత్రివేళ ప్రయాణము చేసి ఉదయము 9-30 గంటలకు దిగితిమి. కూటము 9 గంటలకే ఏర్పాటు చేసియుండిరి. మేము ఆవరణములో ప్రవేశించునప్పటికి ఒక సమూహము మమ్మును చుట్టుకొనిరి. ప్రేమగల వీరి ఆహ్వానము మాకెంతో ఆనందముగా నుండెను. ఒక్కొక్కరికి మమ్ము పరిచయము చేసిరి. మేము టాక్సీలో వచ్చియుంటిమి. పరిచయములు తీరిన వెనుక, స్నానము చేసి బట్టలు మార్చుకొని మీటింగుకు వెళ్ళు నిమిత్తము మా మా గదులకు తీసుకొనిపోయిరి. మాగది చేరినప్పుడు ఒక సంచి కనబడలేదు. ముఖ క్షౌరము చేసికొను వస్తువులు, మరికొన్ని సామానులు అందులో నుండెను. ఇతర సామానుల గురించి నాకంత బెంగ కలుగలేదు గాని మేము ఆ మరునాడే లాహోరు విడిచి వెళ్ళవలసి యుండగా పాస్‌పోర్టులు (Passports) వీసాలు ఆ సంచిలో వుంచియుంటిమి. ఉన్నవారందరు కాంపౌండునంతయు వెదికిరి గాని ఆ సంచి మట్టుకు దొరకలేదు. నేను చాలా చింతతో "పాకిస్తాన్‌లో ఎంతకాలము వుండిపోవలసి యున్నది? పాస్‌పోర్టు లేనిదే మమ్ము పోనివ్వరు,

క్రొత్త పాస్‌పోర్టుకు అర్జీ పెట్టితే, అది అందువరకు మరొక మూడు వారాలైనా వుండిపోవాలి" అనుకొనుచుంటిని. "పొరబాటున ఏమైనా టాక్సీ డ్రైవరు ఆ సంచిని తీసికొని వెళ్ళిపోయినాడేమో" యని ఒక ఆలోచన నాకు తట్టెను. సామానులు టాక్సీ వెనుక భాగములో కూడ పంపియుంటిమి. వెనుక కూర్చున్నవారు ఆ సమయములోని ఉల్లాసములో ఈ సంచిని తీయుట మరచిరేమో. ఏమైనను ఇప్పుడు చేయునది ఏమి? టాక్సీ నంబరునైనను వ్రాసికొనుట మరచియుంటిమి. టాక్సీవారు అంతగా నీతిమంతులు కారుకదా! పోలీసు స్టేషనుకు టెలిఫోను చేయుదుమా అని కూడ తలంచితిమి. "ఏమిచేస్తే ఏమున్నది. పోయిన సంచి యింక దొరుకునా?" అని నాకు తోచెను. కావున "ప్రభువా! మరికొంత కాలము పాకిస్తానులో వుండిపోవడానికి అభ్యంతరము లేదుగాని ఇండియాలో నీపనికి కష్టము వచ్చును. క్యాలింపాంగులో కూటముల కొరకు వెళ్ళవలెను. హైదరాబాదులో పరిశుద్ధ కూటములు ప్రకటించితిమి. ఆ సంచి నీవే స్వయంగా తెచ్చిపెట్టవా ప్రభువా? అదేమైన ఆ టాక్సీ డ్రైవర్ దగ్గర ఉన్నయెడల దానిని మాకు తిరిగి తెచ్చిపెట్టునట్లు అతనితో మాట్లాడుము. వేరే వస్తువులు పోతే ఇబ్బంది లేదు. పాస్‌పోర్టులే కదా మాకు అవసరము" అని యిట్లు ప్రార్థించితిమి. మా ప్రార్థన ముగిసిన కొంతసేపటిలోనే ఒకరు "బ్రదర్, బ్రదర్ సంచి దొరికింది" అంటూ గదిలో ప్రవేశించెను. "ఎట్లు దొరికింది?" అని అడుగగా, ఏమి తెలిసెననగా, టాక్సీవాడే తిరిగి వచ్చెను. చాలా దూరమే వెళ్ళిపోయెనట గాని, ఎలనో అతనికి భయము కలుగుట వలన తిరిగివచ్చి ఆ సంచి యిచ్చివేసెను. ప్రతివారి ముఖము ఎంత సంతోషముగా కనబడెనో! మా సంచి మాకు తిరిగి దొరికెను. ఆ సంచిమీద దేవుని యొక్క కార్యము ఎంతగానో ఆధారపడియుండెను. ఆ సంచి తిరిగి దొరుకుట వల్ల హైద్రాబాదు పరిశుద్ధ కూటములకు సరైన వేళలో చేరుకొంటిమి. లేని యెడల పాకిస్తాను నుండి మేము తిరిగి రావలెనని యింకను వారు ప్రార్థించు చుండియుందురు. అంత విలువైనది ఏదైనా ఒకటి తిరిగి దొరికినప్పుడు ఎంతో

సంతోషము పొందుదుము గదా!

నష్టములు రెండు విధములు : స్వంత నష్టము, ఇతరులతో కలిసి ఒకటిగా పొందు నష్టము. మొదటిది స్వంతానికి మాత్రమే చెందిన నష్టము. రెండవది సమస్త సంఘముతో కలిసి పొందు నష్టము. విశ్వాసులమైన మనము ప్రభువైన యేసుక్రీస్తు యొక్క శరీరములోని అంగములని దేవుని వాక్యము చెప్పుచున్నది. శరీరములోని ప్రతి అంగము కూడ అత్యంత అవసరమైనదియు, ప్రశస్తమైనదియునై యున్నది. కొన్ని అంగములు చాలా చిన్నవి, మరికొన్ని పెద్దవి. కొన్ని చిన్నవైనను శరీరములో అవి చేయు పని ఎంతో ప్రాముఖ్యమైనది. ఒక్క అంగానికి బాధ కలిగితే శరీరానికంతయు బాధయే. నీ వ్రేలికి దెబ్బ తగిలిన యెడల లేక ఒకచిన్న గడ్డ లేక పుండు దానిమీద నుండిన యెడల దాని వలన నీకు నిద్ర పట్టదు. అనగా శరీరమంతయు బాధపడును. అట్లే మనము విశ్వాసులమై యుండియు వ్యర్థమైన, నిష్ఫలమైన బ్రతుకు బ్రతికినప్పుడు సమస్త శరీరము అనగా యేసుక్రీస్తు ప్రభువు యొక్క సంఘము బాధపడును. మన నష్టము సమస్త సంఘమునకు నష్టమే. అదే రీతిగా మనము తిరిగి పొందునప్పుడు సమస్తమైనవారికి ఆనందము, ఆశీర్వాదము కలిగించును.

ఒకానొకప్పుడు మన ప్రభువు ఐదువేల మందితో గూడిన గొప్ప జన సమూహమును ఐదు యవల రొట్టెలతో పోషించెను. సహజముగానే పొడి ముక్కలు ఎన్నో క్రిందపడి పోయియుండెను. కడుపార ఆ జనులు భుజించిన పిమ్మట శిష్యులతో ప్రభువిట్లనెను : "ఏమియు నష్టపడకుండ మిగిలిన ముక్కలు పోగుచేయుడి" (యోహాను 6:12). ఈ చిన్న ముక్కలను ఏల పోగుచేసిరి! పక్షులకు గాని, పశువులకు గాని వేయుటకు కాదు. దీనిలో ఒక సంకల్పముండెను. "అవును అనినప్పుడు అది అవునుగానే యుండవలెను, కాదు అనినప్పుడు అది కాదుగానే యుండవలెను" అని ప్రభువు చెప్పెను. ఏ యింటియినను దర్శించుటకు నీవు వెళ్ళినప్పుడు "ఒక కప్పు టీ పుచ్చు

కొంటారా?" అనివారు అడుగుదురు. "అలాగేనండి" అని నీవు అన్నట్లయితే వారి ముఖములు మారిపోవుట చూచెదవు. ఉన్న సంగతి ఏమనగా, ఇంటిలో పాలుగాని, చక్కెరగాని లేదు. మర్యాదకే టీ పుచ్చుకోండి అనిరి, వద్దండి అంటావేమోయని నిరీక్షించిరి. నీవైతే అలాగేనండియని అంటివి. ఇదే విధముగా నీవు సహితము పనికిమాలిన మాటలు చెప్పెదవు, ప్రతిచిన్న రొట్టెతునక విషయము నీవు లెక్క అప్పగించవలసియున్నావు అనునది మరచియున్నావు. వృధా పరుచుట ప్రభువు సహించడు, "మనుష్యులు పలుకు వ్యర్థమైన ప్రతి మాటను గూర్చియు విమర్శ దినమున లెక్క చెప్పవలసియుండును" (మత్తయి 12:36). ఈ వాక్యము మనకు అన్వయింపచేయగా, ప్రతియొక్కరము అనేక మారులు ప్రభువును దుఃఖపరచి యున్నామని ఒప్పుకొనక తప్పదు.

మరియు ప్రభువైన యేసుక్రీస్తునందు మనకొక గొప్ప సొస్థ్యము కలదని మనమెరుగుదుము; ఇది నిర్మలమైనదనియు, వాడబారనట్టియు, పరలోక స్వాస్థ్యము. ఒకడైనను దానిని సంపూర్ణముగా గ్రహించలేడు. అది ఎంత గొప్పదనగా, దాని విషయము దేవుని వాక్యము ఇట్లనుచున్నది : "దేవుడు తన్ను ప్రేమించు వారి కొరకు ఏవి సిద్ధపరచెనో, అవి కంటికి కనబడలేదు, చెవికి వినబడలేదు, మనుష్య హృదయమునకు గోచరము కాలేదు" (1కొరింథీ 2:9). ఈ మాటలు ఎంత సత్యము! మరియు "సమస్తమును మీవి. పౌలైనను, అపొల్లోయైనను, కేఫాయైనను, లోకమైనను . . . ." అని 1కొరింథీ. 3:21,22లో చదువుచున్నాము. అయినను మన పరమ స్వాస్థ్యము అనుభవించుట తెలియక, అపజయములోనే తప్పిదములు చేయుచునే మన బ్రతుకులు ఇంకను కొనసాగించుచున్నాము. సమస్తమును నరులకు ఇచ్చు నిమిత్తమే దేవుడు ఏర్పాటు చేసియున్నాడని మనము బైబిలులో చూచుచున్నాము. దేవుడు ఆదామును సమస్త లోకమునకు అధిపతిగా చేసెనని ఆదికాండము ప్రారంభ అధ్యాయములలో మనము చదువుచున్నాము. అతడు ఏ పాపము చేయకుండ ఉండియున్న యెడల సకల లోకమునకు రాజై యుండెడివాడు. పాపము

ప్రవేశింపగా దేవుని సంకల్పమునకు  టంకము వచ్చెనుగాని ఆయన ప్రేమ ఎన్నటికిని మారదు. యిర్మీయా 31  ంలో దేవుడు యిట్లు చెప్పుచున్నాడు : "నేను శాశ్వతమైన ప్రేమతో నిః  ప్రేమించుచున్నాను." మనము మారిపోవుదుము గాని, ఆయన ప్రేమ  ఎన్నటికి మారదు.

ఆదికాండము 12లో, మహిమగల దేవుడు అబ్రాహామునకు ఎట్లు ప్రత్యక్షమాయెనో చూచితిమి. అతడు దేవునికి లోబడియుండిన యెడల నిత్యత్వమునకు ఏడు గొప్ప ఆశీర్వాదములు ఇత్తునని ఆయన చెప్పెను. బంధువులు, స్వదేశము, సమస్తము విడిచి ఒక క్రొత్త స్థలమునకు అతనిని పొమ్మనియు, అక్కడనే అబ్రాహాముకును, అతని సంతతి వారికిని స్వాస్థ్యము ఏర్పరచి యున్నానని దేవుడు చెప్పెను.

ఎంత ఉపాయముగా, దౌర్జన్యములతో దేవుని ప్రజల  నుండి వారి స్వాస్థ్యము అపహరించ నారంభించెనో చూచితిమి. కొన్ని సమయములలో మనము దోపిడి చేయబడుచున్నామని ఎరుగకున్నాము. ఒకనాడు ఒక మిషనరీ రైలుబండిలో 3వ తరగతి పెట్టెలో ప్రయాణము చేయుచుండెను. ఒక బెంచిమీద అతడు నిద్రించుచుండెను ఎదురుగా తన సూటుకేసును ఉంచియుండెను. దానికి గట్టి తాళము వేయబడి గొలుసుతో ఆ పెట్టె బెంచికి కట్టబడియుండెను. సూటుకేసును చూచుకొనుచునే యుండి, కొంత సేపటికి నిద్రబోయెను. మేలుకొనగా ఆ సూటుకేసు ఉన్నదా యని వెంటనే చూచెను. వేయబడిన తాళముతో అది అక్కడనే యుండెను. అయినను దానిని తనవైపు లాగినప్పుడు బరువేలేదు. లోపల ఖాళీగా నుండెను. "తాళము తీయకనే దొంగ లోపలి సామానులు ఏలాగు తీసికొన్నాడు?" అని అతనికి ఆశ్చర్యమైనది. ఆ సూటుకేసు వెనుక భాగమును త్రిప్పి చూడగా, కత్తితో కొంత దూరము కోయబడి యుండెను. అందులో నుండి వస్తువులు తీసివేయబడియుండెను. రాత్రి అంతయు సూటుకేసును గమనించుచునే యుండినను, తెల్లవారె వరకు తన నష్టమును

అతడు తెలిసికొనలేదు. ఇదే ప్రకారము విశ్వాసులనేకులు తమ సంతోష సమాధానములను, తమ విశ్వాసమును పోగొట్టుకొనుచున్నారు. అయితే ఒక దినము వచ్చును. దేవుని మాట వినినప్పుడు, దేవుని వెలుగు లోనికి వచ్చినప్పుడు తన నిర్లక్ష్యత, తప్పులు మొదలగు బుద్ధిహీనత వలన ఎంత గొప్ప నష్టము పొందియున్నారో తెలిసికొందురు.

ఇట్లే, ఒక్కదాని యందు తప్పుటవలన సమస్త జనాంగము తీర్పు క్రిందికి వచ్చుటయు, దేవుడు వారిని విడిచి పెట్టుటయు సంభవించెను. దేవుని సమీపించుట ఎట్లని వారికి తెలియలేదు. కావున అంధకారము, అవమానకరమైన జీవితము జీవించిరి, అయినను దేవుడు మారలేదు. తన జనాంగము పోగొట్టుకొనిన సమస్తము తిరిగి పొందవలెనని ఆయన ఏర్పాటు చేసెను. ఈ విధముగా మనము ఆత్మీయముగా పోగొట్టుకొనిన దానిని గూర్చియు, దానిని ఎట్లు తిరిగి పొందగలమో బైబిలు చెప్పుచున్నది. హెబ్రోను, సీయోనుల ద్వారా ఆత్మీయముగా పోగొట్టుకొనిన సమస్తము తిరిగి సంపూర్ణముగా తెచ్చుకొనవచ్చునని తన ప్రజలకు దేవుడు చూపుచుండెను. దైవసత్యము మనము తెలిసికొనుటకు అనేక సంవత్సరములు పట్టవచ్చును. దేవుడు దీర్ఘ శాంతము గలిగిన వాడైనందున, మనము పోగొట్టుకొనిన సమస్తమును తిరిగి తెచ్చుకొను పర్యంతము మన చేయి విడువడు. ఇట్లు తిరిగి తెచ్చుకొను నిమిత్తమే దేవుడు అబ్రాహామును హెబ్రోనుకు తెచ్చెను.

దేవుడు, అబ్రాహామునకు ప్రత్యక్షమై ఎంతో తేటగా ఇట్లు చెప్పెను: "నీవు లేచి నీ దేశము నుండియు నీ బంధువుల యొద్దనుండియు, నీ తండ్రి యింటి నుండియు బయలుదేరి నేను నీకు చూపించు దేశమునకు వెళ్ళుము." అతడు దేవుడు చెప్పినట్లు చేసెను. అయినను ఒక చిన్న తప్పు చేయుటవలన తన జీవితానికి గొప్ప నష్టము తెచ్చుకొనెను. సరికాని పాలి భాగస్థుని వలన ఇట్లు జరిగెను.

అబ్రాహాము ప్రయాణమునకు సిద్ధపడుచుండగా, అతని సహోదరుని కుమారుడు లోతువచ్చి - "పెద్దనాం  నా, ఎక్కడికి వెళ్ళుచున్నావు?" అనెను. "దేవుడు నాకు కనబడి, బంధువులు  ందరిని విడిచి, ఆస్తి అంతా విడిచి, ఒక క్రొత్త దేశానికి పొమ్మన్నాడు" అనెను. లోతు ఏడ్వసాగెను. "పెద్దనాయనా, ఇన్నాళ్ళూ నీతోనే ఉన్నాను. తండ్రికంటె నాకు నీవే ఎక్కువగా ఉంటివి. పెద్దనాయనా, నన్ను విడిచి పోవద్దు, నీవు ఏమి చేయమన్నను, చేస్తాను. నేనే నీకు కొడుకుగా ఉండి, నీవు ఏమి చేయమంటే అది చేస్తాను" అనెను. అబ్రాహాము, "నాయనా లోతు, నిన్ను తీసికొని వెళ్ళడానికి వీలులేదు. దేవుడు నా వాళ్ళనంతా విడిచిపెట్టి పొమ్మన్నాడు" అనెను. అప్పుడు లోతు "అయ్యో నన్ను విడిచిపెట్టవద్దు, నీకు కొడుకుగానే ఉన్నాను. నన్ను తీసికొని వెళ్ళకపోతే నేను తప్పక చచ్చిపోతాను. నా ప్రాణము తీసుకొంటాను," అని అనగా అతని కన్నీళ్ళకు అబ్రాహాము మనస్సు కరిగిపోయి, మోసములో పడెను. "ఇతనిని తీసికొని పోతాను, చిన్నవాడు, మంచి పిల్లవాడు. నాకు చాలా పనికిరాగలడు, తీసికొని పోతాను" అని అబ్రాహాము తలంచెను.

అనేక సంవత్సరములు గడిచిన పిమ్మట ఒక దినమున, ఒకడు అబ్రాహాము యొద్దకు పరుగెత్తి వచ్చి - "త్వరగా రండి, త్వరగా రండి మీ పనివారు, లోతు పనివారు జగడాలు వేసికొని కొట్లాడు కొంటున్నారు. మీరు రావాలి" అనెను. అబ్రాహాము వెళ్ళగా, ఆ కొట్లాటలు చూచి, దేవుడు చెప్పినదంతయు ఎంత సరియైయుండెనో గ్రహించి, "ప్రభువా నేను పొరబాటు చేసితిని" అని ఒప్పుకొనెను. పిమ్మట లోతును పిలిచి, "నీకు నాకు మధ్య కలహము వద్దు, నీవు నన్ను ప్రేమించుచున్నావు, నేను నిన్ను ప్రేమించుచున్నాను. అయితే, ఈ దుష్టులైన పనివారు కలహము తెస్తున్నారు. మనకింత మనస్తాపాలు వద్దు. నన్ను నీవు విడిచిపోవడానికి మనస్సు స్థిరపరచుకొనుము, నీవు కుడివైపు వెళ్ళితే, నేను ఎడమవైపు వెళ్తాను. నీవు ఎడమవైపు వెళ్ళితే నేను కుడివైపు పోతాను" అని చెప్పెను.

లోతు అన్నివైపుల కండ్లు త్రిప్పి చూచెను. సొదొమ దగ్గర బహు ఫలవంతమైన ప్రదేశము కనబడెను. "అక్కడికి వెళ్ళిన యెడల ఇక్కడ అబ్రాహాముతో ఉన్నప్పటికంటె మరింత ఎక్కువగా సంపాదించుకోగలను. మంచి ఫలవంతమైన భూమి నాకున్నది. ఇంక ఎక్కువ తెచ్చుకోగలను" అని లోతు తలంచెను. అతడు కోరుకొని పోయినది వాస్తవముగా మంచి భూమియే. అయితే అది సొదొమ గొమొర్రాలకు బహు సమీపముగా నుండెను. ఆ దినములలో సొదొమ గొమొర్రాలలోని ప్రజలు పాపములో మునిగి బహు సిగ్గుకరమైన జీవితములు గడుపుచుండిరి. లోతు – "నేను ఆ పట్టణములో ప్రవేశించను, దగ్గర మాత్రమే ఉంటాను, రెండు మైళ్ళ దూరమున్నది కదా" అని తలంచెను. ఈ విధముగా వాదించుకొనెను. దేవుని సంబంధమైన విషయములలో అతనికి అభిరుచి యుండలేదనియే ఈ వాదము చూపుచున్నది. ప్రారంభములో, అబ్రాహాముతో లోతు - "నేను దేవుని వెంబడించాలి, నీతోనే ఉంటాను" అని చెప్పియుండెను. కాని తరుణము దొరికినప్పుడు స్వలాభము కొరకు దానిని విడువని కక్కుతి గలవాడు.

ఈ రీతిగనే అనేకమంది దేవుని నుండి దూరమైపోయిరి. ఇండియా మొదలైన దేశాలనుండి చాలామంది ఇంగ్లాండ్, అమెరికా, ఆస్ట్రేలియా, ఐరోపాలకు వెళ్ళుట ఎందుకొరకు? "ఇన్ని ఏండ్లు ఇండియాలో దేవుని సేవ చేస్తున్నాము" అని చెప్పుచూ పోవుదురు. అయితే వీరిలో చాలమంది దొంగలు, దుష్టులు. ఈ దేశాలకు వీరు వెళ్ళడము దేవుని పనిమీద కాదు డబ్బు దోచుకొనుటకే. మోటరు కార్లు కొనుక్కొనుటకు; మేడలు మిద్దెలు కట్టించుకొనుటకు డబ్బు తెచ్చుకొనే నిమిత్తమే వెళ్ళుచున్నారు. లోతువలెనే, మంచి ఫలవంతమైన ప్రదేశమునకు వెళ్ళిరి.

లోతును బట్టి దేవుడు అబ్రాహాముతో తేటగా మాట్లాడజాలక పోయెను. ప్రారంభము నుండి అబ్రాహాముకు నడుపుదలనిచ్చుచు, దేవుడు

తుదకు మానివేసెను లోతునుబట్టి అబ్రాహాము దేవుని సాన్నిధ్య అనుభవము పోగొట్టుకొనెను. తిరిగి పొందనెంచినచో, ప్రత్యేకించుకొనుట ద్వారానే అది సాధ్యమగును. లోతు వేరుపడిన తరువాతనే దేవుడు అబ్రాహామునకు తిరిగి ప్రత్యక్షమాయెను. బైబిలులో ఈ చిన్న ముక్కను గమనించుము : "లోతు అబ్రామును విడిచిపోయిన తరువాత" (ఆది కాండము 13 : 14). అటు తరువాతనే దేవుడు అబ్రాహామునకు ప్రత్యక్షమై ఇట్లనెను - "నీవు చూచుచున్న యీ దేశమంతటిని నీకును నీ సంతానమునకును సదాకాలము ఇచ్చెదను. మరియు నీ సంతానమును భూమిమీద నుండు రేణువులవలె విస్తరింప చేసెదను. ఎట్లనగా ఒకడు భూమిమీద నుండు రేణువులను లెక్కింప గలిగిన యెడల నీ సంతానమును కూడ లెక్కింపవచ్చును. నీవు లేచి యీ దేశము యొక్క పొడుగున, వెడల్పున దానిలో సంచరించుము, అది నీకిచ్చెదను." తనకును తన సంతానమునకును ఎంత గొప్ప స్వాస్థ్యము నిచ్చుచుండెనో, దేవుడు అబ్రాహామునకు చూపగలిగెను.

ఇదే ఆశీర్వాదము ప్రతి విశ్వాసికి యివ్వబడుచున్నది. నీ జీవితమందు ఎవరో ఒక లోతు వలన నీవు ఆత్మీయముగా గ్రుడ్డివాడవైతివి. ఒక లౌకిక స్నేహితుడు లేక భక్తిహీనుడైన భర్త లేక భక్తిహీనురాలైన భార్య, దైవభీతిలేని ఏదో ఒక సహవాసము యిట్టిది ఏదైనను అయియుండవచ్చును. మానవ కనికరము వలన నీ జీవితానికి నష్టము తెచ్చుకొంటివి. దేవుడు - "లోతును నీతో తీసికొనిపోవద్దు. లోతును నీతో తీసికొనిపోవద్దు" అనుచున్నాడు. ఏ పురుషుడో లేక స్త్రీయో రెండు చుక్కలు కన్నీరు కార్చగా, దేవునికి అవిధేయుడ వైతివి. ఆత్మీయముగా అంధుడవైతివి. దేవుని స్వరము వినజాలక యున్నావు. ఆయన సాన్నిధ్యము అనుభవింపలేకున్నావు. నీ పరలోక స్వాస్థ్యమునుగాని, పరలోక అధికృతనుగాని అనుభవింపజాలకున్నావు. చిన్నబిడ్డలు కోరునట్టివాటినే కోరుకొన్నావు. దేవుని సంబంధమైన వాటికి ఆకలిలేదు, భుజింప కోరిక లేదు. ఏలయనగా ఏదో ఒకలోతు నీ జివితమందు ప్రవేశించియున్నాడు. తక్షణమే ఆ

లోతునుండి విడిపోవలెను లేదా, దేవుని మాట వినకపోయినందుకు, ఎంత గొప్ప నష్టము తెచ్చుకొందువో ఒక దినమున కనుగొందువు, లోతునుండి ప్రత్యేకించుకొనుము. అప్పుడు దేవుడు నీకు ప్రత్యక్షమై నీతో మాట్లాడును, నీలో తన శక్తి పోయును.

దేవుడు అబ్రాహామునకు ప్రత్యక్షమైనప్పుడు అతడు హెబ్రోనులో నుండెనని మనము తెలిసికొంటిమి (ఆది కాం. 13 : 18). అప్పుడు అబ్రాహాము ఆరాధనతోను, స్తుతులతోను నిండుకొని యుండెను. దేవునితో అతడు మాట్లాడెను. ఆయనకొరకు బలిపీఠము నిర్మించెను. ఇదంతయు ఎట్లు సాధ్యమాయెను? లోతునుండి ప్రత్యేకించ బడినందుననే.

హెబ్రోను అనగా అర్థమేమి? "సహవాసము". పాపులమైనందున దేవుని సన్నిధినుండి మనము తొలగించబడితిమి. ఏ పాపియు దేవునితో సంభాషించలేడు. ఆయన స్వరము వినలేడు. అద్భుతములు చూడవచ్చును. స్వప్నములు రావచ్చును. అయినను నీ పాపములు క్షమించబడితేనేగాని, దేవునితో నీవెన్నటికిని మాట్లాడజాలవు. పాపులమైన మనకు దేవుడు చాలా దూరముగా యున్నాడు. గాని పాపములు క్షమించబడగానే బహు సమీపమున నుండును. ఏవేళ యందైనను ఆయన సన్నిధి నీవు చేరవచ్చును. ఈవులు అడుగుటకే కాదు, ఆయన సన్నిధిలో ఉండుటకు నీకు ఆశయుండును.

దినమంతయు ఒక శిశువు తల్లిచేతులలో నుండును. నీవు ఇట్లు ప్రశ్నించెదవనుకొందము, "చిట్టిపాప! దినమంతా అమ్మ నిన్ను ఎత్తుకొని వుంటే, నీకు విసుగులేదా? ఉదయము నుండి, మధ్యాహ్నము వరకు ఐదు గంటలైనా అమ్మ చేతుల్లోనే కనబడుచున్నావు. నీకు విసుగు లేదా చెప్పు చిన్నపాపా". అప్పుడు ఆ బిడ్డ – "నాకు విసుగు లేదు, నాకు హాయిగా వుంది" అని చెప్పును. ఇదెక్కడి విచిత్రము అనగలవా?

హైదరాబాదు పరిశుద్ధ కూటములకు హాజరైన తరువాత ఇట్లు అనవలెనని నీకుండునేమో - "అబ్బా మీటింగులో గంటల కొలది కూర్చోవాలి. నేను అలసిపోయినాను. నావీపు నొప్పి పుట్టుచున్నది. కడుపులో ఆకలి అగుచున్నది. నాకు కొంచెము ఆహారము, కాఫీ కావలెను. వీరికి వేరేపని లేదు. హెబ్రోనులో ఎన్ని గంటలయిన ఉండగలరు. మేము మామూలు మనుష్యులము కాము, ప్రాముఖ్యులము, ఇంతసేపు హెబ్రోనులో కూర్చోడమా! సమయమంతా వ్యర్థమే. ఈ వర్తమానము 2 గంటలకే గాని ముగించరు. భోజనాలు వడ్డించేసరికి 3 గంటలగును, ఇక్కడున్న సమయమంతా వ్యర్థమే." నీ మనసులో ఇట్లనుకొనుచున్నట్లయితే సహవాసమనునది నీవు ఎరుగవు. నీవు అంధుడవు. నీ జీవితములో ఏదో ఒక లోతు ఉండుట వలన, దేవునితో నిజమైన సహవాసము అనుభవింప జాలకున్నావు. ఎప్పుడైతే అబ్రాహాము లోతునుండి వేరుపడెనో, అప్పుడే దేవుని యొక్క నిశ్చయత అతనికి గోచరమాయెను. రెండవ మనుష్యునితో మాట్లాడిన రీతినే దేవునితో మాట్లాడగలిగెను. అందుచేతనే తన దేశమును, పశువులను, ప్రశస్త వస్తువులను సమస్తమును దేవుని కొరకు విడిచిపెట్ట గలిగెను. దేవుడు అతని అనుభవములో గోచరమాయెను.

లోతు అబ్రాహాముతో నున్నంతకాలము దేవుడు మౌనముగా నుండెను. అప్పుడప్పుడు "ఏమి చేయగలను! ఎల్లప్పుడు లోతు పశువుల కాపరులు, నావారు కలహించుచున్నారు! నేనేమి చేయాలి!" యని అనుకొనుచుండెనేమో. లోతును తన యొద్దనుండి పంపించి వేయునంత వరకు దేవుడు ఏ జవాబు ఇవ్వకుండెను. అటు పిమ్మట దేవుడు తానే - "ఉత్తరపు తట్టు, దక్షిణపు తట్టు, తూర్పు తట్టు, పడమర తట్టును చూడుము. నీవు లేచి యీ దేశము యొక్క పొడుగున, వెడల్పున దానిలో సంచరించుము" అని చెప్పుచు మాట్లాడ మొదలుపెట్టెను. ఇప్పుడు అతని కండ్లు తెరవబడెను, గనుక గ్రహించెను. దేవునితో స్పష్టముగా మాట్లాడగలిగెను.

ఎవరైనను మనలను "దేవుడు నీ పాపాలు క్షమించెనని నీకు ఏలాగు తెలియును? మాటి మాటికి దేవుడు నీ పాపాలు క్షమించినాడని చెప్పుకొంటున్నావు, ఏలాగు ఋజువుపరచగలవు?" అని అడుగవచ్చును, అప్పుడు మనము "నాకు తెలియదు ఒకటి మాత్రము నేనెరుగుదును. అనుదినము నేను దేవునితో మాట్లాడుచున్నాను. దేవుడు నాతోను మాట్లాడుచున్నాడు. ఏ వేళలోనైనా దేవుని సన్నిధిలో నేనుండగలను. ఆయన సన్నిధిలో నుండుట నాకెంతో ఆనందము" అని చెప్పుదుము.

మనుష్యులతో సంభాషించుట కంటె, దేవునితో సంభాషించుట మిక్కిలి సంతోషమిచ్చును. ఆయనను ఎరుగుదుము, ఆయన మనలనెరుగును. ఈ సహవాసము ద్వారా పోగొట్టుకొన్నవి ఎన్నియో తిరిగి పొందగలము. మొదట తండ్రితోను, కుమారునితోను పిమ్మట ఒకరితో నొకరు సహవాసము గలిగియుందుము (1 యోహాను 1 : 3). దేవునితో నిజమైన సహవాసము లేనిచో, ఇతర విశ్వాసులతో నిజమైన సహవాసము మనకుండదు. ఈ రెంటిని విడదీయలేము.

రైలు బండిలో ప్రయాణము చేయునప్పుడు నీ దగ్గర కూర్చున్న వానిని "అయ్యా! చుట్ట కాల్చవద్దు" అని నీవు అననిన యెడల అతడు మానివేయునేమో, అయితే ఒక స్టేషనులో బండి ఆగినప్పుడు దిగిపోయి తిరిగి కాల్చును. అతని సిగరెట్టో, బీడియో లేక అగ్గిపుల్లలో అయిపోయియుంటె, ఎవరి దగ్గరకో పోయి అడిగి తీసుకొనును. ఎందుచేతనగా పొగ త్రాగకుండా ఎక్కువ కాలముండలేదు. అందులోనే అతనికి ప్రీతియున్నది. త్రాగుబోతులు కూడ యింతే. ఎక్కడ పోయినను "సారాయి ఎక్కడ దొరుకును?" అని మొదట అడుగుదురు. వారి ప్రీతి యిందులోనే యున్నది. పరిశుద్ధకూటాలకు హెబ్రోనుకు వచ్చు స్త్రీలు అనేకులకు ఎక్కువ ఇష్టమైన విషయము ఏదనగా, చీరలు కొనుక్కొని ఇంటికి తీసికొనిపోవుట. అయితే మీరు దేవుని నిజమైన ప్రజలు

అయినప్పుడు విశ్వాసులతోటి సహవాసమే ఇతర వాటికొరకు గడుపు సమయము కంటె అధిక ఆనందకరముగా నుండును. పరిశుద్ధ కూటములు ఎంతో బాగుండెనని, కొందరు చెప్పుటకు కారణము, వారు మంచి రసము, ఉప్మా కాఫీ భుజించినందువలననే. దేనియందు నీకు అభిరుచి గలదో, దానిని బట్టియే నీకు పరిశుద్ధ కూటములు ఉండును. కొందరికి నిజమైన సహవాసమందే సంతోషము. దేవునితో మాట్లాడుట నీకు సంతోషముగా నుండునా? దేవుని సన్నిధియందు దీర్ఘకాలము కూర్చుండగలవా? దేవుని మందిరమందు, దేవుని జనులతో సహవాసము, దేవుని ఇంటిలోని నిజమైన సహవాసము ద్వారానే నష్టపడిన అనేకమైన వాటిని తిరిగి సంపాదించుకొనగలవు.

మొదటి విశ్వాసులు సహవాసమందు స్థిరముగా ఎడతెగక యుండిరి (అపొ. కార్య. 2 : 42). వారికి కావలసినదంతయు ఒకరితో నొకరు నిజమైన సహవాసము కలిగియుండుటేగాని, భూములు కావు మేడలు మిద్దెలు కావు. పేరు ప్రతిష్టలు కావు అంతకంతకు తీవ్రముగా శత్రువు వారిని హింసించినను, నిజమైన క్రైస్తవ సహవాసము ఇష్టపడు వారు ఆత్మీయముగా అంతకంతకు బలపడుదురు. దేవుని మందిరమందు నీకు గల అధిక్యతలను అనుభవింప నేర్చుకొనుము.

దేవుడు అబ్రాహాముకు ప్రత్యక్షమైనప్పుడు, ఆయనను ఎట్లు ఆరాధించవలెనో అబ్రాహాము ఎరిగియుండెను. ఆయనతో మాట్లాడుటకు సిద్ధముగా నుండెను (ఆది కాం. 18 : 22). ఆయనను కలిసికొనుటకు పరుగెత్తెను కూడ. ఒక దినము లోతుకు కూడ దేవుడు ప్రత్యక్షమాయెను (ఆది కాం. 19 : 1). అయితే ఇద్దరికి భేదము కొంత గమనించుము. అబ్రాహాము పట్టలేని సంతోషముతో దేవుని కలిసికొన పరుగెత్తెను. లోతు నడచిపోయి ఆయన ఎదుట వంగెను. అబ్రాహాము అత్యంత కులాసతో తన దేవదూత అతిథులను ఇంటికి రమ్మని ఇట్లనెను – "లోపలికి దయచేసి వచ్చి కాళ్ళు

కడుగుకొనండి. మీకు కొంత ఆహారము సిద్దము చేస్తాను." లోపలికి పరుగెత్తి పోయి, భార్యయగు శారాను పిలిచి, "తొందర తొందరగా, భోజనము సిద్ధము చేయి" అని చెప్పి, క్రొవ్విన దూడను వధించి, సంతోషముతో వారి కొరకు గొప్ప విందు తయారు చేసెను. ఇదే అతిథులతో లోతు "లోపలికి రండి" అనెను, గాని వారు రాము అనిరి. అనేకమార్లు బలవంతము చేయగా వారు వచ్చిరి గాని లోతు తన భార్యను గాని, కుమార్తెలనుగాని పిలిచి ఒక విందు తయారు చేయుమని చెప్పినట్లు వ్రాయబడిలేదు ఏల? వారు కేవలము లౌకికులు. ఒకవేళ లోతు "నా ప్రియమైన భార్యా! త్వరపడి అతిథులకు భోజనము తయారుచేయి" అని భార్యను పిలిచి చెప్పియుండినను, ఏమి జవాబు ఇచ్చియుండునని తలంచెదవు? ఈ విధముగా చెప్పియుండునేమో - "నీవే పోయి వంట చేయుము, నీకు వంటలు చేయడానికి నేను పెండ్లాడలేదు. నీవే వండిపెట్టు". కుమార్తెలైనా అంతే. అమ్మాయిలూ! చుట్టాలకు భోజనము వండడానికి సహాయము చేయండి అని అతడు వారినేమైనా అడిగియుంటె వారేమి జవాబు చెప్పి యుందురు? ఇట్లని యుండవచ్చును - "మా ముఖాల మీదంతా పౌడర్ ఉన్నది. వ్రేళ్ళకు గోళ్ళకు రంగుపూసి యున్నాము. మేమేలాగు రావడము? మీరే పోయి వంట చేయండి." తుదకు లోతే వంట చేయవలసి వచ్చెను, ఎంత భేదమో చూడండి.

అబ్రాహాము దేవుని ఎరిగినవాడు. బహు సంతోషముతో ఆయనను కలిసి మాట్లాడవెళ్ళెను. ఆయన కొరకు సమస్తము త్యాగము చేయ సిద్ధముగా నుండెను. అయితే లోతు సొదొమకు సమీపముగా తన గుడారము వేసికొనెను (ఆది కాం. 13 : 12) తరవాత సొదొమ లోపలనే కాపురముండటకు వెళ్ళెను (ఆది కాం. 14 : 2) చివరిగా ఆ పట్టణము యొక్క ప్రాముఖ్య పౌరులలో ఒకడై, నగర ద్వారము దగ్గర కూర్చుండెను (ఆది కాం. 19 : 1). సొదొమలో ఒకపెద్దగా ఏర్పడెను. ఈ విధముగా, దేవుని దగ్గర తన హక్కులు, ఆధిక్యతలు పోగొట్టుకొని లోక ఐశ్వర్యము, లోకములో పేరుపొందు నిమిత్తము ఆత్మీయముగా

గ్రుడ్డివాడాయెను.

ఇప్పుడు హెబ్రోను చూతము, దాని అర్థము సహవాసము. మొదటిదిగా దేవుని సహవాసము, రెండవదిగా సహపాటి విశ్వాసులతో సహవాసము. నీవు లోతు స్నేహితుడవైతే ఈ సహవాసములోనికి రాజాలవు. లోకస్థులగు మిత్రులను, బంధువులను విడిచి పెట్టిన యెడల, దేవుని సహవాసము నీకు నిత్యత్వానికి కలుగును.

రెండవదిగా హెబ్రోను విశ్వాసమును సూచించుచున్నది. ఇశ్రాయేలీయులు కానానుకు పోయి అక్కడి బలాఢ్యులను చూచి బెదరిపోయిరి, అయితే యెహోషువ 14 : 11 13లో కాలేబు విషయము చదువుచున్నాము అతడు యెహోషువ యొద్దకు వచ్చి - "నాకు హెబ్రోను నిమ్ము, అక్కడ ఎంతమంది బలాఢ్యులు, రాక్షసులున్నను, నేను వారిని జయింతును. అనేక సంవత్సరములు దేవుని విశ్వాస్యతను ఋజువు పరచగలిగితిని ఇప్పటికిని ఆయననే నమ్ముకొంటున్నాను. ఆయన సహాయముతో ఆ రాక్షసులతో పోరాడగలను. నాకు హెబ్రోను ఇమ్ము" అని చెప్పెను. కనుక యెహోషువ అతనికి హెబ్రోనును యిచ్చెను, తన విశ్వాసము వలన కాలేబు ఆ బలాఢ్యులనందరిని తరిమి వేయగలిగెను.

హెబ్రోను విశ్వాసమును కూడ తెలుపుచున్నది. రాక్షసుల విషయము బెదరిపోవద్దు. వారితో యుద్ధమునకు సిద్ధపడుము. అనేక రాక్షసులు, ఆటంకములు, అడ్డులు నీ మార్గమందున్నను నీ సజీవ విశ్వాసము ద్వారా ప్రతి బలాఢ్యుని, ఆటంకమును, అడ్డును జయింపగలవు.

## 9వ అధ్యాయము

# దావీదుకు కలిగిన నాల్గవ నష్టము

యెరూషలేము నాలుగు కొండలమీద కట్టబడిన పట్టణము. ఇందు ఒక దానిమీదనే సీయోను ఉన్నది. సీయోనులో నివసించు చుండినవారు యెబూసీయులు. దావీదు దేవునికి లోబడుట ద్వారా సీయోనును జయించి యెబూసీయులను త్రోలివేసెను. అయినను, 2 సమూయేలు 24 : 18-25లో అరౌనా అనబడిన యెబూసీయుడు ఇంకను సీయోనులో నివసించు చుండినట్లు చదువుచున్నాము. అతడు మంచివాడు, దేవుని భయము కలిగినవాడు. అతని కళ్ళమును కొనుటకు దావీదు రాగా అతటిట్లనెను - "నా యేలినవాడా, ఇదంతయు ఉచితముగా పుచ్చుకొనుము. నా ఎడ్లను దహన బలికి ఇచ్చుచున్నాను," దావీదు - "వెల యియ్యక నేను తీసుకొనిన దానిని నా దేవుడైన యెహోవాకు దహన బలిగా అర్పించను" అనెను. అరౌనా యొక్క కళ్ళమును గూర్చిన కథయే దావీదు యొక్క నాల్గవ నష్టమును తెలుపుచున్నది. దావీదును ఒక కళ్లము దగ్గరికి తెచ్చుట రెండు మార్లు తటస్థించెను (1 దినవృత్తా. 13 మరియు 2 సమూ. 24). కళ్ళమునందు జరుగు పని గోధుమ ధాన్యము పొట్టునుండి వేరు చేయబడుట. పిమ్మట చెరిగినప్పుడు గాలికి పొట్టు కొట్టుకొని పోవును, ధాన్యము ఉండిపోవును.

దేవుని మందసమును, దాని స్థలమునకు తెచ్చుటకు దావీదు సహస్రాధిపతులతోను, శతాధిపతులతోను, అధిపతులతోను, ఆలోచన చేసినట్లు 1 దినవృత్తా. 13లో చూచితిమి. మందసమును మోసికొని పోవుటకు ఒక పద్ధతి దేవుడు నియమించి యుండినది, దావీదుకు తెలిసియే యుండును. అయితే ఆ పద్ధతిని దావీదు అవలంబించలేదు. మందసమును లేవీయులు భుజముల మీద మోసికొని వెళ్ళవలెను. దావీదు, ఫిలిష్తీయులు చేసిన ప్రకారము ఒక క్రొత్త బండిమీద దానిని పెట్టి తీసికొని పోవుచుండినందున దేవుని ఉగ్రత అతని మీద పడెను. కీదోను కళ్ళమునొద్ద దేవుని ఏర్పాటుని విడిచి మనుష్యుల పద్ధతిని అవలంబించుట ఎంత పెద్ద పొరబాటో దావీదు గ్రహించెను.

2 సమూయేలు 24లో దావీదు తన సేనాధిపతియగు యోవాబుకు, "నీవు పోయి ఇశ్రాయేలు వారిని, యూదా వారిని లెక్కించుము" అని ఆజ్ఞాపించెను. తన బాహుబలముతో గాని, తన సైన్య బలముతో గాని ఒక్క యుద్ధమైనను తాను గెలిచి యుండలేదని దావీదు బహుచక్కగా నెరుగును. 1 సమూయేలు 17 : 47లో, "యెహోవా కత్తిచేతను ఈటె చేతను రక్షించువాడు కాడు, యుద్ధము యెహోవాదే" అని దావీదు తానే చెప్పెను. అయితే తనకు ఇంత సైన్య బలముండెనని ప్రదర్శించుకొను నిమిత్తము, తన రాజ్యములోని ప్రజల సంఖ్య లెక్కించుమనెను. దావీదు అతిశయించి తన విజయములకు సైన్యముల మీద ఆధారపడ ప్రారంభించెను. యోవాబు దావీదుతో - "నా యేలినవాడా! ఒక్క యుద్ధమైనను బాహుబలముతో నీవు గెలిచి యుండలేదు. నీ పక్షమున పోరాడినది దేవుడే. ప్రజలను లెక్కింపనేల? జనుల సంఖ్య యెంతయున్నను, దేవుడు వారిని నూరంతలు ఎక్కువ చేయుగాక, అయినను వారు నిన్ను రక్షింపజాలరు. నీకు సహాయము చేయునది దేవుడే" అనెను, అయినను దావీదు గర్వించినందున ప్రజలను లెక్కించి తీరవలయునని ఆజ్ఞ ఇచ్చెను. ఆయన మాటే నెగ్గెను. దావీదు తరువాత పశ్చాత్తాప మొంది ప్రభువుతో

ఇట్లు – "నేను చేసిన కార్యము ద్వారా అధిక పాపము ఒనర్చితిని. నీ దాసుని అతిక్రమమును తీసివేయుము తండ్రీ! చాలా తెలివితక్కువైన పని చేసితిని" అని మొరపెట్టుట సత్యమే అయినను దావీదు యొక్క పాపము వలన దేవుడు ఇశ్రాయేలీయుల మీద మూడు దినములు తెగులు రప్పించెను. 70,000 మంది మరణించిరి. ఎంత నష్టము! ఎంత భయంకరమైన నష్టము. చివరికి దేవుడు అరౌనా యొక్క కళ్ళము యొద్ద జనులను నాశనము చేయు దూత చేతిని ఆపు చేసెను.

దేవుడు దావీదును ఒక కళ్ళము దగ్గరకు తెచ్చుటకు ఇది రెండవసారి. ఏల? దావీదు యొక్క జీవితములోని పొట్టును తీసివేయుటకు, దావీదు తలంచినది ఏమనగా – "నేను చాలా జ్ఞానవంతుడను నాకు చాలా, చాలా తెలియును." ఇది నిజమే, 2 సమూయేలు 16లో దావీదు బహు జ్ఞానవంతుడని తెలిసికొంటిమి. ఇతర మానవులతో పోల్చి చూడగా, రాజ్యమంతటిలో ఇంత జ్ఞానము కలిగినవాడు మరొకడు లేడు. అయితే దావీదు మెదడులో ఇంకను పొట్టు అధికముగానే ఉండుట దేవుడు చూచెను. అందువల్లనే దేవుడు అతనిని అరౌనా కళ్ళము చెంతకు తెచ్చెను. ఏల? అతని క్రిందికి దించి, దీనునిగా చేసి, తనలోని మానవ జ్ఞానమును, తన్ను తాను నమ్ముకొనుటకును మాన్పించు నిమిత్తము.

2 దిన వృత్తాంతము 3 : 1లో చూచినట్లయిన ఈ కళ్ళము ఉండిన స్థలము మీదనే, సొలొమోను దేవాలయము నిర్మించుట తెలియుచున్నది. దావీదుకును, ఇశ్రాయేలు జనులకును కలిగిన గొప్ప నష్టములో నుండియే దేవుడు క్షమాపణయు, సంపూర్ణముగా తిరిగి పొందుటయు మరింత అధికముగా పొందుటయు వారికి. అనుగ్రహించెను. కట్టబడనున్న తన దేవాలయము యొక్క పరలోకపు మచ్చును దేవుడు దావీదునకు ఇవ్వగా అతని కుమారుడగు

సొలొమోను అక్షరానుసారముగా దావీదు తనకు బోధించిన దంతయు నెరవేర్చెను. ఆ దేవాలయమును సొలొమోను నిర్మించెను. అది పూర్తియైన పిమ్మట, పని ముగిసిన వెనుక ఆ దేవాలయమునందు సొలొమోను దహన బలులను అర్పించెను. ఇశ్రాయేలు జనాంగమున కంతయు ఇంత సంతోషకరమైన దినము మరొకటి యుండలేదు. అనేక శతాబ్దములు వారు పొందిన నష్టమంతయు ఇప్పుడు తిరిగి పొందిరి. దేవుని మహిమను చూచిరి. దేవుడు వచ్చి వారి మధ్య నివసించెను. దేవాలయములోని కెరూబుల నడుమనుండి ఆయన వారితో మాట్లాడ గలిగెను. దేశదేశాల నుండి ప్రజలు వచ్చి సొలొమోనుకు నమస్కరించిరి. ఇశ్రాయేలీయులు ఒక జనాంగముగా గొప్ప నష్టములు, భయంకరమైన నష్టములు పొందియుండిరి. ఎక్కడ చూచినా పాపమే, మలినమే. మరియు మాటిమాటికి ఫిలిష్తీయులు, యెబూసీయులు, ఇతరుల చేత ఓడింపబడుచుండిరి. అయితే ఇప్పుడు ఆ కథ అంతయు మారిపోయెను. ఇప్పుడు వారు దేవుని ప్రజలు. దేవుడు తన సంపూర్ణ మహిమతో వారి మధ్యనుండెను. పోయినదంతయు నిజముగానే తిరిగివచ్చెను. వారు నిజముగా దేవుని ప్రజలు అనబడుటకు యోగ్యులైరి.

సీయోను అనగా అర్థమేమి? (2 దినవృత్తాంతము 3 : 1, 1 దిన వృత్తాంతము 28 : 29, 1 రాజులు 6 : 7, 2 దిన వృత్తాంతము 7:1 చదువుము). సీయోను యొక్క అర్థము సంపూర్ణముగా బోధించవలెనంటె ఎన్నో గంటలు పట్టును కావున కొన్ని అంశములు మాత్రమే గమనింతము.

మొదటి దిగాఏమనగా – దేవాలయము ఏ స్థలము మీద కట్టవలెనో, సీయోనులోని ఆ స్థలమునకు దేవుడు దావీదును తెచ్చెను. యోరుషలేము కట్టబడిన నాలుగు కొండలలో ఒకటి సీయోను. తన దేవాలయము లేక మందిరము కొరకు సీయోనులో దేవునికి ఒక స్థలము కావలసియుండెను. ఆ

నగరము యెబూసీయుల వశము నందుండినందున అక్కడ దేవునికి స్థలముండలేదు. దావీదును పెక్కు సంవత్సరములు తర్ఫీదు చేసిన పిమ్మట అతనిని దేవుడు సీయోనుకు తెచ్చెను. అనగా ఆదికాండము 24లో అబ్రాహాము యొక్క తీవ్రమైన పరీక్ష జరిగిన చోటుకే. ఆ స్థలములో దావీదు మానవ జ్ఞానము నుండి సంపూర్ణముగా విడుదల చేయబడి, సంపూర్ణముగా విరువబడి అతనిలోని పొట్టంతయు తీసివేయబడిన తరువాత దేవాలయము కట్టవలసిన స్థలము అతనికి చూపబడెను.

రెండవదిగా, దేవాలయము యొక్క మాదిరిని దేవుడు దావీదు కిచ్చెను. 1 దిన వృత్తాం. 28:19లో ప్రతిచిన్న వివరముతో కూడిన సంపూర్ణ మాదిరిని, మచ్చును దేవుడు అతనికి ఇచ్చెను.

మూడవదిగా, 1 రాజులు 6 లో సొలొమోను ఎట్లు ఆ పనిని ప్రారంభించి ముగించెనో మరియు, ముందుగానే రాళ్ళు కొండల తొలిచి తీసిన స్థలమందే అవి పరలోక మాదిరిని అనుసరించి చక్కగా తయారు చేయబడినందున ఎట్లు సుత్తె శబ్దముగాని, ఏ పనిముట్టు శబ్దముగాని వినబడక ఆ దేవాలయము నిర్మింపబడెనో మనము చూచుచున్నాము. దేవుని జనుల ఐక్యత, పొందిక, సహవాసమును ఇది సూచించుచున్నది. జగడములుగాని, కొట్లాటలుగాని, అసమాధానముగాని ఉండలేదు. అందరు పరిశుద్ధాత్ముని పాలన క్రింద నుండిరి.

నాలుగవదిగా, ఆ పని పూర్తియైన తరువాత దేవుని అగ్ని దిగి ఆ స్థలమునంతయు మహిమతో నింపెను. దేవుడు మాట్లాడుట ప్రారంభించి బహు తేటగా మాట్లాడుచుండెను. అదియే సీయోను. ఎక్కడైతే దేవుడు ప్రతి హృదయమందును, ప్రతి సంఘమందును, పరలోక మాదిరిని అనుసరించి

ఏలుచున్నాడో నిజమైన సీయోను అదే.

ఒక పందిరి, ఒక బల్ల, ఒక  ప, ఒక ప్లేటు, కొన్ని కీర్తన పుస్తకములు ఉండిన యెడల, ఒక సంఘము ప్రారంభించ వచ్చునని కొందరి అభిప్రాయము. ఇది ఎన్నటికి సాధ్యము కాదు. నిన్ను అనేక కళ్ళములగుండా దేవుడు తీసికొనిపోయి, నీలోని పొట్టు తీసివేసితేనేగాని పరలోక సంబంధమైన సంఘము కొరకు, తన పరలోక మాదిరిని అనుసరించుటకు ఒక స్థలమును ఇవ్వజాలడు. డబ్బు, కట్టడములు, స్థలము ఉండగానే చాలునా? దేవునికి కావలసియుండినది ఒక పరలోక సంబంధమైన సంఘము, ఒక ఆత్మీయ సంఘము. దేనినైతే ఆయన పరిపాలించగలడో, దేని ద్వారానైతే ఆయన తన ప్రజలతో నిరాటంకముగా మాట్లాడగలడో, అట్టిది సంఘము. ఆ సంఘమందు పరలోక మాదిరి ప్రత్యక్షముకాగా దాని మహిమ సంపూర్ణముగా కనబడును. సీయోను ద్వారానే దేవుడు సాతానును సంపూర్ణముగా ఓడించి వేయును. సీయోను ద్వారానే ఆయన జ్ఞానము, ఆయన శక్తి చూపుచున్నాడు. దేవుని యొక్క సంపూర్ణత, ఆయన మహిమ మనము చూడగలిగినది ఇచ్చటనే.

హెబ్రోను సీయోనుల ద్వారా దావీదు పోగొట్టుకొనిన సమస్తము తిరిగిపొందెను. నీవు పోగొట్టుకొనిన సమస్తము తిరిగి పొందగోరుచున్నావా? అయితే హెబ్రోను, సీయోను అనగా అర్థమేమో నేర్చుకొనుము. సమస్తమును ప్రార్థనల ద్వారా దేవుడు నీకు ప్రత్యక్షపరచును అప్పుడు దావీదు పేరు తీసివేసి మన పేరు వ్రాసి, ఈ వాక్యమును చెప్పుకొనవచ్చు : "భక్త్ సింగ్ సమస్తము తిరిగి పొందెను," "బెంజమిన్ సమస్తము తిరిగి పొందెను." ఈ విధముగా విశ్వాసము ద్వారా ఈ మాటలు మనయందరి జీవితములలో నెరవేర్చును గాక.

☆

## 10వ అధ్యాయము

# తిరిగి పొందుటలో గల రహస్యములు

మానవులైన మనము రెండు విధములైన నష్టములు పొందుచున్నాము. మొదటి రకపు నష్టము మనకు రక్షణాను భవము లేనప్పుడు కలుగుచున్నది. అప్పుడు మనము ఏది చేసినను నష్టమే, నిష్ఫలమే. ప్రఖ్యాతి చెందిన రాజైన అలెగ్జాండర్ విషయము చూడగా ఎన్నెన్నో దేశములను జయించుకొని ఎంతెంతో ఐశ్వర్యము సంపాదించి, జయించుటకు యింకను దేశాలే లేవేయని విలపించుచున్నాడు. అతడు మరణించినప్పుడు అతని వయస్సు ముప్పది యేండ్లు. సమాధి పెట్టెలో తన్ను పెట్టునప్పుడు చేతులను వెలుపలనే యుంచుమని విన్నవించెను. సమాధి పెట్టెను వీధులగుండా ఊరేగించునప్పుడు, దానిముందు ఒకడు నడచుచు యిట్లు ప్రకటించవలెనని ఆజ్ఞాపించెను – "అలెగ్జాండర్ మహారాజు వట్టి చేతులతో లోకమునకు వచ్చెను. వట్టి చేతులతోనే వెళ్ళిపోవుచున్నాడు." అతడు మరణించిన పిమ్మట అదే ప్రకారము చేసి, ఇంత గొప్ప రాజు తాను సంపాదించిన దేదియు తనతో కూడ తీసికొని పోలేక పోయెనని ప్రకటించిరి. మనలో ప్రతివారి సంగతి కూడ యింతే. పాపివైన నీవొనర్చిన దంతయు, నెరవేర్చినదంతయు కేవలము వ్యర్థమే. పాప దండన

క్రిందికి వచ్చి నీ శిక్షను నిత్యత్వానికి భరించవలెను. మనుష్యులకు యిందు వలననే చావంటే భయము.

వోల్టేయిర్ అను ప్రఖ్యాతిగాంచిన పండితుడైన రచయిత ఒకడుండెను. అతడు బైబిలు నమ్మనివాడు. తాను నాస్తికుడని చెప్పుకొనుచుండెను. తాను దేవునియందు నమ్మకముంచక నమ్మువారిని అపహాస్యము చేయుచుండెను. ఒక సమయము వచ్చెను. ఇతనికి తీవ్రమైన జబ్బు చేసెను. అదేమి జబ్బని వైద్యులెవరును కనిపెట్ట లేకుండిరి. రాత్రులలో చీకటివేళ యంతయు మిక్కిలి భయముతో కేకలు వేయుచుండెను. అతని ముఖము ఎంత భయంకరముగా కనబడుచుండెనంటే, ఒక రాత్రి అతనిని చూచుకొనుచుండిన నర్స్ (Nurse) మరునాటి రాత్రికి వచ్చునది కాదు. అంధకారములో, భయములో మునిగి యితడు చనిపోయెను.

నీవు మరణము యెట్లు ఎదుర్కొన బోవుచున్నావు? నీవు చేసిన ప్రతి కార్యమును గూర్చి దేవునికి లెక్క అప్పగించవలసి యుండు దినము వచ్చును. పాపములోనే మరణించితివా, దేవుని న్యాయతీర్పు కొరకును అగ్నిగుండములో నిరంతర శిక్షకును సిద్ధపడుము. దేవుడు ప్రేమయై యున్నాడు. ఆయన న్యాయవంతుడు కూడాను. పరిశుద్ధుడగు దేవుడైనందున పాపమును సహింపజాలడు.

మూడు గొప్ప నియమములు మనము గైకొనవలసి యున్నది. (1) పరిశుద్ధత (2) న్యాయము (3) ప్రేమ. పాపములో జీవించితివా పరిశుద్ధత అను నియమమును అతిక్రమించితివి. పాపములో మరణించితివా, న్యాయము అను నియమము నిన్ను శిక్షించి తీరవలెను అనుచున్నది. అయితే ప్రేమయైయున్న దేవుడు రక్షణ్య జీవ మార్గమును నీకు అందించుచున్నాడు శిక్షావిధి నుండి నీవు తప్పించుకొని, సమృద్ధిగా ఫలించునట్టి జీవితము

జీవించగలవు. ఈ మూడు నియమములను నెరవేర్చు నిమిత్తము, ప్రభువైన యేసుక్రీస్తు నరుడై సిలువపై మరణించెను. ఆయనను అంగీకరించి తిరిగి జన్మించిన వారిలో యీ మూడు నియమములు నెరవేరుచున్నవి.

రెండవ రకపు నష్టము తిరిగి జన్మించిన వారికి సహితము కలుగునది. కారణము అజ్ఞానమో లేక బుద్ధిహీనతో లేక పాపమో కావచ్చును.

జ్ఞానము లేకపోవుట వలన పెద్ద నష్టమే కలుగవచ్చును. ముప్పది ఎనిమిది ఏండ్ల క్రిందట నేను లండనుకు మొదటిసారి వెళ్లియుంటిని. ఆ రాత్రి చలి అధికముగా నుండెను. అ గృహపు యజమానురాలు, మరునాటి ఉదయమున నన్ను యిట్లు అడిగెను – "భక్తసింగ్ గారూ! బాగా నిద్ర పోయారా?" "లేదండి, అమ్మగారు, రాత్రంతా చలితో వణకుచున్నాను. అ చలికి నా వెచ్చని కోటు వేసికొని, మేజోళ్ళు కూడ తొడుగుకొంటిని. అయినా చాలా చల్లగా యున్నందున వణుకుచునే యుంటిని" అని చెప్పితిని. "ఎందుకు? మీ పడకమీద కంబళ్ళు యుండలేదా" అనెను. నాకు కంబళ్ళు కనబడలేదమ్మా అంటిని, "పోయి చూద్దాం రండి" అనుచు, నా గదికి వచ్చి పడకమీద కప్పియున్న దుప్పటిని పైకెత్తెను. దానిక్రింద ఒకటికాదు, సరికొత్త కంబళ్ళు మూడు యుండెను. అంతమంచి కంబళ్ళు నా జీవితకాలములో నేను చూచియుండలేదు. అటువంటి పడక మీద నేను పరుండుట అదే మొదటిసారి. కంబళ్ళ క్రింద దూరుట ఎట్లో ఎరుగక వాటిపైన పరుండి పెద్ద మొద్దువానివలె, ఆ రాత్రంతయు వణకుచుంటిని. నా క్రిందనే మూడు క్రొత్త కంబళ్ళు యుండెను. ఎరుగక పోవుట వలన పొందు నష్టము యిట్టిది.

తిరిగి జన్మించినవారు ఎందరో చక్కని బైబిళ్ళు కలిగియున్నారు. గాని, వాటిని తెరచిచూచి యెరుగరు. బహు జాగ్రత్తగా దాచి పెట్టుచున్నారు. గాని లోన యేమియున్నదో వారికి తెలియదు. 25 రూపాయలు పెట్టి గిల్టు (Gilt)

అంచుగల బైబిలు కొందురు. అయినను బైబిలు ఎట్లు ఉపయోగించవలెనో, దేవుని వాక్యమందలి వాగ్దానములను నెరవేర్చుమని ఎట్లు అడిగి సంతోషించ వలెనో యెరుగరు.

చాలా యేండ్ల క్రిందట పంజాబుకు ఒక మిషనెరి వచ్చెను. అక్కడ పల్లెటూళ్ళలో ఒక పళ్ళెమంత విశాలముగాను, ఒక అంగుళము దళసరిగాను రొట్టెలు కాల్చుదురు. ఇంత పెద్ద రొట్టెలను పెన్నము మీద బహు నిదానముగా కాల్చవలెను. పిమ్మట దానిమీద వెన్నపూసి కూరగాయలతో భుజింతురు. ఒక రాత్రి ఒకరి యింటిలో ఆయనను భోజనముకు పిలిచి, పళ్ళెమంత పెద్ద రొట్టెను దానిమీద కూరగాయల వంటకమును, ఆయన ముందు పెట్టిరి. ఆ మిషనెరి కూరను మాత్రము తినివేసి, "ఇదిగో పళ్ళెమును తీసివేయండి" అనుచు రొట్టెను వారికి అందించెను. అది పళ్ళెము కాదు రొట్టెయని యెరుగడు. ఇది జ్ఞానము లేకుండా యుండుటయే. నీవు విశ్వాసి అయియుండినను, దేవుని యొక్క సంకల్పము, ఆయన ఏర్పాటు అజ్ఞానము చేత నీవు గ్రహింపకుండుట వలన పెద్ద నష్టము పొందవచ్చును. లేదా నీ అవివేకము, పొరబాట్లవలన ఒకప్పుడు నీ జీవితమునకు మాత్రమే కాకుండ సంఘానికి సహితము గొప్ప నష్టము తెచ్చి పెట్టుదువు.

దేవుడు అబ్రాహామునకు ఒక గొప్ప ఆశీర్వాదము వాగ్దానము చేసెను. ఆదికాండము 12:1-3లో అబ్రాహాముకును, అతని సంతతికిని, ఎన్నో నిత్యత్వమునకు చెందునట్టి ఆశీర్వాదములు వాగ్దానము చేసెను. అయితే అరణ్యమందు నలువది యేండ్లు శ్రమలు, పరీక్షలు అనుభవించిన పిదపనే ఇశ్రాయేలీయులు వారి ఆశీర్వాదములను గ్రహించి అర్థము చేసికొనిరి. వారు ఐగుప్తును విడిచి కొన్ని దినములలోనే కానాను చేరుకొని దానిని అనుభవించి యుండవచ్చును. కాని దేవునికి సంపూర్ణముగా విధేయులు కాకపోవుట

వలననే అన్ని శ్రమలు పొలైరి. మొట్టమొదటిలోనే ఒక చిన్న విషయములో పొరబాటు చేసిరి, దానివలన ఒక పెద్ద నష్టమే వచ్చెను. చిన్న నష్టములే తరచు పెద్ద నష్టములుగా మారును.

అయితే ప్రేమమూర్తియగు దేవుడుగాని ఆయన యొక్క సంకల్పములు గానీ, మారలేదు. తన ప్రజలు వారు నష్టపోయిన దంతయు తిరిగి పొందువరకు వారి యెడల పని చేయుచునే యుండెను. ఇశ్రాయేలీయుల చరిత్రలో యిట్లు వారు నష్టపడిన ప్రతిదానిని తిరిగి పొందువరకు దేవుడు చూపిన మారని ప్రేమయు, మారని నియమమును మనము చూచుచున్నాము. దేవుని యొక్క నియమమును ఎవడును మార్చజాలడు. అతడు భాగ్యవంతుడైనను, పేదవాడైనను, రాజైనను, భిక్షకుడైనను, బోధకుడైనను, మామూలు మనుష్యుడైనను దైవ నియమములు మార్చబడవు. తెలియక అజ్ఞానము వలన మనము మార్చ చూచితిమా, తప్పక గొప్ప నష్టము పొందుదుము.

దేవుడు మనలను తన జతపనివారిగా చేసియున్నాడు. తన యొక్క సంకల్పములను మనలోను, మన ద్వారాను, నెరవేర్చ కోరుచున్నాడు. ఏలీ మనకొక దృష్టాంతము. అతడు ప్రధాన యాజకుడు. అయినను దేవునికి పనికి వచ్చినవాడు కాడు. అతనిని గద్దించి శిక్షింపవలెనని దేవుని యుద్దేశము. ఏలీతో చెప్పుటకు ఎవరును ఉండలేదు. సమూయేలు దొరుకు పర్యంతము అనేక సంవత్సరములు దేవుడు కనిపెట్టవలసి వచ్చెను. అటు పిమ్మట ఆ చిన్న బాలునితో మాట్లాడి, తన మాటలను సమూయేలు ద్వారా ఏలీకి వినిపించెను. "సమూయేలు! సమూయేలు! అని దేవుడు పిలువగా ఆ బాలుడు మనుష్యుడే తన్ను పిలుచుచున్నాడు అనుకొనెను. మూడవ మారు పిలిచినప్పుడు అది దేవుని స్వరమని అతనికి తెలియజేయబడెను. దేవుడు ఏలీతో స్ఫుటిగా మాట్లాడి - "నీవు పాపము చేసియున్నావు. నిన్ను శిక్షించబోవుచున్నాను" అని

చెప్పి యుండవచ్చును. అట్లు చేయక అనేక సంవత్సరములు వేచియుండి సమూయేలు ద్వారా ఏలీని గద్దించెను. యిది దేవుని ఏర్పాటై యుండెను. తన పాలి భాగస్థులుగాను, జతపనివారిగాను ఉండువారు దేవునికి కావలెను. అయితే అంతటి గొప్ప పూచి, అధికృతలకు మనము తర్ఫీదు కావలెను. బైబిలులో లిఖింపబడిన కథలన్నియు మనకు ఒక పాఠము నేర్పుచున్నవి. అదేమనగా, దేవుడు ఏర్పరచుకొనిన ప్రజలు ఆయనను దు:ఖపరుచుచునే యుండిరి. మొట్ట మొదటినుండి దేవుడు వారితో - "మీరు సమస్త దేశములలో నాకు స్వకీయ సంపాద్యమగుదురు" అని చెప్పియుండెను (నిర్గమ. 19:5). అయినను వారు దేవుని దు:ఖపరచుచునే వచ్చిరి. అయినప్పటికిని దేవుడు వారిని వదలిపెట్టలేదు. విడువక వారి యెడల పనిచేయుచు, తనకు జత పనివారిగా వారిని సిద్ధపరచు నిమిత్తము తన ప్రవక్తలను ఆయన పంపుచుండెను. అనేక సంవత్సరములు దేవుడు వేచియుండవలసినను, తన దైవ నియమములను మార్చివేయడు.

మన నష్టమెట్టిదో, నష్టమునకు కారణమేమిటో దేవుని వాక్యము నుండి చూచుచుంటిమి. యిప్పుడు పోగొట్టుకొనిన ప్రతిదానిని తిరిగి పొందుటకు ఉపయోగించవలసిన ఆయుధములను పరీక్షింతము. హెబ్రోను సీయోను అను రెండు గొప్ప ఆయుధములను దేవుడు మనము పోగొట్టుకొనిన ప్రతిదానిని మనము తిరిగి పొందుటకు వాడునని ముందే తెలిసికొని యుంటిమి.

మానవ రీతిగా లోతు విషయము అబ్రాహాము జాలిగొనినందున నష్టము పొందెను. ఎప్పుడైతే అతనినుండి వేరుపడెనో దేవుడు అబ్రాహాముకు ప్రత్యక్షమాయెను. లోతు అబ్రాహాముతో నుండినంత కాలము దేవుడు అబ్రాహామునకు ప్రత్యక్షమగుట గాని, అతనితో మాట్లాడుట గాని చేయలేకుండెను. ఈ రీతిగానే విశ్వాసులనేకులు దేవునితో సంభాషించు

భాగ్యమును కోల్పోయియున్నారు.

హెబ్రోను అను మాటకు సహవాసము అని అర్థము. మొదట దేవునితో అనగా, తండ్రి కుమారులతో సహవాసము. రెండవదిగా, మనలో మనకు సహవాసము. 1 యోహాను 1 : 3,4,7 చూడుము. ఒక పాపియందు దేవుడు నివసింపజాలడు, అతడు ఆయనతో మాట్లాడజాలడు. పాపి దేవుని చిత్తము తెలిసికొనలేడు. దేవుని ఏర్పాటుగాని, సంకల్పముగాని, మర్మములు గాని గ్రహింపజాలడు. దేవుని జీవము అతనిలో పోయబడుటకు వీలుకాదు. అతడు అద్భుతములు చూడవచ్చును. దేవుడు అతని ప్రార్థనలకు ప్రత్యుత్తరము ఒసగవచ్చును. అయినను అతడు దేవుని నుండి దూరముగానే యున్నాడు.

యేసుక్రీస్తు ప్రభువు భూమిమీద నుండిన కాలమున, ఆయన అద్భుతములు చేయుచుండగా అనేకులు యిట్లు చెప్పుకొనసాగిరి : "ఈయనే క్రీస్తు! ఈయనే క్రీస్తు. మన మెస్సీయ ఈయనే" అట్లయినను, యోహాను 2:23-27లో ఆయన తన్ను వారి వశము చేసికొనలేదని మనము చూచుచున్నాము. వారు – "ప్రభువా, నీయందు విశ్వసించుచున్నాము" అనుచున్నారు. పాపముతో నిండిన హృదయములను కలిగి, పాపము విడిచి పెట్టి జీవించుటకు వీరు ఒప్పుకొననివారని ఆయన ఎరుగును. యెప్పుడు అద్భుతములు చూడవలయుననే వారి కోరిక మన పాపముల విషయము దుఃఖపడి హృదయమంతటితో ప్రభువైన యేసుక్రీస్తు నందు విశ్వాసముంచని యెడల ఆయన జీవము మనలో ప్రవహించదు.

నీవు వీధిలో నడచి పోవుచుండగా ఒక భిక్షకుడు కనబడి నిన్ను 'నాయనా!' అని పిలుచును. "ఏమి ప్రియ కుమారుడా!" అని నీవు అతనిని పలుకరించవు. ఎందుచేతననగా వానికి కావలసినది నీ విచ్చు డబ్బు మాత్రమే అని నీవు ఎరుగుదువు. హిందుస్తాని లోకోక్తి ఒకటి యున్నది. ఒకనికి యేదైనను

కావలసియుంటే ఒక గాడిదను కూడ 'తండ్రీ' అని పిలుచునట. ఇట్లే దేవుని నుండి యేదో పొందపలెనను ఉద్దేశముతో కొందరు ఆయనను 'తండ్రీ!' అందురు. వీరు అంధకారమందే జీవించుచు నిజమైన సహవాసమనగా ఏమిటో యెరుగనివారు.

మన పాపములు క్షమించబడి, మన హృదయములు శుద్ధీకరింప బడినప్పుడు దేవుని సన్నిధియందు ఉండవలెనను ఆశ మనకు కలుగుచున్నది. దేవునితో గల యీ సహవాసము వలన ఆయన జనులతో నిజమైన ఆత్మీయ సహవాసము కలిగియుండుటకు మనకు సాధ్యమగుచున్నది. ఈ దినములలో చాలామందికి "కాఫీ సహవాసము" టీ సహవాసము" కొరతగినవిగా నున్నవి. టీ యిచ్చేట్లయితే వచ్చెదరు. నీ దగ్గర టీ, కాఫీలు దొరుకకుంటే కొందరు స్నేహితులు రారు. "అంత దూరము ఒక్క కూటము కొరకు ఎవరు వెళ్ళ గలరు?" అందురు. అది ఒక టీ పార్టీ అయినచో పదిమైళ్ళ దూరమైనను పోపుటకు సిద్ధమే. నీ సంగతి కూడ యిదే అయితే నిజమైన సహవాసమంటే యేమిటో నీవు ఎరుగవు. దేవునితో నడచిన కొలది, ఆయనతో సమీపముగా జీవించుకొలది, ఆయనతో సహవాసము, ఆయన జనులతో సహవాసము అనుభవింపవలెనని ఆశించుదుము. ఈ రెండును ఒకటితో నొకటి విడదీయుటకు వీలుకాని విధమున కలిసియున్నది.

దేవుని జనులతో యిట్టి సహవాసమును తృణీకరించు కొందరున్నారు. డబ్బు ఉన్నదని గర్వించువారు యిట్లు చెప్పుదురు : "అలాంటి మనుష్యులతో ఏలాగు సహవాసము కలిగియుండడము? వాడు అధమజాతి క్రైస్తవుడు. నేను గొప్ప కులానికి చెందిన క్రైస్తవుడను" ఇతరులు అతిశయముతో – "నేను ఒక బి.ఎ. సుమా" (ఒకవేళ ఫెయిల్ అయిన వాడే కావచ్చును) లేదా "నేను ఎంతో సంపాదించుచున్నాను" అని చెప్పుదురు.

ఒకానొక ఊరిలో ఛార్లెస్ అను ఒక మనుష్యుడుండెను. అతని జీతము నెలకు 55 రూపాయలు. అతడు ఒక నర్సును వివాహము చేసికొనెను. ఆమె జీతము నెలకు 120 రూపాయలు. ఇద్దరి జీతములు కలిసి 175 రూపాయలు. ఒకనాడు వీధిలో ఇతనిని ఒకరు చూచి - "సువార్త కూటానికి రావా?" అని అడిగెను. "మీటింగుకా? ఈ మీటింగులకు రావడానికి మాకు సమయ ముండదు" అని ప్రత్యుత్తర మిచ్చెను. అయితే మనస్సులో తలంచినది ఏమనగా - "నేనొక 55రూ, నా భార్య 120రూ తెచ్చుకొంటున్నామే, ఆ బీద సన్యాసుల మీటింగులకు మేము వెళ్ళవలెనా? అక్కడికి వెళ్ళవలసిన వాళ్లు ఏమిలేనివాళ్ళే. మేమైతే చర్చికే వెళ్ళుతాము." కొన్ని దినములు గడిచిన తరువాత, ఛార్లెస్‌గారు - "దయచేసి వచ్చి నా భార్య కొరకు ప్రార్థన చేయండి' ' యని నాకు వర్తమానము పంపెను. నేనక్కడికి వెళ్ళగా అతడు కన్నీళ్ళు విడుచుచుండుట చూచితిని. అతని భార్య చాలా జబ్బుగా మంచమందెను. ఆమె పండ్ల మధ్య నాలుక గట్టిగా చిక్కుకొని అంతకంతకు ఎక్కువగా ఉబ్బు చుండెను. డాక్టరులు ఎన్ని ప్రయత్నములు చేసినను లాభము కనబడలేదు. అతడు - "నా.భార్య కొరకు దయచేసి ప్రార్థన చేయండి. ఈ నా బిడ్డలను చూడండి వాళ్ళ గతి ఏమి? అనుచు ఏడ్వసాగెను. నా మనస్సులో ఈ విధముగా తలంపులు రేగెను. - "నేను 55రూ, నా భార్య 120రూ గడిస్తున్నాము అని ఇప్పుడు అందువా? ఇప్పుడు ఏమందువంటే - "175 రూపాయలు నన్ను రక్షించునా? నా 55రూ నన్ను రక్షించునా? నా భార్య 120రూ నన్ను రక్షించునా?' '

కష్టాలు వచ్చినప్పుడే దేవుడు అవసరము. వర్ధిల్లుచున్నప్పుడు, బాగా డబ్బు సంపాదించునప్పుడు నీవు దేవుని తృణీకరించి, ఆయన మందిరమునకు దూరముగానుండి "మా వంటి ధనికులు బీదసాదలతో ఏలాగు కలియ గలము" అందువు. ఇట్టి భావము కలిగియుండుట చేత విశ్వాసులు అనేకులు

ఆత్మీయ దారిద్ర్యము పొంది, దేవుని ఎదుట బిచ్చగాండ్రుగా, దరిద్రులుగా నున్నారు. ఎందుచేతననగా సహవాసము యొక్క విలువ, శక్తి ఏమిటో ఎరుగనందున. ఇందులకే ఎందరో క్రైస్తవులు దేవుని జనుల మధ్యలో కంటె, లౌకిక స్నేహితుల మధ్యలో బహు సంతోషముగా నుండుట చూతుము. ఆత్మీయముగా ఎంతెంత పోగొట్టుకొనుచున్నారో తెలియకున్నారు. నిజమైన సహవాసములో సంతోషానుభవము పొందవలెనంటే ప్రతి విధమైన 'లోతు' నుండి విడుదల పొందవలెను; లౌకిక స్నేహము బొత్తిగా విడిచి పెట్టవలెను.

హెబ్రోను అను మాటకు విశ్వాసము అనికూడ అర్థము. యెహోషువ గ్రంధమందు కాలేబు అనబడిన ఒకరు హెబ్రోనును తనకు ఇమ్మని అడుగుట చూచుచున్నాము. అచ్చట బలాఢ్యులు నివసించుచుండిరని ఎరిగియుండియు హెబ్రోనును కోరెను. ప్రతి యొక్క రాక్షసుని మీద తనకు దేవుడు జయమునిచ్చునని అతడు విశ్వసించెను. మనము హెబ్రోనులో నివసింపవలెనంటే దేవుని యందు బలమైన విశ్వాసము కలిగియుండవలెను. ఎట్టి విశ్వాసమనగా, మార్గమందు కనబడు రాక్షసులకు భయపడని విశ్వాసము. మార్కు 11 : 23 ప్రకారము విశ్వాసము ద్వారా పర్వతములను కూడ తొలగింపవచ్చును.

మరియు హెబ్రోను ఒక ఆశ్రయస్థానముగా నుండెను. యెహోషువ 21 : 10, 11, 27లో దేవుని ప్రజలు ఆరు ఆశ్రయ పురములను ప్రత్యేకించి యుంచిరని చదువుచున్నాము. ఒకడు తెలియక ఉద్దేశింపక మరొకని చంపిన యెడల, మరణించిన వాని బంధుమిత్రాదులు అతని ప్రాణము తీయకుండునట్లు అతనికి సమీపమున ఏ ఆశ్రయపురముండెనో అందులోనికి అతడు పారిపోయి ఉండుటకు అవి ఏర్పాటు చేసిరి. ఈ ఆరింటిలో హెబ్రోను ఒకటి (యెహోషువ 20 : 3). ఇటువంటి కష్టములు ఎవరికైనను సంభవించినప్పుడు, ఆశ్రయమును,

శరణమును వారికి దొరుకును.

లోకమందు బుద్ధిహీనత వలన తెలియక పాపము చేయువారు అనేకులు గలరు. దానికి కారణములు ఇట్టివై యుండవచ్చును. ఏవో పరిస్థితులు, వారు తప్పించుకొన జాలనట్టి సంభవములు, ఏదో తప్పు చేయునట్లు శోధనలో పడుట. ఈ శోధన స్నేహితుల ద్వారానో, దుష్టులైన పొరుగువారి ద్వారానో, లేక ఏకాంతమైన స్థలమందు ఉండుట వల్లనో లేదా బీదరికము, కష్టము వల్లనో కలుగును. ఇవి కాకుండినను తమ బుద్ధిహీనత వలన, నిర్దయులగు పొరుగువారు పెట్టు శ్రమ దు:ఖము హేతువై బాధ నొందుచున్నారు. వారు ఎటు వెళ్ళినను వ్రేలెత్తి వారిని చూపి, ఈ నిర్దయులు ఇట్లు చెప్పుదురు - "అతన్ని చూడు, ఆవిడను చూడు, ఈ పని చేశాడు ( లేక చేసింది)." ఇది వారికి బాధగా నుండును. ఇట్టివారు హెబ్రోను ద్వారా నెమ్మది పొందుదురు. వారు తెలియక శోధనలో పడినందున తిరస్కరించబడుటకు కారణమాయెను. అయినను హెబ్రోనులో ప్రేమ, దయ, ప్రార్థనమూలముగా పోగొట్టుకొనిన సమస్తము తిరిగి పొందగలరు.

మనము గర్వించకుందుము గాక. అందరము పొరబాట్లు చేయగలము. అందరము సాతాను వల్ల మోసపోగలము. నీ కంటే బలహీనుడైన విశ్వాసి పాపములో పడుట చూచితావా అతనిని దోషిగా తీర్చకుము, వదలి పెట్టకుము, విడనాడకుము. ప్రేమను, దయను చూపి, సహవాసమిచ్చి, అతనిని ఉద్ధరించి మంచిదారి లోనికి తిరిగి నడిపించుము (గలతీ 6:1-3).

హెబ్రోను అను మాటకు మూడవ అర్థము ఇదే. ఆత్మీయ బలహీనతలో నున్నవారు తప్పిపోయనప్పుడుగాని, లేక అపాయమందున్న యెడల గాని వారి భారమును భరించి వేదనతో, పట్టుదలతో ప్రార్థన చేసి, ప్రేమతో, దయతో వారిని మనము పైకెత్తవలెను.

అనేక సంవత్సరముల క్రిందట ఒకరు నా యొద్దకు వచ్చి తన భార్య కొరకును, కుమార్తె కొరకును ప్రార్థన చేయుమని కోరెను. అతడు డ్యూటి (Duty) మీద ఎక్కడనో ఉండగా ఈ ఇరువురు యిల్లు విడిచి వెళ్ళిపోయిరట. "నా కాపురము చెడింది, నా కొరకు ప్రార్థన చేయండి," అనుచు అతడు ఏడ్వసాగెను. నేను ప్రార్థన చేసితిని. అతడు వెళ్ళిపోయెను. అటు పిమ్మట నాకు ఈ తలంపు వచ్చెను దు:ఖముతో పగిలిపోవుచున్న బరువైన హృదయముతో అతడు నా దగ్గరకు వచ్చెనుగాని, నేను ఒక మామూలు ప్రార్థన మాత్రమే చేసి అతనిని పంపితిని. దాని విషయమై ఒప్పింపబడి – "దేవా, సాతానుచే మోసపోయిన వారి కొరకు ప్రార్థన చేయుటకు నిజమైన భారము నాకిమ్ము. వారు రక్షింప బడవలెను" అని ప్రార్థింప నారంభించితిని. మూడు గంటలసేపు ఇట్లు ప్రార్థించుచునేయుంటిని. అప్పుడు నా ప్రార్థనకు ప్రత్యుత్తర మివ్వబడునని దేవుడు నాకు చూపెను.

మరునాటి ఉదయమే కూటము తీరిన పిమ్మట ఇరువురు సహోదరీలు నన్ను చూడవలెననుచున్నారని వర్తమానము వింటిని. ఎవరి కొరకైతే ప్రార్థన చేయుచుంటినో ఆ సహోదరీలే, వారు నా యొద్దకు ప్రార్థన నిమిత్తము వచ్చి కన్నీళ్ళతో – "బ్రదర్ సాతాను చేత మోసపోయితిమి. ఇల్లు విడిచి కొంతదూరము వెళ్ళునప్పటికి, మీ దగ్గర ప్రార్థన కొరకు వెళ్ళవలెనని అకస్మాత్తుగా మాకు తలంపు తలిగెను. ఇదిగో వచ్చితిమి. మా బుద్ధిహీనతను, పాపమును క్షమించమని దేవుని వేడండి" అని చెప్పిరి. చెడిన కాపురము సవరింపబడెను.

నశించుచున్న ఆత్మలను రక్షించు పద్ధతి వారిని నేరస్థులుగా తీర్చుట కాదు. విశ్వాసులమైన మనము కొన్ని సమయములలో బహు కఠిన హృదయులుగా నుందుము. బలహీనులైన విశ్వాసులను చూచునప్పుడు వారిని ఖండింతుము. వారి విషయము పాడు కథలు చెప్పుదుము. వారిని

గూర్చి అవమానకరముగా మాట్లాడుదుము. వారిని చూచిన పెడ ముఖము పెట్టుకొని, ఒక చిరునవ్వు అయినా నవ్వము. దృఢ విశ్వాసులు వారి యెడల కఠిన హృదయులుగా నున్న కారణముచే అనేక ఆత్మలు తప్పిపోయియున్నవి. మన ప్రభువు మంచి గొఱ్ఱెల కాపరియై యున్నాడు. తప్పిపోయిన గొఱ్ఱెల వెంటబడును. బలహీనమైన వాటిని తన భుజముల మీద మోసికొని వెళ్ళును. నీవు పోగొట్టుకొనిన సమస్తమును తిరిగి పొందవలెననిన, పడినవారికి ఆశ్రయముగా నుండుము. ప్రార్థన ద్వారా బలపరచి ప్రేమతో వారిని పైకెత్తుము.

నాలుగవదిగా, హెబ్రోను దేవుని మీద సర్వాధారమునకు సూచనగా నున్నది. దావీదు పెద్ద పొరబాటు చేసెను, దేవుని యొద్ద ఆలోచన అడుగక ఫిలిష్తీయులతో చేరెను. దాని వలన సిక్లగు కాల్చివేయబడెను. అతని భార్యలు బిడ్డలు, సామానులు, సమస్తము పోయెను. అప్పుడు పశ్చాత్తాపపడి, దేవునియందు ధైర్యము తెచ్చుకొని అమాలేకీయులను తరుమనా, వద్దా? అని ఆయనను అడిగెను. "తరుము" అని ఆయన సెలవిచ్చెను. దేవునికి విధేయుడాయెను. సమస్తమును తిరిగి తెచ్చుకొనెను. ఆనాటి నుండియు ప్రతి విషయము దావీదు ఆయన యొద్ద విచారించుచుండెను. "ప్రభువా, యూదాలోని ఏ పట్టణముకైనను వెళ్ళుదునా?" "వెళ్ళుము" అని ఆయన చెప్పెను. దావీదు మరల - "ప్రభువా ఎక్కడికి వెళ్ళవలెను?" అని అడుగగా "హెబ్రోను"కు అని ఆయన ప్రత్యుత్తరమిచ్చెను. ఇట్లు దేవుని నడుపుదల వెదకెను (2 సమూ. 5 : 19, 23, 24). ప్రతి చిన్న కార్యములో "చేయుదునా, చేయుదునా?" అనుచు దావీదు దేవుని యొద్ద విచారణ చేయుచుండెను. ఈ విధముగా దావీదు హెబ్రోను తిరిగి చేరెను. ఇచ్చట దేవుడు ఏడు సంవత్సరములు దావీదును ఉంచెను. ఎందుకనగా తన బుద్ధిమీద దావీదు ఆధారపడక కేవలము దేవుని మీదనే ఆధారపడుటకు నేర్చుకొనవలెననియే.

దావీదు ఒక గొప్పరాజు. అతడు అనేకమంది శూరులను కలిగియుండెను. తన శత్రువులైన ఫిలిష్తీయులు అతనికి విరోధముగా రాగా, "ఏమి చేయుదుము? వెళ్ళుదమా?" యని ఆ శూరులను అడుగలేదు. ప్రతి విషయము దేవునినే అడుగుచుండెను. పోగొట్టుకొనిన సమస్తమును తిరిగి సంపాదించుకొను నాలుగవ మార్గమిది.

తమ ఏర్పాట్ల విషయము దేవుని యొద్ద ఎట్లు విచారణ చేయవలెనో ఎరుగక అనేక విశ్వాసులు, దేవుని సేవకులును పెద్ద నష్టములు పొందుచుందురు. ఎప్పుడో ఒకమారు మాత్రమే వారు దేవునికి మొరపెట్టి ఆయనను ఆలోచన అడుగుదురు. వేరే సమయములంతా తమ బుద్ధిమీదనో, లేక సునాయాసముగా భర్త మనస్సును మార్చి వేయగల తమ భార్యల మీదనో ఆధారపడుదురు. భర్త ఇంటికి వచ్చి - " నా ప్రియమైన భార్యా! మీటింగులో దేవుడు నాతో మాట్లాడినాడు అని చెప్పగా, ఆమె - "బుద్ధిహీనుడవు కావద్దు, భార్యా బిడ్డల్ని మరచితివా? ఈ విధముగా దేవుడు మాట్లాడనే మాట్లాడడు" అని చెప్పును. బుద్ధిహీనులైన భర్తలు ఇట్లే దేవునికి అవిధేయులగుదురు. ఆడవారి పెత్తనానికి లొంగి భార్య మాటనే విందురు. విశ్వాసులనేకులు ఇట్లే నష్టపడి యున్నారు. దేవుని యొద్ద విచారణ చేయుటకు బదులు భార్యలు, స్నేహితులు, పొరుగువారు లేక తమ స్వంత మెదడును ఆలోచన అడుగుదురు. ఒకడు "నేనొక పట్ట పరీక్షను గెలిచినవాడను, నాకు గ్రీకు భాష, హెబ్రీ భాష ఇంకెన్నో తెలియును. ప్రార్థనలో నా సమయము ఎందుకు వ్యర్థ పరచడము? నా బుద్ధినే ఉపయోగిస్తాను" అని అనవచ్చును. మనుష్యులు అనేక పొరపాట్లు ఇట్లే చేయుదురు.

అయితే దావీదు హెబ్రోను వచ్చినప్పుడు అతడు ఖాళీ చేయబడి తగ్గించబడి, విరవబడియుండెను (2సమూ. 2:1). ప్రతి విషయములో

"వెళ్ళుదునా? వెళ్ళవచ్చునా? ఎక్కడికి? ఎప్పుడు?" అని దేవుని యొద్ద ఇట్లు అడుగుచుండెను. పోగొట్టుకొనిన సమస్తము తిరిగి సంపాదించుకొనుటకు ఇది నాలుగవ మార్గము. నీ జ్ఞానమును, నీ దేహబలమును, నీ మానవ కలిమిని నమ్ముకొనవద్దు. ప్రతి సందర్భమందును, వీటిమీద నమ్మకమును తొలగించివేసి, దేవుని కడకు పొమ్ము. నీ పైకమును నీవు ఖర్చు పెట్టు విషయమునకు కూడ ఆయన సెలవు పొందుము.

అనేక భర్తలు జీతము రాగానే దానిని భార్యల దగ్గరకు తీసికొని పోయి, "అమ్మగారూ! ఇదిగో నా జీతము" అందురు. ఒక 5రూ. ఇమ్మని అటు పిమ్మట భర్త అడిగినచో, "మొన్న నేనిచ్చిన 5 రూ. ఏమైపోయినవి?" అని అడుగగా, అతనికి ఏమి చెప్పవలెనో, నోరు రాకున్నది. ఆ భార్యయే అతనికి ఆధారము. ఆవిడనే అతని దేవత. "జీతమంతా నీ భార్య చేతిలో ఎందుకు పెట్టాలి?" అని అడిగినచో "అంతా అప్పగించకపోతే నన్ను బ్రతుకనిస్తుందా? నా జేబులన్ని తనకీ చేస్తుంది. అంతా ఇవ్వకుంటే నెమ్మది వుండదు" అని చెప్పుదురు. దేవుని చిత్తము తెలిసికొనుట అనగానేమో ఇట్టి పురుషులు ఎరుగరు. ప్రతి విషయములో దేవుని కడకు వచ్చుటకు నీవు నేర్చుకొనవలెను. సమయము, డబ్బు, బలము ప్రతిదియు ఎట్లు ఉపయోగించవలెనో ఆయనను అడుగవలెను.

ఇట్లే సంఘమునకు చెందిన ప్రతి విషయములో కూడ దేవుని చిత్తము తెలిసికొనవలెను. ముందొక అధ్యాయమందు ఈ విషయము కొంత చూచితిమి. సంఘ పెద్దలు కావలెనని అనేకులు ఆశించి ఓట్లు పొందుట కొరకు అనేక మాసములు జగడములు వేయుదురు. ఒకానొక పట్టణములో ఒక యౌవనస్థుడు - "నేనొక సంఘ పెద్దగా ఉండుటకు దయచేసి ఓటు వేయండి" అని అడుగుట చూచితిని. "సంఘ పెద్దగా ఉండటానికి ఎందుకు కోరు చున్నావు?" అని నేనడిగితిని, "ఇప్పుడున్న పెద్దలంతా ముసలివాళ్ళు, ఎందుక

పనికిరారు. నన్ను ఎన్నుకుంటే వాళ్ళనంతా గెంటేస్తాను" అనెను. అప్పుడు నేను – "ఒక పెద్దకు ఎటువంటి ఆత్మీయ యోగ్యతలు ఉండవలయునో, వాళ్ళు ఎవరో, ఏ పద్ధతిమీద పెద్దలుగా చేయబడుచున్నారో బైబిలులో నుండి ఎత్తి చూపగలవా?" అని ప్రశ్నించగా నతడు మౌనముగా నుండెను. అప్పుడతనితో – "మీ బైబిలు తీసికొనిరండి" అంటిని. నేను వరండా మీద కూర్చుంటిని, అతడు లోనికి వెళ్ళెను. ఐదు నిమిషములు, పది నిమిషములు, ఇరువది నిమిషములు గడిచెను, ఇంకను లోపలనే యున్నాడు. అతని సోదరి వచ్చి నాతో అతనికి సిగ్గుపడకుండ అతనికి బైబిలే లేదు' అనెను. బైబిలు లేనివాడు, బైబిలులో ఏమున్నదో ఎరుగనివాడు సంఘ పెద్దగా ఉండవలెనని కోరెను.

ఇట్టి కమిటీ మెంబర్లు, పెద్దలు నెలకొకసారి కూడుకొనునప్పుడు మీటింగు ప్రారంభించే ముందు ఒక చిన్న ప్రార్థన చేయుదురు. "పాస్టర్ గారూ క్లుప్తముగా ఒక ప్రార్థన చేస్తారా?" అని అడుగుదురు. ఆ ప్రార్థన తీరిన పిమ్మట మాటలతో చెప్పకున్నను, వారి కృత్యములలో ఇట్లందురు – "యేసుక్రీస్తు ప్రభువా! నీవు వినరాని విషయములు మేము జగడము చేయబోవుచున్నాము. కనుక దయచేసి ఇక్కడ నుండి బయటకు వెళ్ళండి. ఇక్కడి డబ్బు విషయాలు మీరు తెలిసికొనరాదు. మాకు మీరు అవసరము ఉన్నప్పుడు తిరిగి మిమ్ముకు పిలుస్తాములే." మూడు గంటలసేపు – "ఆ 5 రూపాయలు (లేక 2, లేక 1) ఏలాగు ఖర్చు పెట్టితివో చెప్పు, దాని లెక్క దయచేసి అప్పగించు. దేనికి ఆ పైకము ఖర్చు పెట్టితివో, ఆ బిల్లు ఇక్కడ చూపించుము" అని జగడములు చేయుదురు. జగడములు తీరిన తరువాత "యేసు ప్రభువా! ఇప్పుడు లోనికి రండి, మేము ఇండ్లకు పోవడానికి సిద్ధముగా వున్నాము. ప్రభువా! మమ్ము దీవించు." ఎంత హేళన!

అనేక సంఘములలోని నిష్ఫలితము, మరణము దీని వలననే. సంఘ

పెద్దలు అనబడు వారికి ప్రార్థన చేయుట ఎట్లో తెలియదు. దేవుని చిత్తము తెలిసికొనుట ఎట్లో తెలియదు. అయినను సంఘమును పాలించవలెనని, నడుపవలెనని కోరుదురు. వారికి కావలసినదంతయు ఘనత, పేరు, కీర్తి, డబ్బు ఇంతే.

హెబ్రోనులో వ్యక్తిగతముగాను, గుంపుగాను, ప్రతి కార్యము, ప్రతి పనియు - మేము ఏమి చేయవలెను? ఎక్కడ పోవలెను? అని దేవుని యొద్ద అడిగి తెలిసికొనవలెను.

మరొక సంగతి ఏమనగా, అనేకులు వివాహ విషయము దేవుని చిత్తము ఎట్లు తెలిసికొనవలెనో యెరుగకుండుట చూచితిమి. పెండ్లి కుమారుని లేక పెండ్లి కుమార్తెను కుదుర్చుకొనిన పిమ్మటనే, "పాస్టరుగారూ! వచ్చి ప్రార్థన చేయండి" అందురు. వధువును వెదకునప్పుడు ఆమెకు ఉండవలసిన యోగ్యతలను ఒక పట్టీ మీద వ్రాసికొందురు. ఆ బాలుడు మెట్రికులో ఫెయిల్ అయియున్నను. బాలిక గ్రాడ్యుయేట్‌యై యుండవలెను. వానికి ఉద్యోగము లేకున్నను ఆమె టీచరుగా సంపాదించి అతనిని పోషించవలెను. అతడు కుందమసి యంత నలుపు అయినను ఆమె సువర్ణరంగుగా నుండవలెను. ఆమెకు సంగీత వాద్యములు రావలెను. కొన్ని కొన్ని ప్రాంతములలో వధువు యొక్క ముఖ అంద చందములు కోరరు. ఆమె 5,000 లేక 10,000 రూపాయల కట్నము తెచ్చిన అంతే చాలును. కావలసినది డబ్బు, దేవుని చిత్తము కాదు. దేవుని యొద్ద విచారణ చేయుట యేమో ఎరుగకుండుటచే విశ్వాసులనేకులు ఈ విధముగా చెడిపోయెదరు. వారి కాపురములు పాడగును. దావీదు విషయమైనను అంతే. అతడు అనేక సంవత్సరములు బాధపడిన తరువాతనే - "ప్రభువా! నేను వెళ్ళవచ్చునా? వెళ్ళనా?" అని అడుగు పాఠము నేర్చుకొనెను.

## 11వ అధ్యాయము

# దేవుని దైవ నియమములు

విశ్వాసులమైన మనకు అధికముగా బాధపడుటయు, అనేక నష్టములు పొందుటయు సంభవించును. ఇవి అనేకముగా మన బుద్ధిహీనత, తప్పిదముల వలన మనమే తెచ్చుకొనుచున్నాము. అయినను దైవ నియమములకు లోబడగా పోయినవన్నియు తిరిగి తెచ్చుకొనవచ్చును.

దావీదు స్వంతముగాను, దేశ సంబంధముగాను పోగొట్టుకొనిన సమస్తమును, కొన్ని దైవ నియమములను అనుసరించుట ద్వారా తిరిగి తెచ్చుకొనగల్గుటకై దేవుడు అతనిని హెబ్రోనుకును, సీయోనుకును యెట్లు తెచ్చెనో యనునది మనము చూచుచుంటిమి.

హెబ్రోనులో యేడు సంవత్సరములు ఆరు మాసములు నివసించిన పిమ్మట దావీదు సీయోనుకు వచ్చెను. హెబ్రోను అనగా సహవాసము అని చూచియుంటిమి. ఆ సహవాసము యొక్క సంపూర్ణ అర్థము నేర్చుకొనుటకు దావీదు దేవునిచే ముందుగనే హెబ్రోనులో స్థిరపరచబడెను. హెబ్రోను తరువాత దావీదు సీయోనుకు తేబడెను. సీయోను గురించిన యేడు విషయములు నేర్చుకొనవలసి యున్నది. ఇవి నీవు నేర్చుకొనుచుండగా సీయోనుకు వచ్చుట యెట్లో మరియు సీయోనులోని సహవాసము ద్వారా, నష్టపోయిన వాటినెల్లను

తిరిగి సంపాదించుకొనుట యెట్లో తెలిసికొందువు (2 సమూ. ..,7,10).

యెరూషలేముంుండి యెబూసీయులను బెన్యామీను గోత్రపువారు వెళ్ళగొట్టక పోవుటవలన, సీయోనును వారు ఆక్రమించుకొని యుండిరి. ద్వితీయో. 7లో చెప్పిన ప్రకారము ఇశ్రాయేలీయులు వాగ్దాన భూమియందు నివసించుచుండిన యేడు జనాంగముల వారినందరిని పారద్రోల వలసియుండెను. మరియు వీరితో యే నిబంధనగాని, యే వివాహ సంబంధముగాని చేసికొనరాదు. ఇదియు గాక వారి బలి పీఠములను, విగ్రహములను పడగొట్టి, ఈ జనాంగములు అక్కడ పూర్వము నివసించి యుండినట్లు గుర్తు లేవియు లేకుండ చేయవలెను. ఇశ్రాయేలీయులు తమ మానవ బుద్ధిని ఉపయోగించుటచే దేవుని యెడల తప్పిపోయిరి. ఆ యేడు జనాంగములు కూడ అక్కడనే వుండిపోయి ఇశ్రాయేలు ప్రజలకు అధిక నష్టము కలిగించిరి.

2 సమూయేలు 5లో దావీదు సీయోనును యెబూసీయుల వశమునుండి తీసికొని ఆ నగరమందు తన సింహాసనమును స్థాపించుట చదువుచున్నాము. అయ్యో! దావీదు గర్వించి అంధుడాయెను (2 సమూ. 24 : 1-10). ఈ పాపపు గర్వము వలన జనులను లెక్కించెను. ఈ కారణమున దేవుడు అతనిని శిక్షింపవలసి వచ్చెను.

గర్వమును మించిన పాపము ఇంకొకటి లేదు. గర్వము వలన విశ్వాసులనేకులు పెద్ద పెద్ద నష్టములు పొందియున్నారు. మంచి విశ్వాసులే కావచ్చును. దేవుని వాక్యమును తెలిసికొనినవారే, నమ్మినవారే, దేవుని సేవ కొరకు గొప్ప త్యాగములు కూడ చేసినవారే. ఇంతటి ఆసక్తి గలిగియుండినను ఒక పెద్ద లోపము వారిలో నున్నది. ఏమనగా, గర్వము. ప్రజలను లెక్కింప వలదని యోవాబు చెప్పినను వినక దావీదు తన మాటయే చెల్లునట్లు చేసెను. దేవుడు దావీదును శిక్షింపవలసి వచ్చెను. అటు తరువాత ప్రవక్త ఆజ్ఞ ప్రకారము

అరౌనా కళ్ళము యొద్దకు దావీదు పోయి అక్కడ దేవునికి ఒక బలి పీఠమును నిర్మించెను. ఇట్లు చేయుట వలన దేవుని ఆలయము కట్టబడవలసిన స్థలమును కనుగొనెను.

దావీదు సీయోనులో వున్నాడు గాని, యే గొప్ప సంకల్పము నిమిత్తము దేవుడు అతనిని అక్కడికి తెచ్చెనని ఎరుగడు. తన మహిమను దేవాలయములో ప్రత్యక్ష పరుచుకొను నిమిత్తము ఆ దేవాలయము నిర్మింపబడవలసిన స్థలము దావీదుకు చూపుట కొరకే దేవుడు అతనిని తెచ్చెను. సీయోను విషయమైన మొదటిదైన నియమము యిదే. దేవుని ఆలయము ఉండవలసిన స్థలమది. ఆయన నివాస స్థలము యొక్క ఉనికి మనము చూడవలెననియే మనలను దేవుడు సీయోనుకు తెచ్చును. సంపూర్ణముగా విరువబడి, తగ్గింపబడిన తరువాతనే దావీదు ఆ స్థలమును కనుగొనెను.

ఈ ఒక్క పాఠము నేర్చుకొనుటకు మనకు అనేక సంవత్సరములు పట్టును. మనకు ఎన్నో యోగ్యతలు వుండినను, మన గర్వము వలన ఆటంకపరచబడి, మనలను దేవుడు ఉపయోగించు కొనజాలక యున్నాడు. ఎందరికో యెన్నెన్నో యీవులు దేవుడు యిచ్చినను వారి గర్వము వలన ఆ యీవులు పనికిరానివై యున్నవి. కొందరు కారణము యెరిగియున్నారు, కొందరికి అది కూడ తెలియదు.

మనస్థితి మనము చూచునట్లు అనేక సాధనములను దేవుడు ఉపయోగించవచ్చును. దేవుడు యెరూషలేము మీద ఆ తెగులును పంపిన తరువాతనే దావీదు తన పాపమును చూడగలిగెను. అప్పుడు దావీదు తన్ను దేవుడు సీయోనుకు తెచ్చుట - ఆయన బలిపీఠము కొరకును, ఆ తరువాత ఆయన ఆలయము కొరకును ఒక స్థలము ఆయనకు కావలసి యుండినందుననే యని చూచెను.

దేవుడు తన కార్యమును తన పద్ధతి ప్రకారమే చేయును. మన పద్ధతి ప్రకారము కాదు. "గాలి దానికి యిష్టము వచ్చిన దిక్కు వీచును" కొన్ని స్థలములలో యెన్ని యేండ్లు పని చేసినను ఫలితము కానరాదు. మరికొన్ని స్థలములలో కొద్దికాలమే పనిచేయునంతలో అధిక ఫలములను చూతుము. యేల? ప్రతి స్థలము విషయము దేవునికి ఒక సమయము గలదు. అది యెరుగక మనము సమయము, శక్తి యెంతగానో వృథా పరచుదుము.

ఉదాహరణముగా హైదరాబాదులోని సేవను చూడుడి. స్నేహితులనేకులు రమ్మని మమ్మును పిలుచుచుండిరిగాని దేవుడు సెలవీయలేదు. హైదరాబాదుకు బహు సమీపముగా వచ్చితిమి గాని, అక్కడికి పోవుటకు మాకు స్వాతంత్ర్యము లేకపోయెను. దేవుని సమయము రాగా మేము బలమైన సమాధానము పొంది ఇట్లంటిమి - "ఇదే హైదరాబాదుకు దేవుని సమయము." దేవుని యొద్ద కనిపెట్టిన పిమ్మట మేమొక స్థలమునకు వెళ్ళినప్పుడు, అక్కడ సేవ ప్రారంభించుటకు అదే దేవుని సమయమని ఎన్నో మారులు కనుగొంటిమి. మాకు ముందుగా దేవుడే వెళ్ళి యుండెను, యెరికో ప్రాకారములు పడిపోయినట్లుగానే యుండెను. దేవుడు తన సంకల్పములను తన పద్ధతి ప్రకారమే నెరవేర్చుచుండుట చూచితిమి.

దేవుని మార్గములోనికి మనము ముందుగా తేబడవలెను. సీయోను విషయము మనము ముందుగా నేర్చుకొనవలసినది ఇదే. రెండవదిగా, ఆయన సేవ చేయుటయందు మన జ్ఞానము, బలము, తెలివితేటలు, మన యోగ్యతల మీద ఆధారపడుట పనికిరాదని నేర్చుకొనవలెను. దేవుని మీద పూర్తిగా అనుకొనిప్పుడే, దేవుడు నియమించిన స్థలము కనుగొందుము. తన శక్తి ప్రభావములను మనకు ప్రత్యక్షపరచుటకే దేవుడు తనకు కావలసిన స్థలమును ఏర్పరచుకొనును.

2. మాదిరి (1 దినవృత్తా. 28 : 12)

ఆలయము నిర్మింపబడవలసిన స్థలమును దేవుడు దావీదుకు కనుపరచిన పిమ్మట, దాని మాదిరిని వ్రాత మూలముగా ఆయన దావీదుకు యిచ్చెను.

ఇదే సీయోను విషయమైన రెండవ దైవ నియమము : మన స్వంత జీవితము, కుటుంబ జీవితము, సంఘ జీవితము యొక్క పరలోకపు మాదిరి. విశ్వాసులైన ప్రతి యొక్కరికి దేవుడు ఒక పరలోకపు మాదిరి లేక నమూనాను కలిగియున్నాడు. దానిని మనము తెలిసికొనవలెనని కోరుచున్నాడు. దేవుని ఆలయము యొక్క వునికిని ప్రత్యక్ష పరచిన పిమ్మట దేవుడు తనపని చేయ నారంభించుచున్నాడు. ఇట్లు మన జీవితము యొక్క సంకల్పము మనకు తేటగా కనబడుచున్నది.

తమ జీవితము విషయము దేవుడు ఏమి ఏర్పాట్లు చేసియున్నాడో తెలియని వారనేకులు గలరు. నిశ్చయత ఎరుగక జీవించుచు, దేవుని ఏర్పాటు తెలియక ఎడుటచే ఇక్కడ అక్కడ తిరుగుచు పెద్ద నష్టముపొందుదురు. అయినను ప్రతి యొక్కరి వ్యక్తిగత జీవితమునకును, కుటుంబ జీవితమునకును, సంఘ జీవితమునకును ఒక పరలోక విధమైన ఏర్పాటు కలదు.

ఇందు నిమిత్తమే మనము సీయోనుకు రావలెను. దేవుని ప్రజల తోటి సహవాసము ద్వారా మనము ఆయన యొక్క ఏర్పాటును సులభముగనే తెలిసికొనగలము. దేవుని మందిరముతో సంబంధము లేక జీవించువారు దేవుని ఏర్పాటు తెలిసికొనుట కష్టము. వర్తమానము వినుట కొరకే దేవుని మందిరమునకు వచ్చినట్లయిన ఆ వర్తమానము ఎంత మధురముగా నుండినను, ఆయన ఏర్పాటును కనుగొనజాలవు. దేవునితో సహవాసము ఆయన ప్రజలతో సంపూర్ణ సహవాసము, ఈ రెండును నీవు పొంద నేర్చుకొనని యెడల దేవుడు

తన పరమ ఏర్పాటును నీకు యివ్వలేడు. ఈ రెండంతల సహవాసము కలిగియున్నప్పుడు దినదినము దేవుని ఏర్పాటు చూచుచు యిట్లనగలుగుట ఎంతో భాగ్యము - "ఈ దినము నన్ను ఇక్కడ వుంచుట దేవుని చిత్తము, దేవుడు నన్నుయిక్కడకు తెచ్చె"నని నేనెరుగుదును. అయన నాతో 'ఈ దినము ఇక్కడికి వెళ్ళు రేపు అక్కడికి వెళ్ళు' అని చెప్పుచున్నాడని నేనెరుగుదును. ఇదే మన అనుదిన అనుభవముగా నుండవలెను. ఎప్పుడో ఒకసారి కాదు. ఇది మరువవద్దు, దావీదు యిదెరిగిన పిమ్మటనే అతనికి దేవుడు పరలోకపు మాదిరిని యిచ్చెను.

### 3. సామగ్రి (1 దినవృత్తా 26 : 27)

యుద్ధములలో పట్టుకొని తెచ్చిన కొల్ల సొమ్ము యెహోవా మందిరము కట్టించుటకై ప్రతిష్టించిరి. మూడవ దైవ నియమము సామగ్రిని సేకరించుట. దేవుని మందిరము యొక్క మాదిరి యివ్వబడిన తరువాత దానిని అమలులో పెట్టుటకై సామానులు ఆయనకు కావలసియుండెను. ఒక మట్టిగోడ నీవు కట్టవలెనంటె నీకు మట్టి అవసరము, లేక గట్టిగోడ కట్టవలెనంటె, గట్టి పదార్థములే వుండవలెను, దేవుని మందిరమును నిర్మించుటకును యిదే సూత్రము. ఇది నీవు నేర్చుకొనిన యెడల ఆయనకు యెట్టి సామానులు అవసరమో అప్పుడు తెలిసికొందువు.

దేవుడు దావీదుకు మాదిరిని చూపగా దేవునికి అవసరమైనవి ఏవో దావీదు గ్రహించి, తన ప్రతి యుద్ధములోను ఆ పదార్థములను కొల్లగొట్టుచుండెను. 1 దినవృత్తా 29:1,2లో మనము చూచునట్లు బంగారు, వెండి, ఇత్తడి మొదలైన సరుకులు ఆయన మందిరమునకు కావలెనని ఎరిగి దావీదు వీటిని సేకరించెను.

మన సంగతి చూడగా జీవితకాలమందు ప్రతిదినము, ప్రతివారము

ఆయుష్కాల మంతయు మనము ఎన్నో యుద్ధములు ఎదుర్కొనవలసి యున్నది. మన స్వంత జీవితములలోనే అనేక పోరాటములు యుద్ధములు జరుగుచున్నవి. శత్రువుల ద్వారాను, కొన్ని సమయములలో పేదరికము, మరియు వేరే సమస్యల ద్వారాను ఈ యుద్ధములు మన మీదికి వచ్చుచున్నవి. దేవుని మందిరములోనికి తేవలసిన సామాగ్రిని మనము తెచ్చు నిమిత్తము, ఈ పోరాటములను మన జీవితములోనికి దేవుడు రానిచ్చుచున్నాడు. దండిగా కొల్లగొట్టుకొనుటకై దావీదు అనేక యుద్ధములు చేయవలసివచ్చెను. దేవునికి తన మందిరము నిమిత్తము ఆయన ఏర్పాటు ప్రకారము సామానులన్నియు అర్పింప గలిగినందులకు దావీదు బహుగా సంతోషించెను. దేవుని ఏర్పాటులో యున్నట్లయితే పరీక్షలు, కష్టములు ఎన్ని వచ్చినను నిరుత్సాహపడవు. నీ కష్టములు ఎంత బాధకరముగా నుండినను వీటి ద్వారానే దేవుని మందిరము కొరకు సామగ్రిని నీవు సమకూర్చు నిమిత్తము వాటిని దేవుడు రానిచ్చెనని ఎరిగి అధైర్యపడకుందువు. ఆ మందిరము నిమిత్తము సరకులు సమకూర్చుటకు దావీదుకు అనేక సంవత్సరములు పట్టెను. మనకు జీవిత కాలమంతయు కూడ పట్టవచ్చును. మనము పరలోకమునకు వెళ్ళి పరమ యెరూషలేమును చూచినప్పుడే మనము ఏమి సేకరించితిమో ఎంత మట్టుకు సేకరించితిమో తెలిసికొనెదము.

### 4. నేర్పరియైన శిల్పకారుడు
### (2 దినవృత్తా. 28 : 9, 1 కొరింథీ. 3 : 10)

మందిరము కట్టవలసిన స్థలమును దావీదు కనుగొనెను. దేవాలయము యొక్క మాదిరి పొందెను, సామానులన్నియు సమకూర్చెను, ఇప్పుడు నేర్పరియైన శిల్పకారుడు కావలసియుండెను.

ఒక కట్టడము నిర్మించుటకు ఇక ఇంజనీర్ వుండవలెను. ఆ సర్వ కట్టడము విషయమైన పూచి ఒకనిమీద నుండవలెను. కట్టడము యావత్తు

నమూనాను అనుసరించియే లేచుచున్నదని అతనికి నిశ్చయత కలుగవలెను. అట్టివాడు దావీదుకు కావలసియుండెను. ఎలననగా దేవుని మందిరము బహు గొప్పదైనందున దానిని సామాన్యులు కట్టజాలరు. దావీదు సొలొమోనును పిలిచి, ఇట్లనెను! "నా కుమారుడా సొలొమోను! దేవుడు తన మందిరము కట్టుటకు నిన్ను ఏర్పరచుకొన్నాడు, నిన్నే. ధైర్యముతో ఆ పనిచేయుము, మాదిరి యిదిగో, సామానులు అవిగో, ఇక ఆ మందిరమును కట్టుచు ముందుకు సాగిపొమ్ము." ఇట్లు సొలొమోను ఒక నేర్పరియైన శిల్పకారుడాయెను.

క్రొత్త నిబంధనలో చూడగా అపొస్తలుడైన పౌలు ఒక నేర్పరియైన శిల్పకారుడై దేవుని ఏర్పాటును నెరవేర్చెను. సీయోను విషయమైన నాల్గవ దైవ నియమము యిదే. మనలను దేవుని ఏర్పాటులో అమర్చుటకు మనకొక నేర్పరియైన శిల్పకారుడు కావలెను. పట్టిబోధ ఏమియు నెరవేర్చదు. దేవుని నమూనా ప్రకారము మనలను కట్టుటకు మనకు అపొస్తలులు, ప్రవక్తలు, బోధకులు, కాపరులు అవసరము (ఎఫెసీ 2:20). ఆది సంఘమందు నమ్మకమైనట్టి ఈ భక్తులు ఇక్కడకు, అక్కడకు వెళ్ళుచుండిరి. వారి యొక్క నమ్మకత్వము చేత దేవుని పని ఒక బలమైన పునాదిమీద కట్టబడెను. ఏ కాలమందైనను యిట్లే జరుగును. దేవుని పని బలముగాను, స్థిరముగాను వుండవలెనని కోరినట్లయితే దానికి దేవునిచే ఏర్పరచుకొనబడిన పాత్రలు, అనగా దేవుని చిత్తమును, ఆయన ఏర్పాటును నెరవేర్చువారు, నమ్మకముగా నుండువారు కావలెను.

దేవుడు సొలొమోనును యేర్పరచుకొనినప్పుడు తనకు జ్ఞానము నొసగుమని సొలొమోను ఆయనను వేడెను (1 రాజులు 3:5,9). దీని వలననే అతడు నేర్పరియైన శిల్పకారుడాయెను. మంచిచెడ్డలను గుర్తించు నిమిత్తము దైవజ్ఞానము గ్రహింపగల హృదయము నిమ్మనెను. ధనముగాని, దీర్ఘాయుషును గాని, ఆరోగ్యముగాని ఇమ్మనక ఒక నేర్పరియైన శిల్పకారుడగుటకై దైవజ్ఞానము

కోరెను.

దైవజ్ఞానము కలిగినవారు ఆ జ్ఞానము ద్వారా దేవుని మనస్సు దేవుని తలంపులు తేటగా తెలిసికొందురు. దేవుని పని నెమ్మదిగా సాగిపోవలెనంటే ఆపొస్తలులు కలిగియుండిన దూరదృష్టియు, అనుభవమును కలిగినవారై యుండవలెను.

5. నేర్పరులైన పనివాండ్రు (1 రాజులు 5:1,6,18)

ఐదవదిగా సొలొమోను రాజు తన రాజ్యమందు విస్తారమైన ధనము, సామగ్రి ప్రవీణులైన పనివాండ్రు వుండినను దేవుని మందిరమును నిర్మించుటకు వీరు చాలరని అతడు ఎరిగియుండెను. అందుచేత తూరు రాజైన హీరాముకు యిట్లు వ్రాసెను - "లెబానోను నుండి నాకు దేవదారు వృక్షములను పంపుము. మరియు కలపపని, రాతిపని చేయుగలిగినట్టి పనివాండ్రను కూడ పంపుము".

దేవుని పనికి పలువిధములైన పనివాండ్రు కావలసియున్నారు. లోకమంతట ప్రతి భాగమునుండి ప్రవీణులైనవారు ఆయనకు అవసరము. కర్రపని, రాతిపని చేయుటకై నానాభాగములనుండి పనివాండ్రను సొలొమోను తెచ్చుకొనినట్లు, ఏ ఒక్క దేశమైనను స్వయముగా దేవుని మందిరమును నిర్మింపజాలనందున మనకు లోకమంతటి నుండి స్త్రీ, పురుషులు అవసరమైయున్నారు. అనగా లోకమంతటి నుండి కలప, రాళ్ళు తేబడవలెను. ఇది సీయోను విషయమైన ఐదవ నియమము. ఎప్పుడైతే దేవుని మందిరమును కట్ట ప్రారంభించెదమో అప్పుడు మాత్రమే ఎంతగా లోకమంతటినుండి జత పనివారు అవసరమై యున్నారో గ్రహించెదము. అలాగు చేసినప్పుడు పని నిరాటంకముగా సాగిపోవును.

6. పొందిక, ఐక్యత (1 రాజులు 6:7)

అరవదిగా, అంత పెద్దరాళ్ళను, అంత విస్తారమైన కలపను అంత గొప్ప దూలములను ఉపయోగించి ఆ మందిరమును కట్టుచుండినను, ఏ పనిముట్టు యొక్క శబ్దమైనను ఆ దేవాలయమందు వినబడకుండెను. ప్రతివానికి తాను చేయవలసిన పని మరియు దేవుని నమూనా తెలిసియున్నందున ఆ పనివాండ్రు తమ తమ పనులను నెమ్మదిగాను నిరాటంకముగాను చేయుచు వెళ్ళిరి. కొండలో నుండి రాళ్ళు తొలుచుచున్న పనివాండ్రు అక్కడనే ఆ రాళ్ళను సిద్ధపరచుచుండిరి. ఎంత నమ్మకముగా ఈ రాళ్ళను తయారు చేయుచుండిరనగా వాటిని దేవాలయమునకు, తీసికొని వచ్చినప్పుడు దేని స్థలమందు అది సరిగా సరిపోయెను.

మనము దేవుని ఏర్పాటు ఎరిగియుండి, పరలోకపు సామగ్రిని, నేర్పరియైన శిల్పకారుని, సిద్ధపరచబడిన జతపనివారిని కలిగియుండిన యెడల, దేవుని పని నెమ్మదిగాను నిరాటంకముగాను సాగును. ముందుగా ఏర్పాటు లేనిచోట జగడములు, పోరాటములు, కొట్లాడు కొనుటయు మిక్కుటముగా నుండును. దేవుని పని సంపూర్ణ ఐక్యతతోను పొందికతోను జరుగవలెననినచో, దేవుని యేర్పాటు తెలిసికొనుట అత్యంత అవసరము.

7. దేవుని మహిమ (2 దినవృ. 7:1,2)

ఏడవదిగా, సొలొమోను ప్రార్థన ముగించినప్పుడు, దైవాగ్ని దిగి దహనబలులను, బలి అర్పణలను దహించివేసెను. దేవుని తేజస్సుతో మందిరము నిండెను. పని పూర్తియైన తరువాతనే దేవుని తేజస్సు దిగివచ్చెను. దేవుని పని పూర్తి చేసినప్పుడే మనము కూడ ఆయన మహిమను చూతుము. పూర్తి చేయబడని పని దేవుని మహిమార్థము కాజాలదు. గుడారము పూర్తి కాగానే దేవుని తేజస్సు దిగెను. దేవాలయ విషయము కూడ యింతే. పని పూర్తి అయినప్పుడు, పరమ యేర్పాటు నెరవేరబడినప్పుడు దేవుని మహిమ దిగివచ్చెను. ఆయన మాట్లాడుటకును తన్ను తన సంపూర్ణతతో ప్రత్యక్షపరచుకొనుటకును

ప్రారంభించెను. రాజ్యమంతయు, దేశమంతయు ఆనంద సంతోషములతో నిండెను ( 2 దినవృ. 7:8 11). ఆ సంతోషమందు ప్రతివారికి భాగము దొరికెను. దేవుడు మాట్లాడ మొదలిడి యిట్లనెను – "నేను నీ విన్నపము నంగీకరించి, యీ స్థలమును నాకు బలులు అర్పించు మందిరముగా కోరుకొంటిని . . . . . . . నా దృష్టియు నా మనస్సును నిత్యము దానిమీద నుండును" (12-16 వచనములు). తన సంపూర్ణతయందు యీ విధముగా దేవుడు వారితో నివసించుటకు వచ్చెను. తన ప్రజలందరికి తన్ను తాను ప్రత్యక్షపరచుకొను నిమిత్తమే తన సంకల్పమునందు దేవుడు దావీదును సీయోనుకు తెచ్చెను.

సీయోను విషయమైన ఏడు దైవ చట్టములు లేక నియమములను మరల చెప్పెదను. 1. దేవాలయమ కొరకు దేవుడు ఏర్పరచిన స్థలమును కనుగొనుట. 2. దేవాలయము యొక్క పరలోకపు మాదిరి. 3. దేవాలయము కట్టుటకు సామగ్రి. 4. కట్టడము యావత్తు పనిని చూచుకొను బాధ్యతగల నేర్పరియైన శిల్పకారుడు. 5. ప్రపంచమంతటి నుండి ప్రవీణులైన పనివాండ్రు అవసరమైయుండుట. 6. పొందికతోను, ఐక్యతతోను సమస్త కార్యములు నిరాటంకముగా జరిగించుట. 7. దేవుని మహిమ దిగివచ్చి మందిరమును నింపుట. అప్పుడే సీయోనులో దేవుని సంకల్పము నిజముగా నెరవేరెను. ఎందుకనగా అక్కడ దేవుడు ప్రత్యక్షపరచబడి మహిమలో యేలెను.

# 12వ అధ్యాయము

# దేవుని శక్తి గలవారమై యుండుటలోని రహస్యము

మనము ఆత్మీయముగా పోగొట్టుకొనిన వాటిని తిరిగి ఎట్లు పొందగలమో దేవుని వాక్యము నుండి మనము యింతవరకు చూచుచుంటిమి. ఇట్లు తిరిగి తెచ్చుకొనుట హెబ్రోను సీయోనుల అనుభవము ద్వారా జరుగునట్లుగా, దేవుని యేర్పాటై యున్నదని కూడ చూపించియున్నాము. హెబ్రోను మొదట దేవునితోను, పిమ్మట తోటి విశ్వాసులతోను మనకు గల సహవాసమును గూర్చి మాట్లాడుచున్నది. సీయోను దేవుని పరలోకపు లేక ఆత్మీయ మందిరమును గూర్చి మాట్లాడుచున్నది. ఈ ఆత్మీయ మందిరము యేమైయున్నదని మనము గ్రహించిన కొలది అంతకంతకు మనము పోగొట్టుకొన్న వాటిని తిరిగి పొందగలము. అడుగు మీద అడుగువేసినట్లు దేవుడు దావీదును సీయోనుకు యెట్లు నడిపెనో చెప్పియుంటిమి. ఏలయనగా అతడు సీయోనుకు తేబడినప్పుడే ఇశ్రాయేలీయులు పొందిన నష్టములు వారు తిరిగి పొందిరి. దేవుడు అజ్ఞాపించిన రీతిగా సొలొమోను దేవాలయము కట్టినప్పుడు, తన సంపూర్ణ మహిమతో దేవుడు సీయోను లోనికి వచ్చెను. మునుపటికంటె స్పష్టముగా ఆయన ఆ జనాంగముతో మాట్లాడ మొదలు పెట్టెను. సమస్తమైనవారు బహు ఉత్సహించి సంతోషించిరి. గొప్ప నిరీక్షణతో దేవుని మందిరములోనికి వచ్చిరి. దేవుడు వారికి

ఎంతో వాస్తవికమైన వాడైనాడని సామాన్య భాషలో చెప్పవచ్చును.

కీర్తన 87 : 2 నుండి సీయోను విషయము కొంత ఎక్కువగా తెలిసికొనుచున్నాము : "యాకోబు నివాసములన్నిటికంటే సీయోను గుమ్మములు యెహోవాకు ప్రియములై యున్నవి."

## యాకోబు నివాసములు

యాకోబు దేవుడేర్పరచుకొనిన మనుష్యునికి సూచనగా యున్నాడు. యాకోబుకు బుద్ధిహీనతలు, లోపములు, బలహీనతలు అన్నియుండినను దేవుడు అతనిని ఏర్పరచుకొనెను. అయినను ఎన్నో అనుభవములు అనుభవించిన తరువాతనే తన విషయమైన దేవుని సంకల్పమును గ్రహించ గలిగెను. ఎట్టి ఆశీర్వాదములనైతే దేవుడు యాకోబు కిచ్చుటకు సంకల్పించి యుండెనో వాటిని తన స్వంత ప్రయత్నముల ద్వారా యిరువది యేండ్లకు పైగా ప్రయత్నించి యాకోబు పొంది అనుభవించగోరెను. బాల్యమునుండి జ్యేష్ఠ పుత్రుని యొక్క భాగమును గూర్చి ఇస్సాకు తనతో చెప్పుట వినుచు, తల్లి సహాయముతో తండ్రిని మోసగించి, దానిని తాను పొందజూచెను.

మామగారి యింట వున్నప్పుడు కూడ యిట్టి ప్రయత్నములే చేయుచుండెను. మామగారి యిల్లు విడిచి వెళ్ళునప్పుడు సంతోషము లేనివాడుగా నుండెను. పశువులు, ధనము అపారముగా కలిగియుండినను భయముతోనే యుండెను (ఆదికాండము 37). కీర్తన 87 : 2 లో "యాకోబు నివాస స్థలములన్నియు," యేమి తెలుపుచుండెననగా యాకోబు స్వయముగా చేసిన కార్యములన్నియు, స్వప్రయత్నములు, తన స్వంత పోరాటములు, యుద్ధములు యింకను దేవుని ఆశీర్వాదము పొందుటకై తాను మానవరీతిగా పడిన యితర పాట్లు, మానవ పద్ధతులలో జ్యేష్టుని భాగము పొంద యత్నించుచుండెను.

ఇట్టివారు విశ్వాసులలో గూడ నున్నారు. మానవ ప్రయత్నములతో దేవుని ఆశీర్వాదములను అనుభవింపజూతురు. దేవుని పరిచర్య మానవ

జ్ఞానముతో చేయజూతురు. తుదకు నిష్ఫలితము లభించెను. సంవత్సరముల కొలది బైబిలు చదువుదురు. మానవ జ్ఞానము ద్వారా వాక్యమును గ్రహింపజూతురు. వారి జీవితములు వారి అపజయమును తెలుపుచున్నవి. దేవుని సేవలో ఎంతో డబ్బు ఖర్చు చేయుదురు. అయినను ఫలితము కనబడదు. గంటల కొలది ప్రార్థన చేయుదురు. అయినను ప్రార్థనలకు జవాబు పొందుట లేదు. దేవుని నిమిత్తము బాధలు సహింతురుగాని జీవితములు సంతోషము లేనివైయున్నవి. ఏల? యాకోబువలె తమ స్వంత ప్రయత్నములతో సమస్తము చేయజూచుచున్నారు. మానవ యత్నములు, మానవ పద్ధతులు, మానవ జ్ఞానము మొదలగువాటితో పరలోక ఆనందము పొందజూచుచున్నారు. ఇట్టివారు "యాకోబు నివాసముల" లో జీవించినట్లే అయెను.

## సీయోను గుమ్మములు

"సీయోను గుమ్మములు" (వ. 1). దేవుని ప్రేమ సీయోను వైపుగా నున్నది గుమ్మము అనునది లోపలికి రావలసిన వారెవరో వెలుపల నిలిచి యున్నారని సూచించుచున్నది. "దేవుడు సీయోను గుమ్మములను ప్రేమించుచున్నాడు" అని లేఖనము చెప్పుచున్నది. సీయోను గుమ్మములలో ప్రవేశించుటకు దేవుడు ఆశించుచు ఆనందించుచున్నాడు. దేవుని ప్రేమను సంపూర్ణతతో మనము అనుభవింప కోరిన యెడల, మనము సీయోనులో ఒక భాగముగా నుండవలెను.

"సీయోను పునాది పరిశుద్ధ పర్వతములమీద వేయబడియున్నది" (వ. 1). కదలింపబడజాలనట్టి బలమైన స్థిరమైన పునాది కలదు. అది పరిశుద్ధ పర్వతములలో నున్నది. దేవుడు పరిశుద్ధుడై యున్నరీతిగా, మనము సంపూర్ణ పరిశుద్ధులుగా నుండగోరిన యెడల, ఒక బలమైన పునాది మీదికి ఆయన మనలను తెచ్చును.

"దేవుని పట్టణము" (వ. 3). ఇది ఆ స్థలమునకు ఇంకొక పేరు.

"సీయోను" అనినను "దేవుని పట్టణము" అనినను భేదము లేదు.

"సర్వోన్నతుడు తానే దాని స్థిర పరచును" (వ. 5). యాకోబు నివాసములలో నివసించువారు, తాము స్థిరపడుటకు మానవశక్తిమీద ఆధార పడుదురు. అయితే సీయోనులోనికి వచ్చువారు దేవునివల్లనే స్థిరపరచబడుదురు.

"యెహోవా జనముల సంఖ్య వ్రాయించును" (వ. 6). సీయోనులో నివసించువారి విషయమైతే సమస్తమును దేవుడు వ్రాయించి పెట్టును. మనంతట మనము చేయునదంతయు వ్యర్థమే. అయితే దేవుని మందిరమందు మనము ఏది చేసినను ఎల్లకాలము జ్ఞాపకముండుటకై వ్రాయించి పెట్టబడును.

"గాయకుడు" (వ. 7). యాకోబు నివాసములలో, కన్నీరు, దుఃఖములు, ఆటంకములు వుండును. అయితే సీయోనులో గాయకులు పరమ గీతములు పాడుదురు. వాద్యములు వాయించువారు నుందురు. ఇది మహానందమును సూచించుచున్నది. సీయోనులో సంతోషము యెంత గొప్పదనగా వాద్యములు వాయించువారు యేకముగా ఆనందించుచున్నారు.

"మా యూటలన్నియు నీయందే యున్నవి" (వ. 7). ఊట అనగా బావులు మొదలైనవాటియొక్క మరుగైన పుట్టుక స్థానము. ఒక యూటలో యెంత నీరున్నదో మనము చెప్పలేము. ఎల్లప్పుడు మంచినీరు ప్రవహించును, ఎండిపోదు. అందుచే సీయోనులో నుండి వారిని సంతోషపరచుటకు దండిగా నీటి యూటలున్నవని దేవుడు చెప్పుచున్నాడు. సీయోనులోనే మనము పోగొట్టుకొనిన సమస్తము తిరిగి దొరుకును. గనుక సీయోనువైపే మన గమనముంచునట్లు దేవుడు ప్రయత్నించుచున్నాడు.

## అబ్రాహాము, మెల్కీసెదెకు

ఆదికాండము 14:18, 19. దేవుని వాక్యమందు ఇక్కడే మొదటిసారిగా సీయోను పేరు చూచుచున్నాము. 'షాలేము' అర్థము సమాధానము. షాలేము లేక యెరూషలేము అనగా సమాధానపురము.

1. చెప్పులవారైనను

పెద్ద శోధన అబ్రాహామును ఎదుర్కొనబోయెను. అతడు యుద్ధములో ప్రవేశించి సొదొమరాజుయొక్క శత్రువులను ఓడించి సొదమ ప్రజలను, పెక్కు ధనమును తిరిగి తెచ్చెను. కృతజ్ఞతాపూర్వకముగా రాజు అబ్రాహాముకు బహుమతి యివ్వదలచి వారు తెచ్చుకొనిన ఐశ్వర్యమునంతయు అతనికి యివ్వబోయెను. అబ్రాహామునకు యిదెంత శోధన! ఈ శోధనను అబ్రాహాము యెదుర్కొనుటకు ముందు, సొదొమరాజు అతనిని మోసగించుటకుముందు, దేవుడు అతని యొద్దకు షాలేము రాజును సర్వోన్నతుడగు దేవుని యాజకుడునగు మెల్కీ సెదెకును పంపెను. ఈయన అబ్రాహామును ఆశీర్వదించెను (వ. 19). సొదొమరాజు ఆ ఐశ్వర్యమును యివ్వబోగా అబ్రాహాము ఒక నూలు పోగైనను, చెప్పులవారైనను ముట్టుకొనననని చెప్పెను. యుద్ధమందు అతని చెప్పులేమైనను అరిగిపోయి యుండవచ్చును, వస్త్రములు చినిగిపోయి యుండవచ్చును. ఆ చెప్పులకొరకు ఒక వారు అవసరమై యుండెనేమో! చినిగిన బట్టలుత కుట్టుకొనుటకు నూలు కావలసియుండెనేమో! అయినను ఇట్టి అల్ప వస్తువులను సహితము సొదొమరాజు దగ్గర తీసుకొనుటకు ఒప్పుకొన లేదు.

ఇంత బలముగా నిలుచుటకు విశ్వాసము అవసరము. ఈ విశ్వాసము అబ్రాహాముకు యెట్లు లభించెను? సీయోను నుండి సర్వోన్నతుని యాజకుడగు మెల్కీ సెదెకు వచ్చియుండెను. ఆయన దగ్గరనుండి నిజమైన ఆశీర్వాదము అబ్రాహాము పొందియుండెను. భూమి ఆకాశములకు కర్తయైయున్న సర్వోన్నతుని నామమున మెల్కీ సెదెకు అబ్రాహామును దీవించియుండెను. అనగా సొదొమరాజు యెన్నడైనను యివ్వగలిగిన దానికంటె ఎంతో అధికమైన ఆశీర్వాదమును మెల్కీ సెదెకు అబ్రాహాముకు ఇచ్చెను. మెల్కీ సెదెకు ద్వారా సీయోను దృశ్యము కొంత అబ్రాహాముకు కనబడుటచేత అతని విశ్వాసము అధికమాయెను. ఇంతటిగొప్ప శోధనను యెదిరించుటకు శక్తి కలిగెను.

2. ఆహారము, ద్రాక్షారసము

మెల్కీ సెదెకు అబ్రాహామును దీవించుటయేగాక సీయోనునుండి అతనికి ఆహారము కూడ తెచ్చి యిచ్చెను. ఆహారమును, ద్రాక్షరసమును యిచ్చెను (ఆదికాండము 14:18). యుద్ధభూమియందుండినందువలన అబ్రాహాము బహుగా అలసియుండెను. ఆ సమయమందు సొదొమరాజు ఆతనికి కోడికూరగాని మాంసము కూరగాని బిరియానిగాని యివ్వబోయి యుండినయెడల, అబ్రాహాము అతనితో - "వందనాలండి, మీ కోడికూర, మాంసముకూర ఏదికూడ నాకువద్దు" అని యుండును. అబ్రాహాము అతనిని శత్రువునుండి విడిపించినందులకు సొదొమరాజు అబ్రాహామునకు అతని మనుష్యులకును సంతోషముగా భోజనములు పెట్టించియుండును. అయినను అంతకుముందే దేవుడు మెల్కీ సెదెకును సీయోను నుండి ఆహారముతో పంపుటచేత, సొదొమరాజు విందును అబ్రాహాము త్రోసివేసెను. సర్వోన్నతుని యాజకుడు తెచ్చిన ఆహారము, ద్రాక్షారసము అబ్రాహాము యొక్క అలసటను తీర్చివేసి యుండెను. దేవుని సీయోనుకు వచ్చిన యెడల నీ ఆయాసము బడలిక అంతయు యెగిరిపోవును.

శరీరము అంత యెక్కువగా బాగులేకున్నప్పుడు ఒక చిన్నదానికే జనులు దేవుని మందిరమునకు వెళ్లకుందురు. యేమందురనగా - "హెబ్రో నుకు వెళ్లలేము, ఆ మీటింగులకు అంతముండదు. మాకు ఒంట్లో బాగలేదు, రాత్రి నిద్ర పట్టనేలేదు". వెళ్లకుండిన యెడల ఒంట్లో కొంత మేలుగా నుండునని తలంచెదరు. కనుక యింటిలో వుండిపోదురు. అయితే ఆ జబ్బు యింకను యెక్కువగును. మరికొందరు దేవుని మందిరమునకు వెళ్లకున్నారు. ఎందుకనగా వారు వ్యసనముగా నున్నారట. మనస్సు బాగులేదట. యెవరైన వారిని యేదైన అనియుండవచ్చును. దీనివలన నొచ్చుకొని దేవుని మందిరమునకు వెళ్లకుందురు. అట్లు చేయుటవలన వారికి యేమియు మేలు కలుగక మరింత

బాధపడుచున్నారు. దేవుని మందిరమునకు వచ్చుట ద్వారానే దేవుని జనులు పరలోక ఆహారము, దైవబలము, సంతోషము పొంది దేవుని యెదుట నూతనముగా ఆరోగ్యముగా బలముగా యుందురు. మరియు అబ్రాహాము వలె ప్రతి శోధనను యెదిరింతురు.

3. దశమ భాగములు

ప్రతి ఆశీర్వాదము దేవుని యొద్ద నుండియే వచ్చుచున్నదని అబ్రాహాము నమ్మెను. కావున దశమ భాగమును దేవునికి యిచ్చెను (ఆదికాండము 14:20).

మెల్కీ సెదెకు అబ్రాహామును ఆశీర్వదించినప్పుడు, శత్రువుల చేతినుండి తన్ను నిజముగా దేవుడే తప్పించి అనేక గొప్ప ఆశీర్వాదములను యిచ్చి యుండెనని నమ్మెను. అందుచేత తనవద్దనున్న సమస్తములోనుండి దశమ భాగమును దేవునికి యిచ్చెను. దశమ భాగము విశ్వాసమును, కృతజ్ఞతా స్తుతులను కూడ తెలుపుచున్నది. యిట్లిచ్చుటద్వారా అబ్రాహాము - "నా స్వప్రయత్నముతో నేను పొందగలిగిన దానికంటే యెంతో దేవుడు నాకొసగి యున్నాడు" అనుచున్నాడు.

అది సత్యమే. దేవుడు మనలను ఆశీర్వదించితేనేగాని మనకు సంతోషానుభవము కలుగదు. ఎంతో పాటుపడి పనిచేసి యెంతో డబ్బు సంపాదించినను, దేవుడు మనకు మంచి ఆరోగ్యము యివ్వని యెడల, ఆ ధనమును యేలాగు అనుభవించగలము? ఇంటియందు దేవుడు సమాధానము యివ్వని యెడల మన సంపాదన అంతయు తప్పకుండా వ్యర్థమే. మనము యేమి కలిగియున్నను దానిని అనుభవించుటకు దేవుని దయ అవసరమైయున్నది. ఆయన దయ లేనిదే మనకు యేమియులేదు, యేమియు అనుభవింపలేము.

## అబ్రాహాము, మోరియా పర్వతము

2 దిన వృత్తాంతము 3:1 ప్రకారము అబ్రాహామునకు కలిగిన కడపటి పరీక్ష యొక్క స్థలము మోరియా పర్వతము (ఆదికాండము 22). దేవుడు

పదిమారులు అబ్రాహాముకు ప్రత్యక్షమాయెను. పదవసారి మోరీయా పర్వతముమీద ప్రత్యక్షమాయెను. దేవుని స్నేహితుడగుటకు అబ్రాహాము యీ పది పరీక్షలు గెలువవలసి యుండెను. కడపటి పరీక్ష గెలుచుటకు దేవుడు అతనిని సీయోనుకు తేవలసియుండెను.

దీని తరువాత దేవుడు అబ్రాహాముకు పూర్తిగా విధేయుడాయెను. అబ్రాహాము దేవుడు చెప్పినట్లు చేసెను. ఆయన ఆజ్ఞాపించినదంతయు చేసెను. దహనబలి యిచ్చుటకు తన ఏక కుమారుని మీద కట్టెలు పెట్టి మోయించి మోరీయా కొండకు అతనిని తీసికొని వెళ్లెను (ఆదికాం. 22:9). ప్రశ్నించక, సందేహించక బలిపీఠముపై కుమారుని పరుండబెట్టి, చేయిచాపి, అతనిని వధించుటకై కత్తి యెత్తెను. అప్పుడు దేవుడు - "అబ్రాహామా! అబ్రాహామా! ఆ చిన్నవాని మీద చెయ్యి వేయకుము" అని పిలిచి చెప్పెను (ఆదికాండము 22:11,12). అప్పుడు అబ్రాహాము కన్నులెత్తి చూడగా పొదలో కొమ్ములు తగులుకొని యున్న ఒక పొట్టేలు వెనుక తట్టున కనబడెను. ఆ పొట్టేలు పారిపోవుటకు వీలుకాదు. దేవుడే ఆ పొట్టేలును అక్కడికి తెచ్చియుండగా అది యెట్లు ఆయన చేతినుండి తప్పించుకొనగలదు? ఎవడును దానిని ఆ పొదలో తెచ్చి పెట్టలేదు. ఒక సంకల్పము కొరకు అది పొదలో చిక్కుకొనెను. దాని ద్వారా దేవుడు అబ్రాహాముతో మాట్లాడుచుండెను. ఆయన "అబ్రాహామా! సంపూర్ణముగా నాకు విధేయుడవైతివి. నన్ను యెన్నడైనను సందేహించలేదు. నేను ఆజ్ఞాపించినది చేసితివి. ప్రశ్నించక, సందేహించక నా మాట వింటివి. నీవు పరీక్ష గెలిచితివి" అని చెప్పెను.

ఇంకను దేవుడు అబ్రాహాముకు యేమి చెప్పెను? "పొదలో తగులుకొనిన పొట్టేలును చూసితివి కదా? అదే విధముగా నేను నీకు బద్ధుడనై యున్నాను. పూర్వము నేను నిన్ను ఆజ్ఞాపించితిని, నీవు నాకు విధేయుడైతివి. ఇప్పుడు నీవు నన్ను ఆజ్ఞాపించుము. నీ మాటకు విధేయుడనగుదును". ఇంతకంటె

భాగ్యమా! ఇప్పుడు అబ్రాహాము దేవుని ఆజ్ఞాపించగలడు. నిత్యత్వమునకు దేవుడు అబ్రాహామునకు బద్ధుడాయెను. ఈ నాటికిని అబ్రాహాము సంతానము యెడల ఆ నిబంధనను నెరవేర్చుచున్నాడు. అబ్రాహాము సంతతివారు దేవుని యెడల తప్పినను, ఆయనమీద తిరుగబడినను దేవుడు మోషేతో - "నేను అబ్రాహాము ఇస్సాకు యాకోబు దేవుడను" అని అబ్రాహాముతో చేసిన నిబంధనను బట్టి చెప్పెను.

అట్లే నిర్భయముగాను, నిస్సందేహముగాను సీయోనులోనికి వచ్చిన యెడల దేవుడు నీకు బద్ధుడై యుండును. నీకేమి కావలెనో అది చేయుమని నీవు ఆజ్ఞాపించవచ్చును. ఆయన దానిని చేయును. ఏ మానవుడైనను మనకు అంత విస్తారముగ యివ్వగలడా? తెలివితక్కువవారమైన మనమీద మనమే అనగా మన మానవజ్ఞానము, శక్తిమీద ఆనుకొనుచున్నాము. కాని సీయోనుకు వచ్చినప్పుడే దేవుడు మనకు సంపూర్ణబద్ధుడగుటకు, విశ్వాసముద్వారా పోగొట్టుకొనినదంతయు మనము తిరిగి పొందుటయు జరుగును. అబ్రాహాము ఎన్నో పొరబాట్లు చేసియున్నాడు. భార్యయగు శారామాట విని హాగరును వివాహమాడుట భయంకరమైన పొరబాటు. దీనివలన దేవుని జనులను ఇష్మాయేలు వంశస్థులు ఎల్లప్పుడు తొందర పెట్టుచుండిరి. అయినను సీయోనులో అబ్రాహాము సమస్తమును తిరిగి పొందెను. మన నష్టములు మెండుగా నుండవచ్చును. అయినను సీయోనుకు లేక దేవుని మందిరమునకు వచ్చిన యెడల అవన్నియు మనము తిరిగి పొందుదుము.

సీయోనుకు వచ్చుటచేత అబ్రాహామునకు నిజమైన విశ్వాసము యివ్వబడెను. నిస్సందేహముగా అతనికి ముందే కొంత విశ్వాసముండెను. దేవుడు అతనితో మాట్లాడగా, కల్దీయుల ఊరు అను పట్టణమును విడిచిపెట్టి అతడు రాలేదా? ఇది ఒక మహా త్యాగమే! ఎందుకనగా ఇంటిని, కుటుంబమును, ఆస్తిని అంతయు విడిచిపెట్టి, దేవునిమాట వినెను. అయినను అప్పటి విశ్వాసము

అసంపూర్ణముగనే యుండెను. ఆదికాండము 22లో అతడు సీయోనుకు వచ్చినప్పుడే నిజమైన విశ్వాసము యివ్వబడెను. తన కుమారుని వధించినను దేవుడు అతనిని తిరిగి లేపనెత్తునని నమ్మెను. కుమారుని వధింపబోవు చుండెను. అయినను ఆదే సమయమందు దేవుడు తన మాట మార్చని వాడనియు, ఇస్సాకును తిరిగి బ్రతికించుననియు ఎరిగి యుండెను. ఇంతటి విశ్వాసము కలిగియుండుట సులభము కాదు.

దేవుని మందిరమునకు వెళ్లుట మానవద్దు. దానిని తృణీకరించవద్దు. దేవుని మందిరమందు నీ సంపూర్ణ భాగమును నెరవేర్చుము. అప్పుడు నీవు పోగొట్టుకొనిన సమస్తము నీకు తిరిగి దొరుకును.

అబ్రాహాము జీవిత చరిత్రలోని ఈ రెండు పాఠములు నేర్చుకొనుట చాలా ప్రాముఖ్యము. నీకు కలిగినదానిలో నీవు దేవుని ఘనపరచుము. నిన్ను ఆశీర్వదించువాడు దేవుడేయని ఒప్పుకొనుము. ఇదే మొదటి పాఠము. రెండవది, బలమైన సామాన్య విశ్వాసముతో ఆయన మందిరమునకు రమ్ము, అప్పుడు సంపూర్ణముగా దేవుని సంకల్పములో నీవు బంధింపబడినవాడవగుదువు.